VELTHURU TELUGU DAILAY

వెలుతురు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
శనివారం 25.04.2026

సంపుటి: 07 సంచిక: 320
పేజీలు: 12 వెల: రూ. 5/

ANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH

Velthuru Newspaper

రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్

2

వేసవిలో దేశవ్యాప్తంగా 18,262 ప్రత్యేక రైళ్లు
సెలవుల దృష్ట్యా భారతీయ రైల్వే మెగా ప్రణాళిక
ఏప్రిల్ 15 నుండి జూలై 15 వరకు ప్రత్యేక సర్వీసులు
రద్దీ మార్గాలపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమీక్ష
11,878 ట్రిప్పులకు ఇప్పటికే వెలువడిన నోటిఫికేషన్
ప్రధాన స్టేషన్లలో రియల్ టైమ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్ అమలు
ఆర్పీఎఫ్ పర్యవేక్షణలో క్రమబద్ధమైన బోర్డింగ్ సౌకర్యం
ఢిల్లీ, ముంబయి, బెంగళూరు మార్గాల్లో అదనపు కోచ్‌లు
ప్రయాణికుల భద్రత, సౌకర్యాల కోసం ప్రత్యేక సిబ్బంది

ఆడబిడ్డల రక్షణకు హామీ ఇస్తున్నా

బెంగాల్ మహిళలకు ప్రధాని మోదీ భరోసా

టీఎంసీకి చరమగీతం పాడాలని పిలుపు
దీదీ మహిళల భద్రత గాలికొదిలేశారని ఆగ్రహం
ఆర్జీ కర్ బాధితురాలి తల్లికి టికెట్‌తో కీలక నిర్ణయం
మే 4 తర్వాత ప్రతి అన్యాయంపై విచారణ జరిపిస్తామని హామీ
చొరబాటుదారుల ఆట కట్టిస్తానని హెచ్చరిక
భారీ పోలింగ్ మార్పుకు సంకేతమన్న ప్రధాని

పశ్చిమ బంగాల్ వెలుతురు
ఏప్రిల్ 24:

పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర మహిళా ఓటర్లకు బలమైన సందేశాన్ని పంపారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం మహిళా వ్యతిరేక ధోరణితో వ్యవహరిస్తోందని, ఆ అరాచక శక్తుల నుంచి విముక్తి పొందాలంటే బీజేపీకి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీఎంసీ పాలనలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, సిండికేట్ గూండాల ఆగడాలు మితిమీరిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం భయం, అవినీతి, చొరబాటుదారుల ఆక్రమణలతో రాష్ట్ర భవిష్యత్తును మమతా బెనర్జీ సర్కార్ దెబ్బతీసిందని మండిపడ్డారు. నిరుద్యోగం, వలసల ఒత్తిడి నుంచి బంగాల్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉందని ..మిగతా3లో

అమెరికాతో బలపడుతున్న
భారత్ బంధం

'మిషన్ 500' లక్ష్యంగా వాణిజ్య ప్రస్థానం

రాయబారి వినయ్ క్వాత్రా కీలక వ్యాఖ్యలు
మోదీ, ట్రంప్ మధ్య స్నేహభావమే వెన్నెముక
ఏటా 500 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం
రక్షణ రంగంలో పదేళ్ల ఫ్రేమ్‌వర్క్ తో భాగస్వామ్యం
ఏఐ, న్యూక్లియర్ టెక్నాలజీ రంగాల్లో విస్తృత సహకారం
ఖనిజాలకు ఒకే దేశంపై ఆధారపడకుండా భద్రతా చర్యలు
వికసిత్ భారత్ 2047 లక్ష్యం దిశగా వేగంగా మారుతున్న భారత్
భారతీయులపై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన విదేశాంగ శాఖ

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

భారత్, అమెరికా దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం సరికొత్త శిఖరాలకు చేరుకుంటోందని అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా స్పష్టం చేశారు. వాషింగ్టన్‌లో హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన 'ది న్యూ ఇండియా కాన్వరెన్స్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధం, పరస్పర గౌరవం రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత వేగవంతం ..మిగతా3లో

ప్రభుత్వంతో ఆర్టీసీ చర్చలు సఫలం

మూడు ప్రధాన డిమాండ్లకు సర్కార్ ఆమోదం

హైదరాబాద్ వెలుతురు
ఏప్రిల్ 24:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులతో ప్రభుత్వ కమిటీ జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. సమ్మెకు దారితీసిన మూడు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతో వివాదం కొలిక్కి వచ్చింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని మంత్రుల బృందం కార్మిక నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపింది. ఈ సమావేశంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విలీన నమూనాలను ఇప్పటికే అధికారులు అధ్యయనం చేశారని, ఆ నివేదికల ఆధారంగా ముందుకు వెళతామని మంత్రులు హామీ ఇచ్చారు. అలాగే కార్మిక సంఘాల (ట్రేడ్ యూనియన్) ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం తన వైపు నుంచి అంగీకారం తెలిపింది. యాజమాన్యంతో చర్చించి త్వరలోనే ఎన్నికల షెడ్యూలు ఖరారు చేసుకోవాలని సూచించింది. ఆర్టీసీ కార్మికులకు అత్యంత కీలకమైన 2021 మరియు 2025 వేతన సవరణ (పీఆర్సీ) బకాయిలు, ..మిగతా 3లో

విలీనంపై మంత్రుల బృందం
గ్రీన్ సిగ్నల్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కార్యాచరణ
కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా
2021, 2025 పీఆర్సీ బకాయిలు, ఫిట్‌మెంట్ చెల్లింపు
ప్రైవేటు, ఎలక్ట్రిక్ బస్సులు వచ్చినా ఉద్యోగభద్రత
సమ్మె రెండో రోజే చర్చలకు పిలిచిన సీఎం చొరవపై ప్రశంసలు
మహాలక్ష్మి పథకం నష్టాలను భరిస్తూ ఆదుకోవడంపై చర్చ
ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాల చెల్లింపుపై హర్షం
దశాబ్దాల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు



బెంగాల్ ఫలితాలపై అమిత్ షా ధీమా

3

తొలి దశలోనే 110 సీట్లు గెలుస్తామని వెల్లడి
ప్రజలు మార్పును కోరుకుంటున్నారని వెల్లడి
హింస లేని ఎన్నికలే నిదర్శనమన్న హోంమంత్రి
బెంగాల్ బిడ్డనే సీఎం పీఠంపై కూర్చోబెడతామని హామీ

వచ్చే వానాకాలంలో సాగు చేసే సన్న వరి రకాలపై మంత్రి కీలక సమీక్ష

3

రైతులు ఎక్కువగా ఎంచుకునే విత్తనాలు, అధిక దిగుబడి మరియు మార్కెట్లో డిమాండ్ ఉన్న విత్తనాలనే అందుబాటులో ఉంచాలి
MSP భారాన్ని రాష్ట్రాలపై మోపొద్దు కేంద్రంపై మంత్రి తుమ్మల విమర్శలు
MSP ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రమే కొనాలని మంత్రి డిమాండ్

బీజేపీ నాటకాలు బెంగాల్‌లో నమ్మరు

మోదీ , అమిత్‌షాలపై మమతా బెనర్జీ ఆగ్రహం
ఢిల్లీ నుంచి భేల్‌పూరీ తెచ్చి రుచి చూపిస్తానన్న దీదీ
ప్రధాని మోదీ ఝాల్‌మురీ కొనుగోలు అంతా ఒక స్క్రిప్టెడ్ డ్రామా
ఫోటోల కోసమే పది రూపాయలు ఇచ్చి వెళ్లారని మమత ఎద్దేవా
చాయ్‌వాలా తర్వాత ఇప్పుడు ఝాల్‌మురీ కార్డు వాడుతున్న బీజేపీ
ఈవీఎంలను ఫిక్స్ చేశారా? బీజేపీ ధీమాపై ముఖ్యమంత్రి అనుమానం
విరోధుల జాతకాలు నా దగ్గర ఉన్నాయి.. అందరినీ నోట్ చేసుకున్నా
బంగాల్ గెలిచిన తర్వాత ఢిల్లీ పీఠంపై కన్నేస్తాం
అధికారం ముఖ్యం కాదు.. బీజేపీ పతనం కావడమే నా లక్ష్యం

పశ్చిమ బంగాల్ వెలుతురు ఏప్రిల్ 24:

పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వేడి కొనసాగుతుండగా, తాజాగా 'ఝాల్‌మురీ' (మసాలా మరమరాలు) అంశం ప్రధాన ..మిగతా 3లో

కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఊరట

3

15 ఏళ్ల నాటి 'మిలియన్ మార్చ్' కేసు కొట్టివేసిన హైకోర్టు
తెలంగాణ ఉద్యమ కాలం నాటి పాత కేసుల నుంచి విముక్తి
2011 ట్యాంక్‌బండ్ మిలియన్ మార్చ్ ఘటనపై కీలక తీర్పు

రాజకీయ కారణాలతో కూడిన కేసులను కొనసాగించాల్సిన పని లేదు
ఉమ్మడి పాలనలో నమోదైన ఆరోపణలను కొట్టివేసిన న్యాయస్థానం
ఉద్యమ నేతలపై ఆంక్షల ధిక్కరణ కేసులకు తెర
శాంతి భద్రతల విఘాతం ఆరోపణల్లో వాస్తవం లేదని వెల్లడి
హైకోర్టు నిర్ణయం పట్ల బీఆర్ఎస్ శ్రేణుల హర్షాతిరేకాలు
రాష్ట్ర సాధన పోరాటంలో అక్రమ కేసులు పెట్టారని నేతల వాదన

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రిక్తత

2

శంకర్ గౌడ్ కు నివాళి అర్పించేందుకు ముత్తేజీపేట విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్
శంకర్ గౌడ్ శవాన్ని నర్సంపేట డిపోకు తరలించాలని కోరిన కుటుంబ సభ్యులు
డిపోకు తీసుకొస్తే శంకర్ గౌడ్ కు నివాళి అర్పించే అవకాశాన్ని కల్పించాలని కోరిన కార్మికులు
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలున్నందున నసేమిరా ఒప్పుకోని పోలీసులు
శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని వెల్లడి
పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి

సింగపూర్ సుపరిపాలనపై మంత్రుల బృందం అధ్యయనం

4వ రోజు పర్యటనలో కీలక అంశాలపై చర్చ
సింగపూర్ పీఎంవో మాజీ మంత్రి లిమ్ స్వీ సేతో భేటీ
ప్రభుత్వం, ప్రైవేట్ రంగాలు పనిచేసే విధానాలపై ఆరా
ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థల బలోపేతంపై దృష్టి

2

ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

మహిళా బిల్లుపై సీఎం చంద్రబాబు రాజకీయ సమరశంఖం
మూడు రోజుల ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు
విశాఖ, విజయవాడ, తిరుపతిలో భారీ బహిరంగ సభలు

2

వాహనదారుల తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలపై డీజీపీ శివధర్ రెడ్డి ఆందోళన
ప్రమాదాల కారణంగా రోజుకు 20 కుటుంబాల్లో విషాదం
ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే ఘటనలకు ప్రధాన కారణం
హెల్మెట్, సీట్ బెల్ట్ ధరిస్తే ప్రాణాపాయం తప్పే అవకాశం

2

వాహనదారుల తప్పిదాలతోనే ప్రమాదాలు

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మెజారిటీ ఘటనలు వాహనచోదకుల స్వీయ తప్పిదాల వల్లే సంభవిస్తున్నాయని డీజీపీ శివధర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వాహనదారుల్లో కనీస సామాజిక స్పృహ లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేయడం వల్ల విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల ధాటికి రోజుకు సగటున 20 కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన చెందారు. ఒక వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, సామాజికంగా చితికిపోతుందనే విషయాన్ని ప్రతి డ్రైవర్ గుర్తుంచుకోవాలని సూచించారు. ఇటువంటి అకాల మరణాలను అడ్డుకునేందుకు పోలీస్ శాఖ శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే ప్రజల్లో అవగాహన పెంచేందుకు 'ఎరైవ్ఎలైవ్' అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉండటానికి ప్రధాన కారణం అజాగ్రత్తేనని డీజీపీ విశ్లేషించారు. ఎడమ వైపు నుంచి ఓవర్ టేక్ చేయడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి స్టీరింగ్ పట్టడం వంటి ఉల్లంఘనలే మరణాలకు దారితీస్తున్నాయని మండిపడ్డారు. హెల్మెట్ ధరించడం లేదా సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని అధ్యయనాల్లో తేలిందని చెప్పారు. వ్యవస్థాపరమైన లోపాలను కూడా ప్రభుత్వం గమనిస్తోందని, ముఖ్యంగా ఫీడర్ రోడ్లు ప్రధాన రహదారుల్లో కలిసే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు లేకపోవడాన్ని గుర్తించామని వెల్లడించారు. అటువంటి బ్లాక్ స్పాట్స్ దగ్గర తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాహనదారులు కూడా ప్రధాన రహదారిపైకి వచ్చే ముందు వేగం తగ్గించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారికి జరిమానాల విషయంలో ప్రభుత్వం ఇప్పుడు కఠినంగా వ్యవహరిస్తోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా చలానాలపై డిస్కౌంట్లు ఇస్తారని లేదా మొత్తానికే రద్దు చేస్తారని భావించి నిబంధనలు ఉల్లంఘించడం సరికాదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇకపై చలానాల చెల్లింపులో ఎటువంటి రాయితీలు ఉండబోవని, కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే మరణాల సంఖ్య తగ్గుతుందని నమ్ముతున్నామని చెప్పారు. పోలీసులు తీసుకున్న ముందస్తు చర్యల వల్ల 2025 మొదటి మూడు నెలలతో పోలిస్తే, ఈ ఏడాది ఇదే కాలంలో మరణాల సంఖ్య 2,102 నుండి 1,770 కి తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే సుమారు 16 శాతం మరణాలు తగ్గాయని, క్షతగాత్రుల సంఖ్యలో కూడా గణనీయమైన మార్పు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిబంధనలు పాటించని వారిపై మరింత నిఘా పెంచుతామని, వేల కుటుంబాల క్షేమం కోరి ఇలాంటి కఠిన చర్యలు తీసుకోక తప్పదని డీజీపీ వివరించారు.

సింగపూర్ సుపరిపాలనపై మంత్రుల బృందం అధ్యయనం

అమరావతి వెలుతురు ఏప్రిల్ 24:

ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం సింగపూర్ పర్యటన నాలుగో రోజు అత్యంత బిజీగా సాగింది. ఆధునిక ప్రజాస్వామ్యంలో సింగపూర్ ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి, పారిశ్రామిక, సాంకేతిక మరియు పర్యావరణ అనుకూల విధానాలను మంత్రులు లోతుగా అధ్యయనం చేస్తున్నారు. సింగపూర్ పీఎంవో మాజీ మంత్రి లిమ్ స్వీ సే ఈ సందర్భంగా మంత్రుల బృందంతో సమావేశమై అక్కడి పాలనా సంస్కరణలను వివరించారు. కేవలం ఆర్థిక ప్రయోజనాలే కాకుండా సమాజంలోని ప్రతి వర్గాన్ని కలుపుకుంటూ సాగే సమష్టి ప్రయాణం వల్ల కలిగే ఫలితాలను ఆయన వివరించారు. ప్రజలు, ప్రభుత్వం మరియు ప్రైవేట్ రంగాలు సమన్వయంతో పనిచేయడం ద్వారా దీర్ఘకాలిక అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో చర్చించారు. ముఖ్యంగా నిజాయితీతో కూడిన పాలన ద్వారా ప్రజల్లో విశ్వసనీయతను నిర్మించడం, నియోజకవర్గ స్థాయిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించే వ్యవస్థలను బలోపేతం చేయడంపై మంత్రులు అడిగిన సందేహాలను లిమ్ స్వీ సే నివృత్తి చేశారు. ఈ పర్యటనలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, బి.సి. జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొని సింగపూర్ అనుభవం ఏపీలో అమలు చేయడానికి ఉన్న సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నారు. సింగపూర్ 'స్మార్ట్ నేషన్' విధానం మరియు హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డు పనితీరుపై మంత్రుల కోసం ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. నగరాల్లో రవాణా వ్యవస్థలు, వ్యర్థాల నిర్వహణలో సింగపూర్ అనుసరిస్తున్న వినూత్న మోడల్స్‌ను మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిజిటల్ గవర్నెన్స్ ద్వారా పారదర్శకతను పెంచడం, సింగిల్ విండో సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంపై నిపుణులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ మరియు వార్డు సచివాలయ వ్యవస్థను మరింత జవాబుదారీగా మార్చేందుకు సింగపూర్ మున్సిపల్ సర్వీస్ ఆఫీస్ తరహా మెకానిజంను అమలు చేసే అంశంపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక సమస్యలను గుర్తించి నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేందుకు అక్కడ ఉన్న డిజిటల్ వ్యవస్థలు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. పరిశ్రమలు మరియు స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్) మెరుగైన ఫలితాలు ఎలా సాధించవచ్చో చర్చించారు.

అంతకుముందు మూడవ రోజు పర్యటనలో భాగంగా సింగపూర్ పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషించిన జేటీసీ కార్పొరేషన్ కార్యకలాపాలను మంత్రులు పరిశీలించారు. జురాంగ్ ఐలాండ్, పన్‌నార్త్, చంగీ బిజినెస్ పార్క్ మరియు పుంగోల్ డిజిటల్ డిస్ట్రిక్ట్ వంటి అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టుల అభివృద్ధి వెనుక ఉన్న ప్రణాళికలను అక్కడి అధికారులు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఈ తరహాలో అత్యాధునిక పారిశ్రామిక వాడల అభివృద్ధి, స్మార్ట్ ఎస్టేట్‌ల నిర్మాణం మరియు గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అమలు చేసే దిశగా మంత్రులు సమాలోచనలు చేస్తున్నారు. సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్ఎఫ్) నిర్వహించిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని ప్రముఖ వ్యాపారవేత్తలతో ముఖాముఖి చర్చలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను వివరించి సింగపూర్ సంస్థలను ఏపీకి ఆహ్వానించారు. ఈ పర్యటన ద్వారా అందిన అంతర్జాతీయ అనుభవాలను క్రోడీకరించి రాష్ట్రంలో మెరుగైన పాలన మరియు మౌలిక సదుపాయాల కల్పనకు విధివిధానాలు రూపొందించనున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రిక్తత

నర్సంపేట వెలుతురు ఏప్రిల్ 24:

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. శంకర్ గౌడ్ భౌతిక కాయాన్ని నర్సంపేట ఆర్టీసీ డిపోకు తరలించాలన్న కుటుంబ సభ్యుల, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తిని పోలీసులు తిరస్కరించడంతో పెద్ద ఎత్తున ఆందోళన మొదలైంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకర్ గౌడ్ భౌతిక కాయానికి నివాళి అర్పించేందుకు నర్సంపేట మండలం ముత్తోజీపేటలోని ఆయన నివాసానికి వచ్చారు.

తమ విజ్ఞప్తిని పోలీసులు పట్టించుకోవడం లేదని చెప్పడంతో రంగంలోకి దిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పోలీసులతో మాట్లాడారు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. నర్సంపేట డిపోలో 22 ఏళ్లపాటు శంకర్ గౌడ్ సేవలందించినందున ఆ డిపో వద్దకే భౌతిక కాయాన్ని తరలించి ఆయనను కడసారి చూసి నివాళులు అర్పించే అవకాశాన్ని సహచర ఆర్టీసీ కార్మికులను అనుమతించాలని కోరారు. నర్సంపేట డిపోకు తరలిస్తే శాంతి భద్రతలు తలెత్తుతాయని, ముత్తోజీ పేటలోనే తొందరగా అంత్యక్రియలు జరపాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయని పోలీసులు చెప్పారు.

దీంతో బండి సంజయ్ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''కనీసం మానవత్వం లేకపోతే ఎట్లా? కుటుంబ సభ్యుల విజ్ఞప్తిని, సహచర ఆర్టీసీ కార్మికుల ఆకాంక్షను పట్టించుకోకపోతే ఎట్లా? లా అండ్ ఆర్డర్ బాధ్యత రాకుండా నేను చేసుకుంటా. డెడ్ బాడీని నర్సంపేట డిపోకు తీసుకెళ్లేందుకు అనుమతించండి''అని చెప్పారు. అయినా పోలీసులు సేసేమిరా అనడంతో శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు రోదిస్తూ పోలీసుల తీరుపై మండిపడ్డారు. అదే సమయంలో బీజేపీ శ్రేణులు, ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని పోలీసుల తీరును నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డౌన్ డౌన్, ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం, దోపిడి రాజ్యమంటూ నినాదాలు చేశారు. శంకర్ గౌడ్ భౌతిక దేహాన్ని వారంతా కలిసి ఇంట్లో నుండి బయటకు తీసుకొచ్చారు. భౌతిక కాయాన్ని నర్సంపేటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకుని రోడ్డుపైనే శంకర్ గౌడ్ భౌతిక కాయాన్ని నిలువరించడంతో ఈ సందర్భంగా పోలీసులకు, బీజేపీ శ్రేణులకు, ఆర్టీసీ కార్మికుల మధ్య చాలా సేపు తోపులాట జరిగింది. పోలీసుల తీరును నిరసిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండుటెండలో నడిరోడ్డుపైనే శంకర్ గౌడ్ భౌతిక కాయం వద్ద కూర్చొని నిరసన తెలిపారు. దీంతో భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు, బీజేపీ కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు గంటపాటు పోలీసులకు, బీజేపీ శ్రేణులకు మధ్య పెనుగులాట జరిగింది. కోపోద్రిక్తులైన బీజేపీ శ్రేణులు, ఆర్టీసీ కార్మికులు శవ పేటికను పక్కకు తోసి శంకర్ గౌడ్ డెడ్ బాడీని తీసుకుని అంబులెన్స్ లోకి ఎక్కించారు. అంబులెన్స్ కదులుతుండగా మళ్లీ పోలీసులు అడ్డుకుని డెడ్ బాడీని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో పట్టరాని కోపంతో బీజేపీ శ్రేణులు, ఆర్టీసీ కార్మికులు, శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు పోలీసులకు, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ దాదాపు 3 గంటలకుపైగా రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో వరంగల్ మల్లంపేట రహదారి పూర్తిగా స్తంభించింది. అయినా పోలీసుల ససేమిరా అనడంతో విసిగిపోయిన శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు ''మీరే అంత్యక్రియలు నిర్వహించుకోండి. ఎలా చేస్తారో చూస్తాం'' అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వాహనంలోనే కూర్చుండిపోయారు. దీంతో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కేంద్ర మంత్రితో చర్చలు జరిపారు. సమయం మించిపోతోందని, అంత్యక్రియలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. వెంటనే కేంద్ర మంత్రి స్పందిస్తూ...''శంకర్ గౌడ్ అంత్యక్రియల విషయంలో ఆయన కుటుంబ సభ్యుల, ఆర్టీసీ జేఏసీ నేతల నిర్ణయమే ఫైనల్. వారు ఏం చెబితే దానికి మేం అంగీకరిస్తాం. దయచేసి రెచ్చగొట్టి ఇబ్బందులు సృష్టించొద్దు''అని కోరారు. ఈ నేపథ్యంలో శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులతో, ఆర్టీసీ జేఏసీ నాయకులతో పోలీసులు చర్చలు జరిపారు. అదే సమయంలో ప్రభుత్వ పెద్దలతో ఫోన్లో మాట్లాడించారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని, నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై చర్చలు జరుగుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని భరోసా ఇచ్చారు. దీంతో శాంతించిన కుటుంబ సభ్యులు, జేఏసీ నాయకులు శంకర్ గౌడ్ అంత్యక్రియలను నిర్ణయించి కేంద్ర మంత్రి బండి సంజయ్ కు తెలియజేయడంతో వారికి ఏ ఇబ్బందులు లేకుండా అంత్యక్రియలు నిర్వహించాలని పోలీసులకు చెప్పిన బండి సంజయ్ అక్కడి నుండి కరీంనగర్ కు తిరుగుపయనమయ్యారు. ముత్తోజీపేటకు రాగానే తొలుత కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ''శంకర్ గౌడ్ డెడ్ బాడీతో పోలీసుల రాజకీయాలేంది?. నర్సంపేట డిపో ఏమైనా పాకిస్తాన్ లో ఉందా? కాంగ్రెస్ ప్రభుత్వానికి అంత పట్టింపులెందుకు? శంకర్ గౌడ్ డెడ్ బాడీని పోలీసులు తీసుకెళ్లి ఏం చేసుకుంటారు? శంకర్ గౌడ్ భౌతిక దేహాన్ని నర్సంపేట ఆర్టీసీ డిపో వద్ద ఉంచి నివాళి అర్పించాలన్నది కుటుంభ సభ్యుల కోరిక. 22 ఏళ్ల అనుబంధమున్న ఆర్టీసీ డిపో వద్ద శంకర్ గౌడ్ భౌతిక కాయాన్ని కడసారి చూసి నివాళి అర్పించాలన్నది ఆర్టీసీ కార్మికుల ఆకాంక్ష. ఆర్టీసీ డిపో వద్ద శంకర్ గౌడ్ డెడ్ బాడీని 5 నిమిషాలు ఉంచేలా అనుమతించాలని కోరితే ఇంత గోడవ ఉండేది కాదు కదా?''అని అన్నారు. ''శాంతి భద్రతల సమస్యే ఉండదు...5 నిమిషాలు ఆర్టీసీ డిపో వద్ద ఉంచాలని చెప్పినా పట్టించుకోకపోతే ఎలా? శంకర్ గౌడ్ ఇంటి ముందు టెంట్ వేసిన వాళ్లను సైతం పోలీసులు బెదిరిస్తున్నారు. మేం చెప్పినట్లు వినకపోతే బెన్ ఫిట్స్ కూడా ఇవ్వబోమని శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారు. చివరకు శంకర్ గౌడ్ కొడుకును కొట్టి స్టేషన్ కు తరలించారు. ఇంతకంటే దారుణం ఏమైనా ఉందా? ఆర్టీసీ కార్మికులు ఏమైనా దొంగలా? లంగలా?. తమ సహచరుడిని కడసారి చూసుకుందామనుకుంటే ఎందుకు అనుమతించడం లేదు''అని మండిపడ్డారు. కుటుంబ సభ్యులు, జేఏసీ నాయకులతో చర్చల అనంతరం మళ్లీ మీడియాతో మాట్లాడుతూ... శంకర్ గౌడ్ అంత్యక్రియల విషయంలో నేను మొదటి నుండి ఆర్టీసీ జేఏసీ, శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల నిర్ణయానికే వదిలేశాం. వాళ్లు మాట్లాడుకుని అంతిమ యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. శంకర్ గౌడ్ కు సొంత ఇల్లు కూడా లేదు. ప్రభుత్వం చేసే రూ.10 లక్షల సాయం దేనికి పనికొస్తుంది? శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి.''అని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ''ఆర్టీసీ కార్మికులెవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని కోరుతున్నా. ఆర్టీసీ కార్మికులకు యుద్ధం కొత్త కాదు. సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కొట్లాడితేనే తెలంగాణ వచ్చింది. డిమాండ్ల సాధనలోనూ కొట్లాడాలే తప్ప ఆత్మహత్యలు చేసుకోవద్దు.ఆర్టీసీ కార్మికులకు బీజేపీ పూర్తిగా మద్దతిస్తోంది. వారి పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం.''అని పేర్కొన్నారు.

రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

వేసవి సెలవులు ప్రారంభం కావడంతో స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల తాకిడిని తట్టుకునేందుకు భారతీయ రైల్వే భారీ ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరగడాన్ని గుర్తించిన రైల్వే శాఖ, ఈ ఏడాది రికార్డు స్థాయిలో 18,262 ప్రత్యేక రైలు సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ప్రధానంగా రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో వెయిటింగ్ లిస్ట్ సమస్యను తగ్గించి, సామాన్య ప్రయాణికులకు కూడా సీట్లు అందుబాటులో ఉండేలా ఈ ప్రణాళిక రూపొందించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అదనపు రైళ్ల సంఖ్యను పెంచడం ద్వారా ప్రయాణికుల డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలని రైల్వే మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రత్యేక రైళ్ల వల్ల పారిశ్రామిక నగరాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే కూలీలు, విద్యార్థులు, కుటుంబాలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలగనుంది.

ఈ భారీ ఆపరేషన్‌పై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దిల్లీలో ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. వేసవి తీవ్రత దృష్ట్యా స్టేషన్లలో తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాల విషయంలో రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. రైళ్ల రాకపోకల సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, సాంకేతిక కారణాలతో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూడాలని సూచించారు. ఏప్రిల్ 15న ప్రారంభమైన ఈ ప్రత్యేక సేవలు జూలై 15 వరకు నిరంతరాయంగా కొనసాగుతాయి. ఇప్పటికే 11,878 ట్రిప్పులకు సంబంధించిన షెడ్యూల్‌ను రైల్వే ప్రకటించగా, మిగిలిన రైళ్ల వివరాలను ప్రయాణికుల రద్దీ ధోరణులను బట్టి ఎప్పటికప్పుడు దశలవారీగా విడుదల చేయనున్నారు. ప్రధానంగా ఉత్తర భారతం నుంచి దక్షిణాదికి, పశ్చిమ భారతం నుంచి తూర్పు ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో ఈ ప్రత్యేక రైళ్లు ఎక్కువగా అందుబాటులో ఉంటాయి.

రద్దీ నిర్వహణ కోసం రైల్వే శాఖ ఈసారి ఆధునిక సాంకేతికతను జోడించింది. న్యూ దిల్లీ, ముంబయి, పుణె, బెంగళూరు, అహ్మదాబాద్ వంటి మెట్రో నగరాల్లోని స్టేషన్లలో 'రియల్ టైమ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్' వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీనివల్ల ఏ ప్లాట్‌ఫాంపై ఎంత రద్దీ ఉందో నిరంతరం పర్యవేక్షించి, తదనుగుణంగా భద్రతా సిబ్బందిని తరలించే అవకాశం ఉంటుంది. ఉద్నా వంటి కీలక స్టేషన్లలో ఈ విధానం అద్భుత ఫలితాలను ఇస్తోంది. జనరల్ కోచ్‌లలో ప్రయాణించే వారు తోపులాటలకు గురికాకుండా ఉండేందుకు ఆర్పీఎఫ్ సిబ్బంది సహాయంతో క్యూలైన్ల పద్ధతిని కఠినంగా అమలు చేస్తున్నారు. ముఖ్యంగా తపతి గంగా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లలో ప్రయాణికులను క్రమపద్ధతిలో బోర్డింగ్ చేయించడం ద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రయాణికుల సౌకర్యం, భద్రతే పరమావధిగా రైల్వే యంత్రాంగం నిరంతరం క్షేత్రస్థాయిలో పని చేస్తోంది.

ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు

- **సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుదని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులారా ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వము ఆర్టీసీ కార్మికుల యొక్క సమస్యలను, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఆర్టీసీ కార్మికులు ప్రజా సేవలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి తగిన గౌరవం, భద్రత, వేతనాలు అందకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇలాంటి దుర్ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలికుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని అని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీనీ బలోపేతం చేయడం, కార్మికులకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ తరపున నెల్లికంటి సత్యం కోరారు. ఆత్మహత్య చేసుకొని చనిపోయిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపారు.

ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

అమరావతి వెలుతురు ఏప్రిల్ 24: మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో 'ఇండి' కూటమి పక్షాలు అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని అసెంబ్లీ వేదికగా ఎండగట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. దీనికోసం వచ్చే పది రోజుల్లో ప్రత్యేకంగా మూడు రోజుల పాటు అసెంబ్లీని సమావేశపరచాలని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో మహిళా రిజర్వేషన్లపై స్పష్టమైన రాజకీయ దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్‌లో ఈ బిల్లును అడ్డుకున్న పార్టీల అసలు రంగును ప్రజల ముందు ఉంచాలని నేతలకు సూచించారు. మహిళలకు జరిగిన అన్యాయం ప్రతి ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ చర్చల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, జనసేన తరపున మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాలతో పాటు రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాంతాలైన విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో భారీ బహిరంగ సభలు నిర్వహించి మహిళల్లో చైతన్యం తీసుకురావాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ నేత మాధవ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లతో కూడిన త్రిసభ్య కమిటీని నియమించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీ చరిత్ర అంతా అడ్డంకులు సృష్టించడమేనని చంద్రబాబు విమర్శించారు. 1996 నుంచి మహిళా బిల్లును అటకెక్కించిన తీరును ప్రజలకు వివరించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2023లో తెచ్చిన చట్టాన్ని కూడా అడ్డుకునేందుకు విపక్షాలు అనేక ప్రయత్నాలు చేశాయని గుర్తుచేశారు. డీలిమిటేషన్ ప్రక్రియను సాకుగా చూపి మహిళలను తప్పుదారి పట్టించే కుట్రలు జరుగుతున్నాయని, వీటిని బహిర్గతం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నిరసన కార్యక్రమాలతో రాజకీయ వేడి పెంచాలని పిలుపునిచ్చారు. "స్త్రీ శక్తి" పేరుతో ప్రత్యేక సదస్సులు నిర్వహించి మహిళల్లో రాజకీయ అవగాహన కల్పించాలని సూచించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి బలమైన సందేశం ఇవ్వాలని కోరారు. ఈ నెల 30వ తేదీ లోపు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో అన్ని రకాల ఆందోళన కార్యక్రమాలు పూర్తి చేయాలని గడువు నిర్ణయించారు.

మహిళల సాధికారత, అభ్యున్నతిలో ఎన్డీఏ ప్రభుత్వాల పాత్రను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన నాటి నుంచి, నేడు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇచ్చే వరకు జరిగిన పరిణామాలను వివరించాలని సూచించారు. మహిళా విద్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం తమ ప్రభుత్వాలు చేసిన కృషిని గుర్తుచేయాలని చెప్పారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు మహిళా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, మహిళా ఓటు బ్యాంకును లక్ష్యంగా చేసుకుని రాజకీయ సమరానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల విషయంలో ఎటువంటి నష్టం జరగకుండా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో మీడియా సమావేశాలు నిర్వహించి ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ నేత మాధవ్ చేసిన సూచనను సీఎం ఆమోదించారు. ఇప్పటికే నిడదవోలులో జరిగిన నిరసన ర్యాలీ స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలని చంద్రబాబు నేతలను ఉత్

ఆడబిడ్డల రక్షణకు హామీ ఇస్తున్నా

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధి సాగాలన్నదే బీజేపీ లక్ష్యమని, తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆడబిడ్డలకు పూర్తి భద్రతతో పాటు గౌరవప్రదమైన జీవితాన్ని అందిస్తామని ప్రధాని వాగ్దానం చేశారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వైఖరిపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహిళలు రక్షణ కోరితే, వారిని రాత్రిపూట బయటకు రావద్దని ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ హత్యాచారం ఘటనను ప్రస్తావిస్తూ, ఆ బాధితురాలికి న్యాయం చేయడంలో టీఎంసీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఒక తల్లి తన బిడ్డను డాక్టరుగా చూడాలనుకుంటే, ప్రభుత్వం ఆ కూతురిని కన్నతల్లికి కాకుండా చేసిందని వాపోయారు. అందుకే ఆ బాధిత తల్లిని తమ పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలిపినట్లు వెల్లడించారు. అలాగే సందేశ్‌ఖాళీలో అకృత్యాలకు గురైన బాధితులకు కూడా రాజకీయ నాయకత్వం వహించే అవకాశం కల్పించి, వారికి అండగా నిలబడ్డామని చెప్పారు. మహిళలపై దాడులు చేసిన వారిని, వారికి వంత పాడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో నూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బంగాల్ మహిళా శక్తిపై తనకు అపారమైన నమ్మకం ఉందని, వారు రాష్ట్ర నవ చరిత్రను రాయబోతున్నారని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఇకపై టీఎంసీ అరాచకాలను సహించేది లేదని ప్రతి ఆడబిడ్డ చెబుతోందని, వారి కలలను కలుషితం కానివ్వబోనని హామీ ఇచ్చారు. మే 4న ఫలితాలు వెలువడి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, గతంలో జరిగిన ప్రతి అన్యాయం, అకృత్యంపై పైళ్లు తెరిచి విచారణ జరిపిస్తామని చెప్పారు. ఇది 'మోదీ గ్యారెంటీ' అంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే పేద మహిళలకు ఉచిత రేషన్ అందించడంతో పాటు, వారి హక్కులను ఏ సిండికేట్ శక్తులు లాక్కోకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి సోదరి, కుమార్తె జీవితాల్లో సంతోషం నింపడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ప్రకటించారు. సురక్షితమైన మరియు ఐశ్వర్యవంతమైన బంగాల్ నిర్మాణం కేవలం బీజేపీతోనే సాధ్యమని వివరించారు. మొదటి దశ పోలింగ్‌లో ఓటర్లు చూపిన ఉత్సాహంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఏకంగా 91.91 శాతం పోలింగ్ నమోదు కావడం స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఒక అద్భుతమని, ఇది రాష్ట్రంలో రాబోయే మార్పుకు స్పష్టమైన సంకేతమని అన్నారు. ఏప్రిల్ 29న జరగనున్న రెండో దశ పోలింగ్‌లో కూడా మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. చొరబాటుదారులు లేని, శాంతియుతమైన బంగాల్ కోసం మహిళలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. మమతా బెనర్జీ ప్రభుత్వం కల్పించిన భయం నుంచి విముక్తి పొంది, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మే 4వ తేదీన వెలువడే ఫలితాలు బంగాల్ రాజకీయాల్లో కొత్త శకానికి నాంది పలుకుతాయని, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే ప్రభుత్వం కొలువుదీరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఊరట

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా పార్టీ కీలక నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక పాత కేసును న్యాయస్థానం శుక్రవారం కొట్టివేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో దాదాపు 15 ఏళ్ల క్రితం ఈ కేసులు నమోదయ్యాయి. 2011 మార్చి 10వ తేదీన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన 'మిలియన్ మార్చ్' సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాల ఆధారంగా అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ చట్టపరమైన చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన ఆందోళనలో ఆంక్షలు ఉల్లంఘించారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించారనే నెపంతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులపై సుదీర్ఘ కాలం పాటు విచారణ కొనసాగినప్పటికీ, చివరకు రాజకీయ ప్రేరేపిత కేసులుగా పరిగణిస్తూ హైకోర్టు వీటిని కొట్టివేసింది. ఉద్యమ సమయంలో నమోదైన ఇటువంటి కేసులను ఇకపై కొనసాగించాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. మలిదశ ఉద్యమ చరిత్రలో మిలియన్ మార్చ్ ఒక కీలక మైలురాయిగా నిలిచింది. అప్పట్లో ప్రభుత్వం విధించిన కఠిన ఆంక్షలను ధిక్కరించి లక్షలాది మంది ప్రజలు ట్యాంక్‌బండ్ వైపు తరలివచ్చారు. ఆ సమయంలో చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఉద్యమాన్ని నడిపించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా ఇతర ముఖ్య నేతలను బాధ్యులుగా చేస్తూ అప్పటి పాలకులు పోలీసుల ద్వారా కేసులు పెట్టించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ అక్రమంగా ఈ కేసులు బనాయించారని బీఆర్ఎస్ నేతలు అప్పటి నుంచి వాదిస్తూనే ఉన్నారు. న్యాయస్థానం తాజాగా ఇచ్చిన తీర్పుతో వారి వాదనలకు బలం చేకూరినట్లయింది. ఉద్యమకారులపై ఉన్న పాత కేసులను తొలగించడం వల్ల రాజకీయంగా కూడా ఇది చర్చనీయాంశంగా మారింది. విచారణ దశలో ఉన్న ఈ కేసుల నుంచి విముక్తి లభించడంతో గులాబీ దళం సంబరాలు చేసుకుంటోంది. తెలంగాణ సాధన కోసం సాగించిన నిస్వార్థ పోరాటానికి న్యాయం జరిగిందని బీఆర్ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఈ తీర్పు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ ఉద్యమకారులపై ఉన్న పాత కేసులను ప్రభుత్వం దశలవారీగా వెనక్కి తీసుకుంటున్న తరుణంలో, నేరుగా హైకోర్టు జోక్యం చేసుకుని కేసులను కొట్టివేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ ఆకాంక్షలతో కూడిన ప్రజా పోరాటాలను నేరపూరిత చర్యలుగా చూడ కూడదని కోర్టు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు వంటి అగ్రశ్రేణి నేతలకు ఈ కేసు నుంచి విముక్తి కలగడం వల్ల చట్టపరమైన చిక్కులు తొలగిపోయాయి. ప్రజాస్వామిక నిరసనల్లో పాల్గొన్నందుకు ఎదుర్కొంటున్న వేధింపులకు ఈ తీర్పుతో స్వస్తి పలికినట్లయింది. సుదీర్ఘ పోరాట ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో, ఉద్యమ కాలం నాటి చేదు జ్ఞాపకాలు ఇలా ఒక్కొక్కటిగా కనుమరుగవుతుండటం పట్ల ఉద్యమకారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మిగిలిన పాత కేసుల విషయంలో కూడా ఇదే విధమైన సానుకూల ఫలితాలు వస్తాయని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బెంగాల్ ఫలితాలపై అమిత్ షా ధీమా

పశ్చిమ బంగాల్ వెలుతురు ఏప్రిల్ 24:

పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రక విజయం సాధించబోతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. కోల్‌కతాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తొలి దశ పోలింగ్ సరళిని బట్టి బీజేపీకి భారీ ఆధిక్యం లభించిందని వెల్లడించారు. మొత్తం 152 స్థానాలకు జరిగిన మొదటి దశ ఎన్నికల్లో పార్టీ అంతర్గత అంచనాల ప్రకారం 110కి పైగా సీట్లు గెలుచుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు ఈసారి మార్పును కోరుకుంటున్నారని, భారీ ఎత్తున నమోదైన ఓటింగ్ శాతమే అందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పండుగలో ఉత్సాహంగా పాల్గొని ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తూ, భయం నుంచి భరోసా వైపు ప్రారంభమైన ఈ ప్రయాణాన్ని రెండో దశలోనూ ఓటర్లు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి మంత్రానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని, ఈ ఫలితాలు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును మార్చబోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఎన్నికల హింసకు ఈసారి అడ్డుకట్ట పడిందని అమిత్ షా అభిప్రాయపడ్డారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ రోజున ఒక్క మరణం కూడా నమోదు కాకపోవడం అత్యంత సానుకూల పరిణామమని, శాంతియుత ఎన్నికల నిర్వహణలో కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులు మరియు ఎన్నికల సంఘం సమర్థవంతంగా పనిచేశాయని అభినందించారు. తృణమూల్ కాంగ్రెస్ చేస్తున్న "బయటి వ్యక్తుల పాలన" అనే దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బంగాల్ గడ్డపై పుట్టిన, బంగాలీ భాష మాట్లాడే వ్యక్తినే ముఖ్యమంత్రిగా ఎంపిక చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కరువు కావడమే ప్రధాన సమస్యగా మారిందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆడబిడ్డలు అర్ధరాత్రి కూడా స్వేచ్ఛగా తిరిగే భరోసాను కల్పిస్తామని వాగ్దానం చేశారు. ప్రస్తుతం నెలకొన్న భయానక వాతావరణాన్ని శాశ్వతంగా తొలగించి, సామాన్యులకు రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు.

అవినీతి మరియు సిండికేట్ రాజ్‌ను వేళ్లతో సహా పెకిలించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని అమిత్ షా ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పర్యవేక్షణలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఎవరికీ 'భైపోట్యాక్స్' లేదా కమీషన్లు చెల్లించాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి రెడ్ కార్పెట్ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పెంచుతామని, రైతుల సంక్షేమం కోసం అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో అక్రమంగా ఆక్రమించుకున్న భూములను అసోం ప్రభుత్వ తరహాలో తిరిగి స్వాధీనం చేసుకుంటామని, ప్రజల ఆస్తులను కాపాడటంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మే 5వ తేదీన వెలువడే ఫలితాల తర్వాత అంగ, బంగ, కళింగ ప్రాంతాల్లో బీజేపీ ప్రభుత్వాలే కొలువుదీరుతాయని అమిత్ షా జోస్యం చెప్పారు. తూర్పు భారతదేశంలో రాబోయే ఈ మార్పు దేశాభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. తొలి దశలో ప్రజలు చూపిన తెగువను, మద్దతును రెండో దశలో మరింత ఉత్సాహంగా చూపి మార్పు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. అభివృద్ధి, భద్రత, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతుందని, బంగాల్ ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు పార్టీ కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ ఎన్నికలు కేవలం అధికారాన్ని మార్చేవి కాదని, బంగాల్ ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించే పోరాటమని అమిత్ షా అభివర్ణించారు. శాంతియుతమైన, సంపన్నమైన బంగాల్ నిర్మాణమే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తుందని వివరించారు.

వచ్చే వానాకాలంలో సాగు చేసే సన్న వరి రకాలపై మంత్రి కీలక సమీక్ష

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

కేంద్ర ప్రభుత్వం MSP ప్రకటించి, పంటలను కొనే బాధ్యతను మాత్రం రాష్ట్రాలపై వేస్తుందని మంత్రి తుమ్మల అన్నారు. దీంతో రాష్ట్రంపై అధిక భారం పడుతుందని తెలిపారు. MSP ప్రకటించిన ప్రతి పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ రోజు సచివాలయంలో వ్యవసాయశాఖ కమిషన్ చైర్మన్ కొదండ రెడ్డి మరియు కమిషన్ సభ్యులతో సమావేశమైన మంత్రి తుమ్మల, వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం అందుబాటులో ఉంచాల్సిన వరి రకాల ఎంపిక, విత్తన లభ్యత, సాగు ప్రణాళికలపై వ్యవసాయశాఖ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం BPT 5024, RNR 15048, HMT SONA, Jai Shreeram, KNM1638, WGL44, WGL 962,JGL 1798 మరియు మరికొన్ని సన్న రకాలను సిద్ధం చేసినట్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం 33 రకాల సన్న రకాలను అందుబాటులో ఉంచడం వలన రైతులు అమ్మకాల సందర్భంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు, కొన్నింటికి బోనస్ కూడా రాకుండా ఇబ్బందులు పడ్డారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ సంవత్సరం అలాంటి సమస్యలు రాకుండా పరిమిత రకాలు మరియు రైతులకు అధిక దిగుబడి ఇచ్చే రకాలు అందుబాటులో ఉంచడంపై దృష్టి పెట్టాలని మంత్రి స్పష్టం చేశారు. సివిల్ సప్లై అధికారులతో సమన్వయం చేసుకొని, రాష్ట్రం మరియు కేంద్రం కొనుగోలు చేసే పరిమాణాల ఆధారంగా విత్తనాల సరఫరా ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 4 నుండి 9 వరకు జరిగే రైతు ఉత్సవాల కార్యక్రమంలో మే 4 వ తేదీన ఈ విత్తనాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మే 15 కల్లా ఎంపిక చేసిన విత్తన రకాలను రైతులకు సిద్ధంగా ఉంచాలని అధికారులకు అన్నారు. అధిక దిగుబడి మరియు మార్కెట్లో డిమాండ్ ఉన్న విత్తనాలనే అందుబాటులో ఉంచాలని మంత్రి స్పష్టం చేశారు. సీడ్ కార్పొరేషన్ ద్వారా ఈ విత్తనాలను సరఫరా చేయడంతో పాటు, ప్రైవేట్ కంపెనీలు కూడా ఇదే రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ఇందుకోసం విత్తన కంపెనీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని వ్యవసాయశాఖ సెక్రటరీకి సూచించారు. వచ్చే మంగళవారం జరిగే రైతు నేస్తం కార్యక్రమంలో కూడా ఇదే విషయంపై చర్చించాలని సూచించారు. ఈ రకాలతో రైతులకు మేలు జరగాలని, ప్రభుత్వం ఏఏ పంటలను కొనాలనుకుంటుందో రైతులు ముందుగానే తెలుసుకునేలా వివరాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే MSP శాస్త్రీయంగా లేదని, కేంద్రప్రభుత్వం విధానాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి అన్నారు. MSP విషయంలో రైతు సంఘాల మరియు స్వామి నాథన్ కమిషన్ సిఫారసులను కేంద్రం పట్టించుకోలేదని ఆయన అన్నారు. మంత్రి మాట్లాడుతూ కేంద్రం కేవలం MSP ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. MSP ధర ప్రకటించి, ఏమి పట్టనట్టు ఉంటుందని, రైతులకు ఆ ధర అందుతుందో, లేదో చూడట్లేదని అన్నారు. బహిరంగ మార్కెట్లో కూడా MSP ధర అందే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, దీంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ లాంటి రాష్ట్రాలలో రైతులు మద్దతు ధర రాకుండా నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రైతుల వద్ద నుండి మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దీంతో ప్రభుత్వం అదనపు భారం పడుతోందని అన్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వంపై 2000 నుండి 3000 కోట్లు అదనంగా భారం పడుతుందని, అయినప్పటికి కేంద్రం నుండి ఎలాంటి సహకారాలు అందడం లేదని అన్నారు. MSP ప్రకటించే ప్రతి పంటను పూర్తిగా కేంద్రమే కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా మంత్రి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాటకాలు బెంగాల్‌లో నమ్మరు

(మొదటి పేజీ తరువాయి)

చర్చనీయాంశంగా మారింది. కోల్‌కతాలోని బౌబజార్, చౌరంగీ ప్రాంతాల్లో నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, బీజేపీపై విమర్శనాస్త్రాలు సంధించారు. బంగాల్ ప్రజలను మభ్యపెట్టడానికి బీజేపీ నేతలు రకరకాల వేషాలు వేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఝార్‌గ్రామ్ పర్యటనలో ఒక చిన్న దుకాణం దగ్గర ఆగి ఝాల్‌మురీ కొనుగోలు చేయడంపై మమత తీవ్రంగా స్పందించారు. అదంతా ముందే సిద్ధం చేసిన నాటకమని ఆమె అభివర్ణించారు. ప్రధాని అక్కడికి వెళ్లకముందే సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారని, భద్రత పేరుతో ఆ ఝాల్‌మురీని కూడా ఇంటి నుంచే తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. కేవలం ఫోటోలు దిగి సోషల్ మీడియాలో వైరల్ చేసుకోవడానికి ఆ దుకాణదారుడికి పది రూపాయలు పడేసి వెళ్లారని మమత దుయ్యబట్టారు. గత ఎన్నికల్లో చాయ్‌వాలా కార్డుతో లబ్ధి పొందిన బీజేపీ, ఇప్పుడు ఝాల్‌మురీ కార్డుతో ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు. తాము పుట్టుకతోనే ఘాటైన ఝాల్‌మురీ తినే అలవాటు ఉన్నవాళ్లమని, తమకు బయటి వ్యక్తుల నీతులు అవసరం లేదని స్పష్టం చేశారు. తనకు మతం లేదా ఆహారపు అలవాట్ల గురించి ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, తాను అన్ని సంస్కృతులను గౌరవిస్తానని తెలిపారు. ధోక్లా, దోశ నుంచి ఈద్ సమయంలో తినే సేమియా వరకు అన్నింటినీ ఆస్వాదిస్తానని చెప్పారు. ఎన్నికల ఫలితాలపై బీజేపీ నేతలు వ్యక్తం చేస్తున్న ధీమా వెనుక అసలు రహస్యం ఏంటో చెప్పాలని మమత డిమాండ్ చేశారు. ఎన్నికలు జరగకముందే విజయం తమదేనని చెబుతున్నారంటే, ఈవీఎంలను ఏమైనా ఫిక్స్ చేశారా అని ఆమె బహిరంగంగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు రాకముందే ఫలితాలను ప్రకటించుకోవడం ఏంటని నిలదీశారు. రాష్ట్రంలో బీజేపీకి వంత పాడుతున్న వారిపై మమతా బెనర్జీ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బీజేపీకి బ్రోకర్లుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరి వివరాలు 'ఏ టు జెడ్' తన దగ్గర రాసిపెట్టుకున్నానని, వారి ఇళ్ల అడ్రసులతో సహా అన్ని జాతకాలు నోట్ చేసుకున్నానని వ్యాఖ్యానించారు. తనను నిఘాలో ఉంచుతున్నామని భ్రమపడే వారు గుర్తుంచుకోవాలని, అన్యాయానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో తానే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

అమెరికాతో బలపడుతున్న భారత్ బంధం

(మొదటి పేజీ తరువాయి)

చేశాయని పేర్కొన్నారు. ఈ సంబంధాలు కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకుండా, ప్రజల మధ్య ఉన్న లోతైన బంధం (పీపుల్ టు పీపుల్ టైస్) పునాదిగా బలోపేతం అవుతున్నాయని వివరించారు. ముఖ్యంగా వాణిజ్య రంగంలో ప్రస్తుతం కొనసాగుతున్న 200 బిలియన్ డాలర్ల వార్షిక లావాదేవీలను దశాబ్దం ముగిసే నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యంగా 'మిషన్ 500' ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఈ ఆర్థిక బంధం ప్రపంచ మార్కెట్ గమనాన్ని శాసించే స్థాయికి చేరుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రక్షణ, సాంకేతిక రంగాల్లో గత ఏడాది కుదిరిన పదేళ్ల రక్షణ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం ఇరుదేశాల మధ్య ఉన్న నమ్మకానికి నిదర్శనమని క్వాత్రా అభివర్ణించారు. కేవలం ఆయుధాల కొనుగోలుకే పరిమితం కాకుండా కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు మరియు కీలక ఖనిజాల రంగాల్లో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా కీలక ఖనిజాల సరఫరా గొలుసు విషయంలో ఒకే దేశంపై లేదా ఒకే మూలంపై ఆధారపడటం ప్రమాదకరమని, ఈ విషయంలో భారత్-అమెరికా భాగస్వామ్యం ప్రపంచ దేశాలకు భద్రతను ఇస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ చేపట్టిన విధానపరమైన సంస్కరణలు 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రతి ఏటా సాధించే వృద్ధినికొలిచేలా స్పష్టమైన అభివృద్ధి సూచికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని తెలిపారు. విద్యా, వ్యాపార రంగాల్లో ఇరుదేశాల మధ్య ఉన్న సమన్వయం ఈ ప్రస్థానానికి 'బెడ్‌రాక్' వంటిదని రాయబారి పేర్కొన్నారు. మరోవైపు, సోషల్ మీడియాలో భారతీయులను ఉద్దేశించి చేసిన అవమానకర వ్యాఖ్యల వివాదంపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షేర్ చేసిన ఒక వీడియోలో వలస చట్టాలపై చర్చ సందర్భంగా ఒక వ్యాఖ్యాత భారత్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యలు అపగాహన రాహిత్యంతో కూడినవని, మంచి అభిరుచికి విరుద్ధమని మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఖండించారు. ఈ ఉదంతం రాజకీయంగానూ దుమారం రేపింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ విషయంలో ప్రధాని మోదీ మౌనాన్ని నిలదీశారు. అమెరికా అధ్యక్షుడి స్థాయిలో ఇటువంటి పోస్టులు షేర్ అవుతున్నప్పుడు ప్రభుత్వం ఎందుకు దృఢంగా స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. దేశ ప్రయోజనాలు, భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించిన ఖర్గే, ఈ అంశాన్ని దౌత్యపరంగా అమెరికా ప్రభుత్వం వద్ద ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక ఒప్పందాలు జరుగుతున్నా, భారతీయుల పట్ల ఇటువంటి వివక్షాపూరిత వ్యాఖ్యలు రావడం దురదృష్టకరమని ప్రతిపక్షం అభిప్రాయపడింది.

ప్రభుత్వంతో ఆర్టీసీ చర్చలు సఫలం

(మొదటి పేజీ తరువాయి)

ఫిట్‌మెంట్‌ను చెల్లించేందుకు ప్రభుత్వం ఆర్థికపరమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయాలతో సంతృప్తి చెందిన జేఏసీ ప్రతినిధులు సమ్మె విరమణపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధమయ్యారు. చర్చల సందర్భంగా కార్మికుల ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం గట్టి భరోసా ఇచ్చింది. భవిష్యత్తులో ప్రైవేటు బస్సులు, అద్దె బస్సులు లేదా ఎలక్ట్రిక్ వాహనాలు ఎన్ని వచ్చినా ప్రస్తుత ఉద్యోగుల విధులకు ఎటువంటి ఆటంకం కలగదని మంత్రులు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 52 రోజుల పాటు సమ్మె చేసినా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం చర్చలకు పిలవలేదని, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారని జేఏసీ నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం సమ్మె ప్రారంభమైన రెండో రోజే స్వచ్ఛందంగా చర్చలకు ఆహ్వానించడాన్ని వారు కొనియాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రులు, అధికారుల కమిటీ వేగంగా స్పందించి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేశారని చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీకి తగ్గుతున్న ఆదాయాన్ని ప్రభుత్వం రీఇంబర్స్ చేస్తూ సంస్థను కాపాడుతోందని, కార్మికుల క్షేమంపై ప్రభుత్వానికి స్పష్టమైన చిత్తశుద్ధి ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. గతంలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని అనిశ్చితి ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు అందడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని, ఇప్పుడు పీఆర్సీ బకాయిలను కూడా ఒక షెడ్యూలు ప్రకారం విడుదల చేసేందుకు ఏకాభిప్రాయం కుదిరిందని తెలిసింది. విలీనం ప్రక్రియలో ఉన్న చట్టపరమైన చిక్కులను అధిగమించేందుకు మరిన్ని దఫాలుగా చర్చలు జరపాలని నిర్ణయించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు ఈ రెండేళ్ల కాలంలోనే పరిష్కారం కావడం విశేషమని కార్మిక నేతలు పేర్కొన్నారు. 2013 నాటి బాండ్లకు సంబంధించిన రూ. 280 కోట్లు, 2017 పీఆర్సీ పాక్షిక బకాయిలు విడుదల కావడం తమకు ఊరటనిచ్చిందని చెప్పారు. గతంలో సర్వీసు నుండి తొలగిపోయిన 270 మందికి తిరిగి ఉద్యోగాలు రావడం, సహకార సొసైటీ బకాయిలు తీరడం వంటివి ప్రభుత్వ సానుకూల ధోరణికి నిదర్శనమని జేఏసీ నేతలు వెల్లడించారు. యూనియన్లు లేకపోవడం వల్లే ప్రభుత్వ అద్భుతమైన కార్యక్రమాలు కార్మికుల్లోకి వెళ్లలేదని, ఎన్నికల నిర్వహణతో ఆ లోటు తీరుతుందని మంత్రులకు వివ

తల్లిదండ్రుల గుండెలు బద్దలు చేస్తున్న బైకులు!

అజాగ్రత్తతో పెరుగుతున్న చిన్నారుల రోడ్డు ప్రమాదాలు

గ్రామాలు, పల్లెటూర్లలో చిన్నారుల చేతుల్లోకి బైకులు చేరడం వల్ల రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. రోడ్డు భద్రతపై పోలీసు శాఖ వారు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, కొంతమంది తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. పిల్లలపై ప్రేమతో, గారంగా ఉండే తల్లిదండ్రులు, వారిని తప్పు దారిలో వెళ్లకుండా ఆపాల్సిన చోట మౌనం వహించడం ఆందోళనకు గురిచేస్తోంది.

చిన్న వయసులోనే బైకులు నడపడం అలవాటుగా మారుతోంది. లైసెన్స్ లేకుండా, ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకుండా వాహనాలు నడిపే ఈ చిన్నారులు తమ ప్రాణాలనే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో పెద్ద శాతం ఇలాంటి సంఘటనలేనని అధికారులు పేర్కొంటున్నారు.

పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడే తల్లిదండ్రులు, వారి భద్రత విషయంలో మాత్రం తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. “పిల్లలు అడిగితే వెంటనే బైక్ కొనివ్వడం కాదు, వారికి బాధ్యత నేర్పడం ముఖ్యము” అని పోలీసులు సూచిస్తున్నారు.

హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం వంటి విషయాల్లో పిల్లలకు మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. అయితే, కొంతమంది తల్లిదండ్రులు ఈ అంశాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాదాలు మరింతగా పెరుగుతున్నాయి.

ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే తల్లిదండ్రులే ముందడుగు వేయాలి. చిన్న వయసులో వాహనాలు ఇవ్వకుండా నియంత్రించడం, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, తప్పు చేస్తే కఠినంగా సరిదిద్దడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పోలీసులు, ప్రభుత్వ సంస్థలు మాత్రమే కాకుండా సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. లేకపోతే “ప్రేమతో ఇచ్చిన బైక్” ఒక రోజు తల్లిదండ్రుల గుండెలు బద్దలు చేసే కారణంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పసునూరి సోమనారాయణ
గుండాల మండలం వెల్తురు న్యూస్ రిపోర్టర్

ఓటమి నేర్పిన పాఠం... గెలుపుకు గమ్యస్థానం!

మనిషి జీవితం ఒక నిరంతర ప్రయాణం. ఈ ప్రయాణంలో మనం ఎన్నో మైలురాళ్లను దాటుతుంటాం. అయితే, మన ప్రయాణంలో ఎదురయ్యే రెండు అత్యంత శక్తివంతమైన అనుభవాలు విజయం మరియు విఫలం. ఈ రెండూ ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల వంటివి. కానీ దురదృష్టవశాత్తూ, నేటి పోటీ ప్రపంచంలో మనం విజయాన్ని కిరీటంలా నెత్తిన పెట్టుకుంటున్నాం, వైఫల్యాన్ని మాత్రం ఒక తీరని అవమానంగా, భరించలేని భారంగా భావిస్తున్నాం. అసలు విఫలం కాకుండా గెలవడం సాధ్యమేనా? ఈ ప్రశ్న చుట్టూ అల్లబడిన సమాధానమే మన జీవిత గమనాన్ని, గమ్యాన్ని నిర్దేశిస్తుంది.చరిత్ర పుటలను ఒక్కసారి వెనక్కి తిరగేస్తే, మనకు కనిపించే మహానుభావులందరూ వైఫల్యాల కొలిమిలో కాలి వచ్చిన వారే. వారి విజయగాథల వెనుక ఎన్నో కన్నీళ్లు, మరెన్నో తిరస్కరణలు దాగి ఉన్నాయి. విద్యుత్ బల్బును కనిపెట్టి జగత్తుకు వెలుగునిచ్చిన థామస్ ఆల్వా ఎడిసన్ జీవితమే దీనికి నిదర్శనం. ఆయన ఆ ప్రయోగంలో దాదాపు వెయ్యి సార్లు విఫలమయ్యారు. ఎవరైనా సామాన్యులైతే పది ప్రయత్నాలకే విరమించుకునేవారు. కానీ, వెయ్యి సార్లు విఫలమయ్యావు కదా అని ఒక విలేకరి అడిగినప్పుడు, ఎడిసన్ ఇచ్చిన సమాధానం అద్భుతం: నేను వెయ్యి సార్లు విఫలం కాలేదు, బల్బు వెలగడానికి పనికిరాని వెయ్యి మార్గాలను కనుగొన్నాను.ఈ పాజిటివ్ దృక్పథమే ఆయన్ని అజరామరుడిని చేసింది. వైఫల్యం అనేది ఒక ముగింపు కాదు, అది ఒక కొత్త అన్వేషణకు నాంది .మన భారతీయ మేధావి, క్షిపణి పితామహుడు డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జీవితం కూడా ఇలాంటి పాఠాల సమాహారమే. ఆయనకు ఆకాశంలో ఎగరాలని, ఫైటర్ పైలట్ కావాలని ఎంతో కోరిక ఉండేది. కానీ ఇంటర్వ్యూలో ఆయన ఎంపిక కాలేదు. ఆ క్షణం ఆయన కుంగిపోయి ఉండవచ్చు, కానీ ఆ వైఫల్యం ఆయన్ని శాస్త్ర సాంకేతిక రంగం వైపు నడిపించింది. ఫలితంగా భారతదేశం ఒక గొప్ప శాస్త్రవేత్తను, ఒక విశిష్ట రాష్ట్రపతిని పొందింది. ఒకవేళ ఆయన ఆనాడు పైలట్ అయి ఉంటే, ఈ దేశానికి కలాం గారు అందించిన అగ్ని,పృథ్వీ క్షిపణులు సాధ్యమయ్యేవా? కొన్నిసార్లు మనం కోరుకున్నది దక్కకపోవడం వెనుక, ప్రకృతి మన కోసం అంతకంటే గొప్పది దాచి ఉంచిందన్నది నగ్న సత్యం.నేడు మన సమాజంలో విఫలతను చూసే కోణం చాలా ఇరుకుగా మారిపోయింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ‘ఫెయిల్యూర్’ అంటే భయపడుతున్నారు. పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే తల్లిదండ్రుల ముఖం చూడలేక ప్రాణాలు తీసుకుంటున్న విద్యార్థులు, వ్యాపారంలో నష్టం వస్తే సమాజంలో తలెత్తుకోలేమని కుంగిపోతున్న వ్యాపారవేత్తలు ఇదంతా ఒక పెడధోరణికి నిదర్శనం. మనం గెలుపును మాత్రమే వేడుకగా చేసుకుంటున్నాం, కానీ ప్రయత్నంలో ఉన్నలోపాలను చర్చించడం మర్చిపోతున్నాం. నిజానికి ధైర్యవంతుడు అంటే ఎప్పుడూ పడిపోని వాడు కాదు, పడిన ప్రతిసారీ రెట్టింపు ఉత్సాహంతో లేచి నిలబడే వాడు. మన బలహీనతలను అంగీకరించడం, మన తప్పుల నుండి పాఠాలు నేర్చుకోవడం అనేది ఒక గొప్ప వ్యక్తిత్వ లక్షణం. విఫలతను దాచుకోవడం లేదా దాని గురించి సిగ్గుపడటం వల్ల ఒరిగేదేమీ లేదు. అది కేవలం మన మానసిక వేదనను పెంచుతుంది తప్ప మార్గాన్ని చూపదు.ప్రకృతిని నిశితంగా గమనిస్తే, ప్రతి ప్రాణి తన మనుగడ కోసం విఫలతలతో పోరాడుతూనే ఉంటుంది. ఒక విత్తనం నేలలో పడినప్పుడు అది భూమిని చీల్చుకుని బయటకు రావడానికి ఎంతో సంఘర్షణ పడాలి. అది కుళ్ళిపోతేనే గానీ మొలక రాదు. గాలిని, ఎండను, వానను ఎదుర్కొని నిలబడినప్పుడే అది వృక్షంగా మారుతుంది.అలాగే గొల్లభామ లేదా సీతాకోకచిలుక జీవన చక్రం గమనించండి. గూడు నుండి బయటకు రావడానికి అది ఎంతో కష్టపడుతుంది. ఆ సమయంలో మనం దయతలచి ఆ గూడును కత్తిరిస్తే, ఆ సీతాకోకచిలుక రెక్కలకు బలం రాదు, అది ఎగరలేదు. ఆ సంఘర్షణే దాని రెక్కలకు రక్తాన్ని పంపి ఎగిరే శక్తిని ఇస్తుంది. మనిషి జీవితంలో వచ్చే విఫలతలు కూడా అలాంటివే. అవి మనల్ని కష్టపెట్టడానికి రావు, మనలోని అంతర్గత శక్తులను బయటకు తీయడానికి వస్తాయి.మనం ఏదైనా ప్రయత్నంలో విఫలమైనప్పుడు కృంగిపోకుండా, మూడు ప్రధానమైన ప్రశ్నలను మనల్ని మనం వేసుకోవాలి. ఈ ఆత్మసమీక్షే మళ్ళీ మనల్ని రేసులో నిలబెడుతుంది:ఏం జరిగింది? ,ఆవేశాన్ని పక్కన పెట్టి, వాస్తవాలను విశ్లేషించాలి. ఎదుటివారి మీద నిందలు వేయడం మానేసి, లోపం ఎక్కడ ఉందో నిజాయితీగా గుర్తించాలి.ఏం నేర్చుకున్నాను? , ప్రతి ఓటమి ఒక రహస్య పాఠాన్ని మోసుకొస్తుంది. ఆ పాఠాన్ని సరిగ్గా చదివిన వాడు భవిష్యత్తులో అదే తప్పు చేయడు.ఏం మారాలి?, పాత పద్ధతిలోనే ప్రయాణిస్తూ కొత్త ఫలితాన్ని ఆశించడం మూర్ఖత్వం. నేర్చుకున్న పాఠాల ఆధారంగా మన వ్యూహాన్ని మార్చుకోవాలి.ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజం స్టీవ్ జాబ్స్ తన స్వంత కంపెనీ 'యాపిల్' నుండే బహిష్కరించబడ్డారు. అది ఒక స్థాయి అవమానం. కానీ ఆయన వెనక్కి తగ్గలేదు. ఆ సమయంలోనే ఆయన 'పిక్సార్' వంటి అద్భుత సంస్థను నిర్మించారు. మళ్ళీ యాపిల్‌లోకి తిరిగి వచ్చినప్పుడు ఆయన మరింత పరిణతితో, సృజనాత్మకతతో ప్రపంచాన్ని మార్చేశారు. ఆ విఫలతే లేకపోతే నేడు మనం చూస్తున్న ఐఫోన్ విప్లవం ఉండేది కాదు.అలాగే జె.కె. రౌలింగ్ కథ కూడా అద్భుతం. హ్యారీ పాటర్ నవలను 12 మంది పబ్లిషర్లు తిరస్కరించారు. అప్పటికే ఆమె తీవ్ర పేదరికంలో, విడాకులు తీసుకుని, డిప్రెషన్‌తో పోరాడుతోంది. కానీ ఆ ఒంటరితనం, ఆ తిరస్కారాలే ఆమె కలానికి పదును పెట్టాయి. నేడు హ్యారీ పాటర్ ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడైన పుస్తకాల్లో ఒకటిగా నిలిచింది.టాటా గ్రూపు మాజీ అధినేత రతన్ టాటా నానో కారు ప్రాజెక్ట్ విఫలమైందని చాలా మంది అంటారు. కానీ ఆయన ఆ ప్రాజెక్టును ఆపలేదు, దాని నుండి ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. ఆ అనుభవమే టాటా మోటార్స్ నేడు ప్రపంచ స్థాయిలో ఎలక్ట్రిక్ వాహన రంగంలో దూసుకుపోవడానికి పునాది వేసింది.విఫలతను స్వీకరించే గుణం అలవడాలంటే కొన్ని మార్పులు అవసరం,నేను విఫలమయ్యాను అని అనకండి. నా ప్రయత్నం ఈసారి ఫలించలేదు అని అనుకోండి. మీరు ఒక విఫలత కాదు, మీరు ఒక వ్యక్తి. మీ ప్రయత్నం మాత్రమే విఫలమైంది.వైఫల్యం వచ్చినప్పుడు ఒంటరిగా కుంగిపోకండి. అనుభవజ్ఞులైన మెంటర్లు, స్నేహితుల సలహాలు తీసుకోండి. పంచుకోవడం వల్ల భారం తగ్గుతుంది, కొత్త మార్గం కనిపిస్తుంది. ఓటమి ఎదురైనప్పుడు మన దగ్గర లేని వాటి కంటే, ఉన్న వాటిపై దృష్టి పెట్టండి. మీకు తెలివితేటలు ఉన్నాయి, ఆరోగ్యం ఉంది, మళ్ళీ ప్రయత్నించే సమయం ఉంది. ఈ సకారాత్మకత మీకు మళ్ళీ శక్తినిస్తుంది.మన తెలుగు చరిత్రలో కూడా ఇలాంటి పోరాట పటిమ కనిపిస్తుంది. శ్రీకృష్ణదేవరాయలు సైతం యుద్ధాల్లో ఓటమిని రుచి చూశారు, కానీ తన వ్యూహాలను మార్చుకుని గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు. మన తెలుగు రైతును చూడండి ఒక ఏడాది అతివృష్టి వల్ల పంట పోయినా, మరో ఏడాది అనావృష్టి వల్ల నష్టం వచ్చినా, మళ్ళీ నాగలి పట్టి నేలను సిద్ధం చేస్తాడు. ఆ పట్టుదలే మన రక్తం లో ఉంది. మన పెద్దలు ఒక సామెత చెబుతారు.వేయి చేతులు ఉంటే వేయి పనులు చేయవచ్చు, కానీ ఒక మనసు ఉంటే అన్ని అడ్డంకులు అధిగమించవచ్చు. అంటే మనోనిశ్చయం ఉంటే ఎలాంటి వైఫల్యాన్నైనా విజయసోపానంగా మార్చుకోవచ్చు. నిజంగా విఫలం లేకుండా విజయం సాధ్యమా? అంటే సాధ్యం కాదు. ఒకవేళ విఫలం కాకుండా గెలిచినా, ఆ గెలుపులో రుచి ఉండదు, నేర్చుకున్న పాఠం ఉండదు. నిప్పులో కాలిన బంగారమే మేలిమి ఆభరణం అవుతుంది. సానబెట్టిన వజ్రమే మిరుమిట్లు గొలుపుతుంది. మీ జీవితంలోని వైఫల్యాలు మిమ్మల్ని సానబెడుతున్నాయి, మిమ్మల్ని మరింత విలువైన వ్యక్తిగా మారుస్తున్నాయి.గుర్తుంచుకోండి, వైఫల్యం అనేది మీ జీవితం అనే పుస్తకంలో ఒక పేజీ మాత్రమే, అది మొత్తం పుస్తకం కాదు. ఒక పేజీ నలిగిపోయిందని లేదా తప్పులు ఉన్నాయని పుస్తకాన్ని పక్కన పడేయం కదా? తర్వాతి పేజీలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడమే జీవితం.చివరిగా ఒక్క మాట పడిపోవడం వైఫల్యం కాదు, పడిపోయిన చోటే ఉండిపోవడం అసలైన వైఫల్యం. లేవండి, మీ గాయాలను పతకాలుగా ధరించండి, మళ్ళీ ప్రయాణాన్ని మొదలుపెట్టండి. విజయం మీ కోసం వేచి చూస్తోంది!

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

ఆరుట్ల గ్రామంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా వివిధ పార్టీల వివిధ సంఘాల నాయకులతో కలిసి నిరసన

- ప్రజాసంఘాల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్
- ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- వివిధ పార్టీల నాయకుల డిమాండ్

మంచాల వెలుతురు ఏప్రిల్ 24:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రజాసంఘాల అధ్యక్షుడు కంబలపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ అన్నిరాజకీయ పార్టీలు నాయకులు ఉపాధ్యాయ సంఘం నాయకులు వివిధ సంఘాలనాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివా ళులర్పించి ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు అనంతరం ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ అం బేద్కర్ చౌరస్తాలోనిరసన కార్యక్రమం చేపట్టారు ఈసందర్భంగా ప్రజా సంఘాల నాయకుడు కం బాలపల్లి భాస్కర్ బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్య క్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా32 డిమాండ్లతోసమ్మెచేస్తున్న ఆర్టీసీ కార్మికులు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని వాళ్లకు రావాల్సిన ఇంక్రిమెంట్లు తక్ష ణమే ఇవ్వాలని ప్రభుత్వం కొ నుగోలు చేసే ఎల క్ట్రిక్ బస్సులను ఆర్టీసీకే ఇవ్వాలని ప్రైవేట్ వ్యక్తుల కు ఇవ్వవద్దని ఆర్టీసీలో ఖాళీ గా ఉన్నపోస్టులన్నీ తక్షణమే భర్తీ చేయాలని కార్మికులు 8 గంటలు చేయాల్సిన పని దా దాపు 12 గంటలవరకు యా జమాన్యం కార్మికులను శ్రమదోపిడి చేస్తున్నారు అన్నారు కార్మికులకుఅదనం గా 1గంటపని చేపిస్తే వాళ్ళకి ఓటి డబ్బులు ఇవ్వాలి ప్రభుత్వం లోఏరకమైన ఎటువంటి వసతులు ఉ న్నాయో ఆర్టీసీ కార్మికులకు వర్తింపచేయాలి ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు మెనీ పేస్ట్ లో చెప్పి న విధంగా కార్మికులకు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును కల్పించాలి తక్షణమే ఆర్టీసీ కా ర్మికుల చేత ప్రభుత్వం చర్చలు జరిపి డిమాం డ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేని పక్షం లో ఆర్టీసీ కార్మికుల పక్షాన ఉద్యమం వేగవంతం చేస్తామని హెచ్చరించారుఈ కా ర్యక్రమంలో కాం గ్రెస్ పార్టీ నాయకులు మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సలాం వార్డు సభ్యుడు ఇమ్రాన్ ఖాన్ గుడిమల్ల చంద్రయ్య ముదిరాజ్ వెదిరె రమణారెడ్డి ఇందిరమ్మకమిటీ సభ్యుడు కంబాలపల్లి బుగ్గరా ములు కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల కార్యదర్శి చిందం శ్రీశైలం ఎన్ను దుల సురేష్ మహమ్మద్ గలాబ్ బిజెపి పార్టీ నాయకులు కొంగర జనార్దన్ రెడ్డి పాండాల జంగయ్యగౌడ్ మెండు వెంకటరెడ్డి మాజీ వార్డుస భ్యుడు మంకువినోద్ సిపిఎం పార్టీ నాయకులు మాజీ.కోఆప్షన్ సభ్యుడు మహమ్మ ద్ యూసూప్ అలీ బడ్డు విజయ్ కుమార్ డిఎస్ పి పార్టీ నాయకుడు వార్డుసభ్యుడు కొండిగారి శ్రావణ్ కుమార్ ఉపాధ్యాయ తపస్ సంఘం రంగారెడ్డి జిల్లాకార్యదర్శి పూజారి రమేశ ముదిరాజ్ తెలంగాణ ఉద్య మకారుడు ఆనం గల్ల పరమేష్ రిపోర్టర్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ ప్రజాగలం దామెర భూపాల్ పెద్దలు రావుల చంద్రయ్య ఆర్టీసీ కార్మికులు లాలగారి గణేష్ బోయపల్లి జంగయ్య పం బల బుగ్గరాములు పంది జంగయ్య అనంగళ్ళ దేవరాజ్ బండకాడి జంగయ్య చీమర్ల కృష్ణ మా డపాకుల శేఖర్ దోమ జంగయ్యాదవ్ బాలం బీరప్ప మహమ్మద్ హంజత్ రావుల యాదగిరి సిహెచ్ వెంకటేష్ బి ఐలయ్య నాగరాజు డి జంగయ్య తదితరులుపాల్గొన్నారు

హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంప పెట్టు ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- మంచాల మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్

మంచాల వెలుతురు ఏప్రిల్ 24:

మంచాల మండలం కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు చీరాలరమేష్ ఇబ్రహీం పట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య మంచాల మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కా ర్యదర్శి బహుదూర్ నాయక్ కలిసి మాట్లాడుతూ లక్షల ఎకరాలు సాగునీటిని అందిస్తున్నకాలేశ్వరంపై తప్పుడుప్రచారాలను మానుకోవాలి అని విమర్శించారు పిసి ఘోష్ నివేదిక తప్పు అనే విష యం హైకోర్టు తీర్పు వెళ్లడయింది ఇప్పటికైనా ప్రభుత్వం కేసీఆర్ హరీష్ రావులను బదులం చేయ డం మాను కోవాలని సూచించారు తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవాలని దృడ సంక ల్పంతో అప్పటి సీఎం కేసీఆర్ 94వేల కోట్ల నిధులతో కాలేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని అన్నారు పిసి గోష్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ నేతలకు తీర్పుతో మార్పురావాలని ఇప్పటి కైనా కాలేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని సూచించారు రైతు సంక్షేమమే ల క్ష్యంగా యాదా ప్రతిపా దికన ప్రాజెక్టు పనులను పూర్తిచేసిన కేసిఆర్ హరీష్ రావులను బధలాం చేయాలనే ఉద్దేశం తోనే కాంగ్రెస్ నేతలు వివరించే తీర్పులో రాష్ట్ర ప్రజలు గమనించారని హైకోర్టు తీర్పుతోనైనా నేతల ఆలోచనలను మార్పు రావాలని కోరారు కాలేశ్వరం ప్రాజెక్టుపై భారీ కెనాల్లు కాలువలు ఎన్నోఉన్నాయని వాటికి అవసరమయ్యే సబ్ స్టేషన్ లో మోటర్లు వాటి మౌలిక వ సతు లను కల్పించారని గుర్తు చేశారు మేడిగడ్డ బ్యారేజ్ లోని కేవలం రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే ప్రా జె క్టు మొత్తం కూలిపోయింది అనే రీతిలో ప్రచారం చేయడం సిగ్గుచేటు అని అన్నారు కా లేశ్వరం ప్రా జెక్టు నిర్మాణం తీరును ప్రపంచ దేశాలు సైతం అభినందించాయని సాగునీటి నిపుణులు సైతం ప్ర శంకరించారని పేర్కొన్నా రు నేడు లక్షల ఎకరాల నీళ్లతో అందిస్తున్నప్రా జెక్టుపై లేనిపో ని ఆరోపణ లు చేస్తూ రాజకీయ పాల్పడడం సరికాదని ఇప్పటికైనా కాలేశ్వ రం ద్వారా పూర్తిస్థాయి లో నీళ్లు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు శుక్రవారం రోజున మరణించిన ఆర్టీసీ డ్రైవర్ శంకరన్న మృతికి బిఆర్ఎస్ మంచాల మండల కమిటీ సంతా పాన్ని ప్రకటించారు ఆర్టీసీ కార్మికులు ఆత్మ హత్య చేసుకోకూడదని ఎదిరించి పోరాడాలి గాని ప్రాణాలు తీసుకొని ఏం సాధించలేమని అన్నారు ఆర్టీసీ కార్మికుల బిఆర్ ఎస్ పార్టీ పూర్తి మద్దతు చేస్తుందని కాంగ్రెస్ సర్కా ర్ కుట్రలు చేస్తుందని అన్నారు ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ ఐదు వాగ్దానాలు చేసి అధికారంలోకి వ చ్చాక మోసం చేసింది అన్నారు సర్కారు వైఖరితోనే కార్మికులు సమ్మెకు వెళ్లారని దుయ్యపట్టారు ఆర్టీసీ ఉద్యోగులకు బి అర్ ఎస్ ప్రభుత్వంలో మిలీనం చేసేందుకు కేసిఆర్ హయాంలో 2023 ఆగస్టు లో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు అధికారంలోకి వస్తే 100 రోజు ల లో మిలీని చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాన్ని విస్తరించిందని గజమెత్తా రు ఈకార్యక్రమంలో సింగల్ విండో మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి మాజీ సింగల్ విండో చైర్మన్ అండెం విష్ణువర్ధన్ రెడ్డి మండల నూతన గంటి శేఖర్ చిందం రఘుపతి జంబుల కిషన్ రెడ్డి బొడ్డు నాగరా జుగౌడ్ ఏర్పుల మల్లేష్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి గంట విజ య్ కుమార్ చిందం జంగయ్యహరి ప్రసాద్ రా వులశంకర్ మండల బి ఆర్ఎస్ వి అధ్యక్షులు బొట్టు ప్రవీణ్ అరుట్ల సర్పంచ్ మానిపాటి శోభా కుమార్ జూపాల సర్పంచ్ మంచాల రవి సుద ర్శన్ ఆవుల శ్రీనివాస్ యాదవ్ అమరేందర్లింగే శ్వర్ తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: విప్ బీర్ల ఐలయ్య

- ఎన్ యూజే(ఐ) జాతీయ సమావేశాలు ఘనంగా ముగింపు – మీడియా పాత్రపై ప్రశంసలు

హైదరాబాద్, ఏప్రిల్ 24 వెలుతురు:

జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందిస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) —— ఎన్ యూజే(ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జేయు) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిశాయి. సమావేశాల రెండవ రోజు శుక్రవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పారదర్శక పాలనకు కట్టుబడి ఉందని, ఈ దిశగా మీడియాతో సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా జర్నలిస్టులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన ఈ జాతీయ కార్యవర్గ సమావేశాలు తెలంగాణలో నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్న ఆయన, ఈ వేదిక ద్వారా రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం లభిస్తోందన్నారు. టీఎస్ జేయు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశాలు విజయవంతం కావడం అభినందనీయమని తెలిపారు.

భవిష్యత్తులో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ఏ కార్యక్రమమైనా ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడుతూ జర్నలిస్టుల వృత్తి భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్, డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం. వివేక్, ఎన్ యూజే(ఐ) జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ, జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియగ్ నారాయణ, టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, స్కూల్ ఆఫ్ జర్నలిజం చైర్మన్ నాగేశ్వరరావు, ఎన్ యూజే(ఐ) కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాజు పటేల్, అరుణ్ కుమార్, పావుశెట్టి శ్రీనివాస్, కందికొండ మోహన్, చిర్రగోని ఉదయ్ దీర్, ఉప్పలంచి నరేందర్, పోచంపల్లి రజిత, నాగరాజు, శ్రీనాథ్, అవునూరి సంపత్, గట్టు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తంగా, ఈ జాతీయ సమావేశాలు జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు వారి సమస్యలపై చర్చలకు వేదికగా నిలిచాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

ఇబ్రహీంపట్నంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బిసి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సంపూర్ణ మద్దతు

ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 24:

ఇబ్రహీంపట్నం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఇబ్రహీంపట్నం ఆర్‌టిసి డిపో కార్మికులు చేపట్టిన సమ్మెకు బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు డిపో వద్ద సమ్మె చేస్తున్న కార్మికులను కలిసి సంఘీభావం తెలిపారుఈ సందర్భంగా బి సి ఎస్సీ ఎస్టీ జే ఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భవాని శేఖర్ మాట్లా డుతూ రాత్రింబవళ్లు ప్రజలకు సేవలందిస్తున్నఆ ర్ టిసి కార్మికుల పట్లప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు కార్మికుల సమస్యలు పరి ష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుం దని ఈపోరాటంలో జేఏసి ఎల్లప్పుడూ కార్మికుల ప క్షాన నిలబడుతుందని స్పష్టంచేశారు ఈకార్య క్రమంలో జెఏసి నాయకులు చీమర్ల శివలింగం ప్రదీ ప్ భాస్కర్ యాదగిరి శ్రావణ్ భరత్ వినోద్ సురేందర్ శ్రీకాంత్‌లతో పాటు పెద్ద సంఖ్యలో ఇబ్ర హీంప ట్నం ఆర్‌టిసి డిపో కార్మికులు తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యలపై సీపీఎం పాదయాత్ర

- పించన్ల మంజూరులో ఆలస్యం పై ఆగ్రహం

కూకట్ పల్లి ఏప్రిల్ 24 వెలుతురు:

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ మండలంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో కుమ్మరి బస్తీ, ముదిరాజ్ బస్తీ, దాసరి బస్తీ, రాజుకాలనీ, సిబిర్ నగర్ ప్రాంతాల్లో తిరుగుతూ స్థానిక ప్రజల సమస్యలను నాయకులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలు ప్రభుత్వ దృష్టికి చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని విమర్శించారు. అర్హులైన పేదలకు పించన్లు అందకపోవడంతో వారు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోతుందని తెలిపారు.పించన్ దరఖాస్తులకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లినా సరైన సమాచారం ఇవ్వడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇక దోమల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఫాగింగ్ చేపట్టకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రతిరోజూ ఫాగింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల సమస్యలు పరిష్కారం కాకపోవడం, బోర్ల మరమ్మతులు నిర్లక్ష్యం చేయడం వల్ల తాగునీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం. శంకర్, మండల కమిటీ సభ్యులు ఏ. విజయ, పి. శంకర్, చైతన్య, ధర్మరావు, నాయకులు సునీత, తాజుద్దీన్, జోగారావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

11 కేవీ లైన్ తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం...

- "డబ్బులే పరిష్కారం" అన్న తీరు! మహిళ ఆవేదన, కాలనీవాసుల ఆగ్రహం

కుషాయిగూడ, ఏప్రిల్ 24 వెలుతురు

ప్రతినిధి:కుషాయిగూడ విద్యుత్ విభాగం అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జై జవాన్ కాలనీకి చెందిన ఓ మహిళ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గత ఎనిమిదేళ్లుగా తమ ఇంటి పైగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించాలంటూ వేడుకుంటున్నా అధికారులు స్పందించకపోవడం పట్ల బాధితురాలు శీలత వాపోయారు.

బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... తమ ఇంటి పైగా ప్రమాదకరంగా సాగుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు ఎప్పుడైనా ప్రమాదానికి దారితీసే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రతి సారి కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.

ఇటీవల చివరి ప్రయత్నంగా అధికారులను సంప్రదించగా, లైన్ తొలగింపు కోసం రూ.1,92,000 కాంట్రిబ్యూషన్ చెల్లించాలంటూ చెప్పారని ఆమె వెల్లడించారు. అయితే దీనికి సంబంధించిన అధికారిక సాంక్షన్ పత్రాలు చూపాలని అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా, సుమారు నాలుగు లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు అధికారుల వైఖరి అనుమానాస్పదంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

"మా వద్ద అంత డబ్బు ఉంటే మురికివాడలో ఇల్లు ఎందుకు కట్టుకుంటాం?" అంటూ ఆమె ప్రశ్నించారు. ఇంత భారీ మొత్తాన్ని చెల్లించే స్థోమత తమకు లేదని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతేకాకుండా, ప్రమాదం జరిగి ప్రాణనష్టం కలిగితే ఇన్సూరెన్స్ రూపంలో రూ.5 లక్షలు వస్తాయని అధికారులు నిర్లక్ష్యంగా వ్యాఖ్యానించారని ఆమె ఆరోపించారు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని, ప్రజల ప్రాణాలకు విలువ ఇవ్వని విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఈ ఘటనపై స్థానిక కాలనీవాసులు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం సంభవించే ముందు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని, నిర్లక్ష్యం వల్ల ఎలాంటి అనర్థం జరిగినా బాధ్యత వహించాల్సిందేనని హెచ్చరిస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలి సమస్యకు తక్షణం శాశ్వత పరిష్కారం చూపించాలని కాలనీవాసులు, ప్రజాప్రతినిధులను విజ్ఞప్తి చేస్తున్నారు.

పాపిరెడ్డి నగర్ అభివృద్ధికి ఎమ్మెల్యే కట్టుబాటు: భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం

కూకట్ పల్లి ఏప్రిల్ 24 వెలుతురు:

ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర డివిజన్‌లో గల పాపిరెడ్డి నగర్ బస్తీ అభివృద్ధికి శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ కట్టుబడి ఉన్నారని బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంలో భాగంగా బస్తీలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో శుక్రవారం పాపిరెడ్డి నగర్ బస్తీలోని 1,2 వ రోడ్ లో భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, బస్తి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ పనుల ద్వారా స్థానికులకు దీర్ఘకాలికంగా పారిశుద్ధ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. భగవంత రెడ్డి, పేర్ని ధర్మారావు, మహేష్ గౌడ్, ప్రభాకర్, ఆర్. తిరుపతిరెడ్డి, జీబీ కన్నారావు, తాటి కిరణ్, పి. శంకర్ రెడ్డి, వనం ఆంజనేయులు, కె. యాదగిరి, ఎం. కనక రెడ్డి, డి. తిరుపతిరెడ్డి, సి.హెచ్. సత్యనారాయణ రెడ్డి, హెచ్. రాజు రెడ్డి, గోపాల్, శరత్ రెడ్డి, అరుణ, లక్ష్మి, సులోచన, పద్మ, శోభ, జాలి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించండి:మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 24:

కుత్బుల్లాపూర్ లోని నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదర్శనగర్ లోని ప్రధాన సమస్య భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్య, పలు సమస్యల గురించి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కి వినతిపత్రం ఇవ్వగా వెంటనే స్పందించి జిల్లా ఇంచార్జ్ మంత్రి గారైన శ్రీధర్ బాబు వద్దకు తీసుకెళ్లి కాలనీ సమస్యతో పాటు పలు కాలనీల సమస్యలు వారికి విన్నవించగా మంత్రి వెంటనే స్పందించి వాటార్ వర్క్స్ ఎండి. అశోక్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. ఇట్టి సమస్యలను వెంటనే పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకుంటానని వారు వాగ్దానం చేశారు. ఈకార్యక్రమంలో మంత్రిని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ కాలనీ నుండి Ch బుచ్చిరెడ్డి, అధ్యక్షులు గోపాల్, అడ్వైజర్స్ కృష్ణ, దయాకర్, కార్యదర్శి శ్రీపాద మెట్టుకానీ గూడ చిన్న అంజి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు. సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు.

భూమి రక్షణకు యువత ముందడుగు : ఈసీఐఎల్ విద్యార్థుల 'ఎర్త్ వీక్' సేవా కార్యక్రమం

కుషాయిగూడ, ఏప్రిల్ 24 వెలుతురు:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 929 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈసీఐఎల్ ప్రాంతంలోని సాయి సుధీర్ డిగ్రీ మరియు పీజీ కాలేజ్ విద్యార్థులు 'ఎర్త్ వీక్' సందర్భంగా విశేష సేవా కార్యక్రమం చేపట్టారు. రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ మరియు ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కుషాయిగూడ డివిజన్ ఏపీఐఐసీ కాలనీ పరిధిలోని పలు వీధులు, ప్లే గ్రౌండ్‌లను ప్లాస్టిక్ మరియు చెత్త రహితంగా పరిశుభ్రం చేశారు.

ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, జవాన్ సుధీర్, ఎస్.ఎఫ్.ఏ వసంత, శిరీషతో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి మాట్లాడుతూ, నేటి విద్యార్థులు రాబోయే సమాజంలో అవగాహనతో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, ఇలాంటి బాధ్యతాయుత కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు "సేవ్ వాటర్", "సేవ్ ఎనర్జీ", "నో ప్లాస్టిక్", "పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం", "మొక్కలు నాటుదాం" వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సాయి సుధీర్ డిగ్రీ మరియు పీజీ కళాశాల అధ్యాపకులు, ఐ వి ఎస్ ఎస్ మహాలక్ష్మమ్మ, ఎన్ సి సి ఏ ఎన్ ఓ లెఫ్టినెంట్ బొప్పాని విజయ్, తిరుమల కుమారి, జేకోబ్, జి. రాజేష్, ఎన్ సి సి కేడెట్లు మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం బాధాకరం

- ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
- మరణించి కాదు పోరాడి మన హక్కులు సాధించుకోవాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తూ పోరాడుతూ మన హక్కులు సాధించుకోవాలి తప్ప ఇలా ప్రాణ త్యాగాలు చేస్తూ ఆత్మహత్యలు బలిదానాలు చేసుకోవడం చాలా బాధాకరమని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ విచారంవ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట డిపో పరిధిలోని ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ నిన్న పెట్రోల్ పోసుకొని ఆత్మ హత్య చేసుకోవడం చాలా బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని బీసీ జేఏసీ పక్షాన తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.40 రోజుల క్రితం నోటీసులు ఇచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉంటే ఒక నిండు ప్రాణం బతికేదని అన్నారు.శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్గ్రేషియా వారి ఇంటిలో ఒకరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని లింగం గౌడ్ డిమాండ్ చేశారు. ఆత్మహత్యలతోటి సమస్యలు పరిష్కారం కావని ఏదైనా పోరాడి సాధించుకోవాల్సిందేనని అన్నారు.

ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి చాలా బాధాకరం

- గర్దాస్ విక్రమ్
- సర్పంచ్ ఇంద్రపాలనగరం

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 24:

గ్రామం ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ
ఆర్టీసీ కార్మికులు ఆర్టీసీ రక్షణ కోసం, సమస్యల సాధనకై ఆర్టిసి కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపినరు.ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న ఆర్టిసి కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ తరుపున ఆయన పూర్తి మద్దతు తెలిపారు.అధికార దాహంతో, అబద్దాలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టిసి రక్షణ, సమస్యల పరిష్కారాల కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఆర్టిసి కార్మికులకు అండగా నిలవాల ని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తారు.ఆర్టీసీ కార్మికులు ఎవరు ఆత్మహత్యలకు పాల్పడవద్దని తమ హక్కులు పోరాడి సాధించుకోవాలన్నారు.మరణించిన ఆర్టీసీ కార్మికుడు కోలా శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్..

- గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్ చిలువేరు

కేసముద్రం వెలుతురు ఏప్రిల్ 24:

కేసముద్రం మండలంలో ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తండ జనార్దన్ సుజాత కొడుకు,ఉప్పర పల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు,వార్డ్ సభ్యులు తండ సంపత్ గౌడ్ సోదరుడు బి ఎస్ ఫ్ జవాన్ తండ యాకంభ్రం వివాహం వెన్నెలతో జరగగా రిసెప్షన్ వేడుకకు ఇట్టి రిసెప్షన్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి శ్రీ డా.,,ఉమా మురళీ నాయక్, చిలువేరు సమ్మిగౌడ్ సహా పలువురు ప్రముఖులు హాజరు అయ్యి నూతన వధూవరులకు పట్టు వస్త్రాలు బహుకరించి, నిండు నూరేళ్లు సుఖ, సంతోషాలతో, పిల్లా పాపలతో ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీస్సులు ఇచ్చారు.. వివాహ వేడుక సందర్భంగా తోటి స్నేహితులు తెచ్చిన కేక్ నీ మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి శ్రీ ఉమా మురళీ నాయక్ గారి చేతుల మీదుగా గా కట్ చేసి నూతన వధూవరులకు తినిపించారు..

పిలవగానే తన తమ్ముడి వివాహ వేడుకడు విచ్చేసి ఆశీస్సులు పంచిన డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీ గారికి,గౌరవ పెద్దలకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తండ సంపత్ గౌడ్ కృతజ్ఞతలు తెలియ జేసారు..

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు వెంట కాంగ్రెస్ నాయకులు సమ్మిగౌడ్ చిలువేరు,మెట్టు రవి, తండా శ్రీనివాస్, అడపా రమేష్, బండారు శంకరయ్య, కోమాకుల రమేష్, బైరు రాజు, శాగంటి రాములు, పబ్బతి సారంగం, వత్సలా సాంబయ్య తదితరులు హాజరై వధూవరులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు..

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల నరసింహ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం
"శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు, ముమ్మాటికి అది ప్రభుత్వ హత్యే"
ప్రభుత్వ మొండి వైఖరి వల్లే కార్మికులు బలి అవుతున్నారు.
శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలి.
ఆర్టీసీ కార్మికులు ఎవరూ ఆందోళన చెందవద్దని, క్షణికావేశంలో బలవన్మరణాల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన విజ్ఞప్తి
ప్రభుత్వం వెంటనే స్పందించి, ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలవాలని డిమాండ్
వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. కార్మికులు చేస్తున్న పోరాటానికి ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుంది.
"కార్మికుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడటం ఆపాలి. ఇప్పటికైనా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించి, మరిన్ని ప్రాణాలు పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది."

ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్.

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 24:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అనారోగ్యం కారణంగా చేత చికిత్స చేయించుకున్న దశరథ్, గువ్వల నీల, ఆస్మా బేగం, మణికంఠ గార్లకు మంజూరైన మొత్తం రెండు లక్షల నలభై వేలు (2,40,000) రూపాయల విలువైన సిఎంఆర్ ఎఫ్ చెక్కులను ఈరోజు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కూన శ్రీనివాస్ గౌడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి [CMRF] అనేది మధ్యతరగతి నిరుపేద ప్రజలకు ఆర్థిక అవసరాన్ని తీర్చే ఒక గొప్ప కార్యక్రమం అని తెలియజేశారు,నియోజకవర్గం పరిధిలో నిరుపేదలు అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్నట్లయితే వాటికి సంబంధించిన రసీదులను తమ కార్యాలయంలో అందజేసి ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజాపాలన సంక్షేమ పథకాలు అర్హులందరికీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు, ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి ధన్యవాదాలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బలరాం,పూలమ్మ,నర్సింగరావు,కృష్ణయాదవ్, మహంకాళి మురళి, నంది కంటి శ్రావణ్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం బాధాకరం ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

జర్నలిస్టులకు అండగా ఉంటాం

- తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- విజయవంతంగా ముగిసిన ఎన్ యూజే (ఐ) జాతీయ సమావేశాలు

హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 24 :

జర్నలిస్టులకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు.నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) ఎన్ యు జె(ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జేయు) ఆధ్వర్యంలో రెండవ రోజు శుక్రవారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం జర్నలిస్టులను అన్ని రకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. నగరంలో జాతీయ స్థాయి కార్యవర్గ సమావేశాలను ఏర్పాటు చేసి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్న జర్నలిస్ట్ యూనియన్ (టి.ఎస్.జే.యూ)కు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్, డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం. వివేక్, ఎన్ యుజె(ఐ) జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ, జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియగ్ నారాయణ, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, స్కూల్ ఆఫ్ జర్నలిజం చైర్మన్ నాగేశ్వరరావు, ఎన్ యుజె(ఐ) కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాజు పటేల్, అరుణ్ కుమార్, పావుశెట్టి శ్రీనివాస్, ముత్యం ముఖేష్ గౌడ్, కందికొండ మోహన్, చిర్రగోని ఉదయ్ దీర్, ఉప్పలంచి నరేందర్, పోచంపల్లి రజిత, నాగరాజు, శ్రీనాథ్, అవునూరి సంపత్, గట్టు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేరే కులస్తులు చేసే కార్పొరేట్ హెయిర్ సెలూన్ ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న క్షవర వృత్తిదారులు

- మంగళి కులస్తులే హెయిర్ కటింగ్స్ నిర్వహణ చేయాలి
- రాష్ట్ర వ్యాప్తంగా తమ సేవలను నిలిపివేస్తాం

ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 24:

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో కార్పొరేట్ మంగళి షాప్ ప్రారంభోత్సవాన్ని నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు అడ్డుకున్నరు. మున్సిపల్ పరిధిలోని మంచాల్ రోడ్డులో "వేవ్ సెలూన్ యూనిక్స్ హెయిర్ సెలూన్ " షాపు ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్న సమయంలో పెద్ద ఎత్తున నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు,హెయిర్ కటింగ్ షాపుల నిర్వాహకులు ఆందోళనకు దిగారు. ఇలాంటి కార్పొరేట్ షాపులు పెట్టి మా పొట్టలు కొట్టొద్దని నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో దాదాపు 100 నుండి 150 గడప మంగళి కుటుంబాలు మంగలి షాపులను నిర్వహిస్తూ కుటుంబాలని పోషించుకుంటున్నారు. ఇబ్రహీంపట్నంలో దాదాపు 60 షాపులు ఉండగా ఎప్పుడు లేని విధంగా ఈ ప్రాంతంలో కార్పొరేట్ సెలూన్, అందులోనూ ఇతర కులస్తులైన రెడ్డి వర్గానికి చెందినవారు ప్రారంభించి,నిత్యం ప్రజలకు హెయిర్ కటింగ్ నిర్వహించి,పొట్ట నింపుకొనే జీవిస్తున్న తమను అధోగతి పాలు చేసేందుకు, ఇతర కులస్తులు కార్పొరేట్ తరహాలో హెయిర్ కటింగ్ చేసే షాపులు నిర్వహిస్తూ తమ జీవితాలు ఆగం చేస్తున్నారన్నారు.ఆనాదిగా వస్తున్న సంస్కృతిలో భాగంగా మనిషి పుట్టుక నుండి చావు వరకు పుట్టుక ప్రసవం,పెండ్లి, చావు వంటి సందర్భాల్లో హిందువుల్లోని అన్ని కులాలకు తాము లాభాపేక్ష లేకుండా సేవలందిస్తున్నామని అన్నారు.మానవ సమాజంలో మానవులకు మమేకమై ఉన్న కులం ఏమైనా ఉందంటే అది మంగళి కులం మాత్రమే అని, నేడు అన్య కులస్తులు, పెట్టుబడిదారులు మా మంగలి వృత్తిపై పెట్టుబడులు పెట్టి మా పొట్టలు కొడుతుంటే ఊరుకునేది లేదని భవిష్యత్తులో కూడా ఇలాంటి షాపులు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో గాని మరి ఎక్కడైనా రానిచ్చేది లేదని ఈ షాపు తీసే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేసి ఇక్కడే ఉండి ధర్నా చేస్తామని అన్నారు. ఇలాంటి కార్పొరేట్ షాపులు ఇతర కులస్తులు ఇబ్రహీంపట్నంలో ప్రారంభిస్తే తాము అన్ని కులాల వారికి తమ ఇండ్లలో జరిగే అన్ని కార్యాలను కూడా బహిష్కరిస్తామని, పుట్టుక పెళ్లి చావు వంటి కార్యక్రమాల్లో సైతం కార్పొరేట్ వాళ్లతోనే పనిచేయించుకోవాలని అన్నారు.అన్ని కులాలు తమకు మద్దతుగా నిలిచి వెంటనే ఈ కార్పొరేట్ దోపిడిని అడ్డుకొని తమకు అండగా నిలిచి, మంగళ మంగలి కులవృత్తుల జీవన విధానానికి తోడ్పడాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి దుబాయ్ నర్సింగ్,ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు మంకాల ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి మంకాల అనిల్ కుమార్,కోశాధికారి ప్రవీణ్, గౌరవ అధ్యక్షులు మంకాల వెంకటేష్, కుల పెద్దలు మంగలి కులస్తులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు.

గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నా అనంత చంద్ర శేఖర్ గౌడ్, దోతీ సుజాత వెంకటేష్ యాదవ్

చందూరు వెలుతురు ఏప్రిల్ 24:

చందూరు మున్సిపాలిటీ పరిధిలో 4వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు మన ప్రియతమ నాయకులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహకారం తో కట్టుకొని గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నా పనస మహేష్ కుటుంబ సభ్యులతో కలిసి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్ మరియు దోతీ సుజాత వెంకటేష్ యాదవ్

మహిళా రిజర్వేషన్ బిల్లుపై స్పష్టత అవసరం

- **రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షులు సింగారం ఉప్పలయ్య**

గుండాల, ఏప్రిల్ 24 (వెలుతురు):

దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా బిల్లును ప్రత్యేకంగా పార్లమెంట్‌లో ప్రవేశపెడితే అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని గుండాల మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు సింగారం ఉప్పలయ్య తెలిపారు.

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ మహిళా బిల్లుతో పాటు డీలిమిటేషన్ అంశాన్ని కలిపి ప్రవేశపెట్టడం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ ద్వారా ఉత్తరాది రాష్ట్రాల్లో ఎంపీ స్థానాలు పెరిగే అవకాశం ఉండటంతో, ప్రాంతీయ సమతౌల్యం దెబ్బతింటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ నేపథ్యంలోనే వివిధ రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సహా పలు పార్టీలు ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు

వేశాయని ఆయన చెప్పారు. మహిళా రిజర్వేషన్ అంశంపై అన్ని పార్టీలకూ ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ, ఇతర రాజకీయ అంశాలను జోడించడం వల్ల విభేదాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు నిజంగా న్యాయం చేయాలనుకుంటే, కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లునే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, అప్పుడు అన్ని పార్టీలు కలిసి మద్దతు ఇస్తాయని సింగారం ఉప్పలయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు చిరుమర్తి లింగయ్య సంఘీభావం

నార్కట్ పల్లి వెలుతురు ఏప్రిల్ 24:

నార్కట్‌పల్లి బస్ డిపో వద్ద ఆర్టీసీ రక్షణ, సమస్యల సాధనకై కొనసాగుతున్న కార్మికుల సమ్మెకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సమ్మెలో పాల్గొని, ఆర్టీసీ కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ, అధికార దాహంతో మరియు అబద్ధ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆర్టీసీ రక్షణ మరియు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి వారికి అండగా నిలవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్ జయశంకర్ అడ్వాన్స్ బడిబాట ప్రారంభించిన సర్పంచ్ జేరిపోతుల భరత్

నార్కట్ పల్లి, ఏప్రిల్ 24 (వెలుతురు):

ప్రొఫెసర్ జయశంకర్ అడ్వాన్స్ బడిబాట కార్యక్రమాన్ని నార్కట్‌పల్లి గ్రామ సర్పంచ్ జేరిపోతుల భరత్ శుక్రవారం ఉదయం 7 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భరత్ మాట్లాడుతూ, నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అత్యంత ప్రతిష్టాత్మకంగా నడుస్తోందని, ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. పాఠశాలను అనేకసార్లు సందర్శించిన తనకు విద్యార్థుల క్రమశిక్షణ, బోధన విధానం ఎంతో సంతృప్తినిచ్చాయని చెప్పారు.

పాఠశాలలో ఐఐటీ ఫౌండేషన్ కోర్సులు, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ విద్యతో పాటు రోబోటిక్స్ శిక్షణ కూడా అందిస్తున్నారని, కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో విద్య అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు కాన్సెప్ట్ బేస్డ్ బోధన అందిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనంతో పాటు కోడి గుడ్డు, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, షూస్, టై, బెల్ట్, జామెట్రీ బాక్స్ వంటి 24 వస్తువులతో కూడిన కిట్‌ను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇలాంటి నాణ్యమైన విద్య స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తున్నప్పుడు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేదని అన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నార్కట్‌పల్లిలో చేర్పించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రాములు, ఉపాధ్యాయులు ఆరోగ్యమ్మ, శేషగిరి, జానకిరాణి, మంజుల, రోహిణి, రామస్వామి, వెంకట్ రాజు, రాజు, వెంకటయ్య, సుజాత, ముంగమ్మ, రేణుక, స్వాన్ కోఆర్డినేటర్ దామెర ఉదయ్ కుమార్ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

"ఇది ఆత్మహత్య కాదు – ప్రభుత్వ హత్య" భీమ్ ఆర్మీ ఆగ్రహం

- **ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి: "ఇది ఆత్మహత్య కాదు – ప్రభుత్వ హత్య" అంటూ భీమ్ ఆర్మీ ఆగ్రహం**

నార్కట్ పల్లి, ఏప్రిల్ 24 (వెలుతురు):

నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన ధర్నాకు భీమ్ ఆర్మీ సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు పడ్డేపల్లి నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు మాట్లాడుతూ, తెలంగాణలో కార్మికుల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందా అని ప్రశ్నించారు. తెలంగాణ సాధన కోసం పోరాడింది ఇలాంటి పరిస్థితుల కోసమేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అమాయక ప్రాణం బలైందన్నారు. నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రభుత్వం స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు.

80 శాతం కాలిన గాయాలతో మొదట ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందిన శంకర్ గౌడ్‌ను అనంతరం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించినప్పటికీ చివరకు ప్రాణాలు కోల్పోయినట్టు చెప్పారు. "ఇది ఆత్మహత్య కాదు, ప్రభుత్వ హత్య" అని తీవ్రంగా విమర్శించిన నాగరాజు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందన్నారు. 40 రోజుల ముందే నోటీసు ఇచ్చినా స్పందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరించడం దారుణమని, ఈ మృతికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని, ఆర్టీసీ కార్మికుల అన్ని న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై మౌనం కాదు, పోరాటమే మార్గమని హెచ్చరించారు. శంకర్ గౌడ్ ఆత్మబలి వృథా కా కూడదని, కార్మికుల హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం కావాలని పిలుపునిచ్చారు.

పేద,మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం జరగాలి

- **టెండర్ నిర్వహిస్తే ప్రస్తుతం ఉన్న పది దుకాణాలకు నిర్వహిస్తారా ? 114 దుకాణాలకు నిర్వహిస్తారా ? అని ప్రశ్నిస్తున్న దుకాణదారులు...**
- **ప్రస్తుతమున్న 10 దుకాణాలపై 114 కుటుంబాలతో పాటు ప్రత్యక్షంగా పరోక్షంగా 500 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి అంటున్న వ్యాపారులు.**
- **టెండర్ నిర్వహిస్తే పది దుకాణాలకే నిర్వహించాల్సి ఉంటుందని అలా అయితే ఆ పది దుకాణాలు డబ్బున్న వారు , కార్పొరేట్ వ్యక్తుల చేతికే వెళ్లిపోవా ? ...**
- **డబ్బున్న వారి చేతికి పది దుకాణాలు వెళ్లిపోతే... దుకాణాలపైనే ఆధారపడి బతుకుతున్న వారి పరిస్థితి ఏమిటి ? అంటున్న వ్యాపారులు...**
- **గతంలో లాగానే కొంత మొత్తంలో అద్దె పెంచి రెన్యువల్ చేయాలని కోరుతున్న దేవస్థానం వ్యాపారులు**

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 24 (వెలుతురు):

యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైన పూర్వం అరణ్యం లాగా ఉన్న సమయంలో, రవాణా సదుపాయం లేకున్నా భక్తుల కోసం కాలినడక మెట్ల మార్గం ద్వారా టెంట్ హౌస్ సామాగ్రి , పూజా ద్రవ్యములు , పాలు , పెరుగు, ఆహార పదార్థాలు లాంటి అనేక వస్తు సామాగ్రిని , సదుపాయాలను భక్తులకు అందిస్తూ స్వామి వారిని నమ్ముకొని జీవిస్తున్న పేద మధ్య తరగతి కుటుంబాలు పెద్ద ఎత్తున ఉన్నాయి. కొండపైన దుకాణాల ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందుతున్న సుమారు 500 మందికి పైగా పేద మధ్యతరగతి కుటుంబాలను రోడ్డున పడేసే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని పలువురు కొండపైన దేవస్థానం వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ప్రతి సంవత్సరం 33 నుండి 50% పెంచి రెన్యువల్ చేసే విధానం రాష్ట్రంలోని అనేక దేవాలయాలలో ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇదే తరహాలో కొనసాగిందని వారు అన్నారు. దేవాదాయ శాఖ హిందూ రిలీజియన్ యాక్ట్ 30/87 నిబంధన ప్రకారమే ఈ రెన్యువల్ ప్రక్రియ జరుగుతుందని యాదగిరిగుట్ట దేవస్థానంలో దుకాణాల రెన్యువల్ అనేది కొత్తగా వచ్చింది ఏం కాదని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కొంతమంది తరచుగా పదేపదే కొండపైన దుకాణాలను టెండర్ నిర్వహించాలని అనడం ఎంతవరకు సమంజసం అని వారు అన్నారు. 114 దుకాణాలకు గాను కొండపైన ప్రస్తుతం పది దుకాణాలే ఉన్నాయని అన్నారు. ఈ పది దుకాణాలపై 114 మంది దుకాణాల యజమానులతో పాటు పరోక్షంగా అందులో పని చేసేవారు కలిపి మొత్తం 500 మంది ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఒకవేళ టెండర్ నిర్వహిస్తే పది దుకాణాలకే నిర్వహిస్తారా ? లేక 114 దుకాణాలకు నిర్వహిస్తారా ? అనేది ఫిర్యాదు చేస్తున్నవారు స్పష్టం చేయాలి అని కోరారు . 10 దుకాణాలకే టెండర్ నిర్వహిస్తే ఆ 10 దుకాణాలు ఇతర ప్రాంతాలకు చెందిన ధనవంతులు కార్పొరేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోతాయని అన్నారు. ఇదే జరిగితే ప్రస్తుతం ఈ దుకాణాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న సుమారు 500 ల పేద మధ్యతరగతి కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతారని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ దేవస్థానం దుకాణాలకు టెండర్ను నిర్వహిస్తే నిరుద్యోగులు ఐదు నుంచి పదిలక్షల రూపాయల డిపాజిట్ కట్టి కోట్ల రూపాయల అద్దెను చెల్లించగలుగుతారా ? అంతస్తోమత వారికి ఉంటుందా అనేది ఆలోచించాలని వారు అంటున్నారు. దుకాణాలకు టెండర్ నిర్వహించడం అంటేనే ఏ ప్రాంతం వారైనా పాల్గొనవచ్చు అనేది దాని ఉద్దేశం అంటే ఆ దుకాణాలకు స్థానికులు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన ధనవంతులు కార్పొరేట్ వ్యక్తులు టెండర్లు పాల్గొంటారు. దీనివల్ల ధనవంతులు కార్పొరేట్ వ్యక్తులైన ఇతర ప్రాంతాల వారికే ఆ దుకాణాలు దక్కుతాయి తప్ప స్థానికులకు ఆ దుకాణాలు దక్కవు అనేది స్పష్టం అవుతుందని పలువురు చెబుతున్నారు. అటువంటప్పుడు టెండర్ వేయడం వల్ల స్థానికులు నిరుద్యోగులకు లాభం ఎలా జరుగుతుంది ? టెండర్ నిర్వహించడం వల్ల ఇతర ప్రాంతాలకు చెందిన ధనవంతులు కార్పొరేట్ వ్యక్తులకే లాభం చేకూర్చినట్లు అవుతుంది కదా అని వారు అంటున్నారు. పేదలు నిరుద్యోగులు లక్షల కొద్ది డిపాజిట్లు కట్టి లక్షలాది రూపాయల అద్దెను చెల్లించలేరని గుర్తుంచుకోవాలని వ్యాపారులు గుర్తు చేస్తున్నారు. టెండర్ వేస్తే బయట వ్యక్తుల చేతిలోకి దుకాణాలు వెళ్లిపోయి వారి కింద స్థానికులు కూలీలుగా పని చేయాల్సి వస్తుందని అంటున్నారు . కొండపైకి ఆర్టీసీ బస్సులను ఉచితంగా నడపడం వల్ల దేవస్థానానికి ప్రతినెల సుమారు ఒక కోటి 40 లక్షల రూపాయల భారం పడుతుందని అన్నారు. ఇది దేవస్థానానికి భారం కాదా ? దేవాదాయ శాఖ కు సంబంధం లేని స్వర్ణ గిరి దేవాలయం వరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ ఇస్తూ పురుషులకు టికెట్ తీసుకుంటున్నారు. కొండపైకి వెళ్లే బస్సులలో కూడా మహిళలకు ఫ్రీగా ఇచ్చినా పురుషుల నుండి టికెట్ వసూలు చేయాలి కానీ ఎందుకు చేయడం లేదు దీనివల్ల దేవస్థానానికి నష్టమే కదా... కొండపైన దుకాణాల వల్ల దేవస్థానానికి లాభమే కానీ ఏనాడు నష్టం జరగలేదు . ఈ విషయాన్ని దుకాణాలు టెండర్ వేయాలని పదేపదే విమర్శిస్తున్న వారు గుర్తుంచుకోవాలి. అనాదిగా ఎంతో కాలం నుండి కొండపైన దుకాణాలను కష్టపడి నిర్వహిస్తున్న వారు స్థానికులైన పేదలు మధ్య తరగతి వారు నిరుద్యోగులే ఉన్నారు . వారంతా స్థానికులే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వారు అంటున్నారు. దుకాణాలు టెండర్ వేయడం వల్ల స్థానికులకు కాకుండా బయటి వాళ్లకు కార్పొరేటు శక్తులకు దుకాణాలు వెళ్లిపోతాయి. ఇప్పటికే కొండపైన అనేక టెండర్లు కాంట్రాక్టర్లు బయట వారే ఉన్నారు. టెండర్ లైసెన్సు హక్కు పొంది అధిక వేలంపాట పాడినవారు లాభాలు ఉన్న సమయంలో వ్యాపారం నిర్వహించుకొని , నష్టాలు వచ్చే సమయాల్లో దేవస్థానం పై పడిలేస్తున్నారు . ఇలాంటివి అనేకం జరుగుతున్నాయి. ఇలా చేసే టెండర్ దారులను , ఆ కాంట్రాక్టర్లను పై ఏమీ మాట్లాడకుండా కేవలం స్థానికులే నిర్వహించుకుంటున్న దుకాణాలపైనే విమర్శలు చేయడం కక్ష సాధింపు చర్యలే అవుతుంది అని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు దుకాణాలు నడుపుకోకూడదా ? స్థానికులు, నిరుద్యోగులు ఉపాధి పొందకూడదా ? అనేది వారు స్పష్టం చేయాలి అని అంటున్నారు. కేవలం 10 దుకాణాలకే టెండర్ నిర్వహించడం వల్ల అవి ఏమాత్రం స్థానికులకు రావు. బాగా డబ్బున్న బయట వారికే వస్తాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రస్తుతమును దుకాణాలను రద్దుచేసి టెండర్ వేస్తే 114 దుకాణదారులతో పాటు ప్రత్యక్షంగా పరోక్షంగా 500 మంది ఉపాధి కోల్పోయి వీధిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారు అని ప్రస్తుతం ఉన్న దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారికి నష్టం జరిగితే ప్రస్తుతం టెండర్ నిర్వహించాలని కోరుతున్న వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని దుకాణదారులు అంటున్నారు. కొండపైన సంచార వ్యాపారం చేసుకునే వారు ముఖ్యంగా అరిసెలు అమ్ముకునే వారు, స్వామివారి నామాలు పెట్టేవారు ఇతర సంచార వ్యాపారులు టెండర్ వల్ల తీవ్రంగా నష్టపోతారని వారు అంటున్నారు . సంచార వ్యాపారులు వ్యాపారం చేసుకోలేరని వారి జీవనోపాధి కూడా దెబ్బతింటుందని చెబుతున్నారు. అదేవిధంగా కొండపైన పుస్తకాలు విక్రయించుకునేందుకు అదే విధంగా హ్యాండీక్రాఫ్ట్స్ , చేనేత కు సంబంధించి మరి కొంతమంది ఏండ్ల తరబడి లీజుకు తీసుకున్న వారిని ఎవరు ఏమీ అనడం లేదని వారు అంటున్నారు. పార్కింగ్ తలనీలాలను సేకరించుకునే కాంట్రాక్టు ఇలా పలు కాంట్రాక్టులు బయట వారు నిర్వహిస్తున్నారని వారు చెబుతున్నారు ఇప్పటికే చెప్పుల స్టాండు సెల్ఫోన్లు భద్రపరిచే కౌంటర్, దీపారాధన, పట్టు వస్త్రాలు విక్రయించే తదితర వ్యాపారాలు టెండర్ల ద్వారానే నిర్వహిస్తున్నారని తెలిపారు. వీటన్నింటినీ వదిలిపెట్టి ఒక్క వ్యాపారులనే పదేపదే కొందరు ఎందుకు టార్గెట్ చేస్తున్నారని వారు ప్రశ్నించారు ? . దేవస్థానం ఆదాయం పెరగడానికి అనేక మార్గాలు ఉన్నాయని ముందుగా భక్తుల సౌకర్యాలను కొండపైన పెంచాలని అన్నారు. కొండపైన వసతి గదులు పెద్ద ఎత్తున నిర్మించి టాయిలెట్స్ సౌకర్యం తగిన విధంగా ఏర్పాటు చేస్తే కొండపైన పెద్ద ఎత్తున భక్తులు బస చేసే అవకాశం ఏర్పడుతుందని తద్వారా దేవస్థానానికి ఆదాయం పెరుగుతుందని దీంతో పాటుగా కాంట్రాక్టులు పొందిన వారికి కొండపైన వ్యాపారులకు సరైన వ్యాపారం జరిగి మేలు జరుగుతుందని అన్నారు . కొండపైన భక్తులకు వసతి సౌకర్యాలు పెంచే విషయంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని అన్నారు. ఇప్పటివరకు కొండపైన వ్యాపారులు అద్దెను ఎగ్గొట్టిన సందర్భాలు లేవని డిఫాల్టర్లుగా మారిన సందర్భాలు లేవని వ్యాపారులు తెలిపారు. అద్దెన సక్రమంగా చెల్లిస్తూ ప్రతిసారి 30 నుంచి 50 శాతం మధ్య అద్దె పెంపుదలతో రెన్యువల్ చేయించుకుంటూ దేవస్థానానికి వ్యాపారులు ఆదాయం సమకూరుస్తున్నారని వారు అన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి కొండపైన దుకాణాలపైనే ఆధారపడి జీవిస్తున్న పేద మధ్యతరగతి వ్యాపారుల పొట్ట కొట్టే పనులు చేయకూడదని పలువురు కోరుతున్నారు.

దుకాణాలపై ఆధారపడిన వారిలో అత్యధికులు పేద , మధ్యతరగతి కుటుంబాలే

కొండపైన దుకాణాలు నిర్వహించుకునే వ్యాపారులలో అత్యధికులు పేద మధ్యతరగతి కుటుంబాల వారే దుకాణాలు ఉంటేనే వారికి జీవనోపాధి ఉంటుంది . ఈ దుకాణాల నిర్వహణతోనే వారు కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఎప్పటిలాగే దేవస్థానం వారు నిబంధనల కొండపైన దుకాణాలను రెన్యువల్ చేస్తే పేద మధ్యతరగతి వ్యాపారులను ఆదుకున్న వారు అవుతారు..

కలకుంట్ల శేఖర్ (కాంగ్రెస్ పార్టీ నాయకుడు)

దుకాణం ద్వారానే జీవనోపాధి

కొండపైన దుకాణం ద్వారానే జీవనోపాధి పొందుతున్న. సక్రమంగా అదే చెల్లిస్తూ దుకాణం నడుపుకుంటూ జీవనం గడుపుతున్న. దేవస్థానం వారు దయచేసి రెన్యువల్ చేస్తే నాలాంటి పేద వ్యాపారులు అనేక మందికి ఉపాధి కల్పించిన వారు అవుతారు.

మేడల ఇందిర (ఒంటరి మహిళ)

రెన్యువల్ ద్వారా పేద వ్యాపారులకు మేలు

కొండపైనదుకాణంద్వారానేజీవనోపాధిపొందుతున్న సక్రమంగాఅదేచెల్లిస్తూదుకాణం నడుపుకుంటూజీవనంగడుపుతున్న దేవస్థానంవారుదయచేసిరెన్యువల్చేస్తేనాలాంటి పేదవ్యాపారులుఅనేకమందికిఉపాధికల్పించినవారుఅవుతారు.

ఆరే శ్రీధర్ (బి.ఆర్.ఎస్ నాయకుడు)

మేమంతా నిరుద్యోగులమే

కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న మేమంతా నిరుద్యోగులం పేద మధ్యతరగతి వారమే. ఒక్కొక్క కుటుంబంలో ఐదు నుంచి పది మంది వరకు కుటుంబ సభ్యులు ఒక్క దుకాణం పైన ఆధారపడి జీవిస్తున్నాము. దుకాణం తప్ప మాకు మరో జీవనాధారం లేదు దయచేసి దేవస్థానం వారు ఎండోమెంట్ నిబంధనల మేరకే దుకాణాలను రెన్యువల్ చేస్తే మాలాంటి నిరుద్యోగులను పేద మధ్యతరగతి వారికి మేలు చేసి జీవనోపాధి కల్పించిన వారు అవుతారు. .

జెల్ల భానుచందర్ (బజెపి నాయకుడు)

రెన్యువల్ తోనే పేద వ్యాపారులకు న్యాయం

దుకాణాల రెన్యువల్ తోనే పేద వ్యాపారులకు న్యాయం జరుగుతుంది. కొండపైన దుకాణాలను ఎండోమెంట్ ఆక్ట్ 30/87 హిందూ రిలీజియన్ యాక్ట్ ప్రకారమే రెన్యువల్ చేస్తున్నారు. రెన్యువల్ చేయడం ద్వారా దేవస్థానానికి ఆదాయం సమకూరుతుంది. ఇటు పేద మధ్యతరగతి వ్యాపారులు దుకాణాల ద్వారా జీవనోపాధి పొందుతూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

వడ్లోజు వెంకటేష్ (టీటీడీ లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు, వైయస్సార్సీపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు)

మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 24:
కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మత్స్య పారిశ్రామిక రామకృష్ణకాలనీ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార లి.సంఘం ఎన్నికలను సంబందిత అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించినట్లు ఎన్నికల అధికారి సాజిద్ పేర్కొన్నారు.చైర్మన్ గా బోళ్ల శంకర్, ఉపాధ్యక్షులుగా రేగుల శ్రీనివాస్,కోశాధికారి గా దాసరి తిరుపతి,డైరెక్టర్లుగా కోతి రాజ్ కుమార్,పండుగ శ్రీనివాస్,గంగు రాయమల్లు,కోతి మల్లేశం,గోనెల పర్శరాములు, గోనెల ఎల్లయ్యలు ఎన్నికైనట్లు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు ముదిరాజ్ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రతిభ రత్న అవార్డును అందుకున్న డాక్టర్ బాలు

- **హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో అవార్డు ప్రధానం**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 24:
కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ బాలు ప్రతిభా రత్న టాలెంట్ అవార్డు 2026 ను ఈ రోజు హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో అందుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త,హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ చైర్మన్ కొంపల్లి సత్యనారాయణ,నేషనల్ ఇన్ చార్జ్ బీరెల్లి చంద్రశేఖర్ గుప్త లు సంయుక్తంగా అందజేయడం జరిగింది.
ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ బాలు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేయడానికి ఎల్లవేళలా కృషి చేస్తానని, మానవ జీవితానికి సార్థకత సేవా మార్గమే నని అన్నారు.తలసేమియా బాధిత చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం మరిన్ని రక్త దాన శిబిరాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని అన్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావుకు పెళ్లిరోజు శుభాకాంక్షలు వెల్లువ

- **బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, కౌన్సిలర్ శుభాకాంక్షలు**

జహీరాబాద్ వెలుతురు, ఏప్రిల్ 24:

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు పెళ్లిరోజు సందర్భంగా శుభాకాంక్షల వెల్లువ కొనసాగింది. ఈ సందర్భంగా జహీరాబాద్‌లోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. జహీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ పెద్దబాయి మహిపాల్ ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన దాంపత్య జీవితం సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు నాయకులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి శుభాకాంక్షలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న జాఫర్... పేద ఆడపడుచుల వివాహాలకు చేయూత

- **విజయం సాధించిన 9వ రోజే హామీ అమలు ప్రారంభం...**
- **ఇప్పటివరకు 8 మందికి క్వింటల్ బియ్యం, రూ.20 వేల సాయం...**
- **5 సంవత్సరాలు సేవా కార్యక్రమం కొనసాగిస్తానన్న జాఫర్...**

జహీరాబాద్ వెలుతురు, ఏప్రిల్ 24:

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన 34వ వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసిన అల్తాజ్ మొహమ్మద్ సయ్యద్ జాఫర్ తన ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. ఎన్నికల్లో విజయం సాధిస్తే వార్డులోని నిరుపేద ఆడపడుచుల వివాహాలకు కానుకగా క్వింటల్ బియ్యం మరియు రూ.20 వేల నగదు సాయం అందిస్తానని ఇచ్చిన మాటను, గెలిచిన తొమ్మిదవ రోజు నుంచే అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.
విజయం అనంతరం ఇప్పటివరకు 8 మంది లబ్ధిదారులకు క్వింటల్ బియ్యం, రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసి తన మాటను నిలబెట్టుకున్నారు. దీంతో వార్డు వాసులు, లబ్ధిదారులు ఆయనపై హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.
ఈ సందర్భంగా అల్తాజ్ మొహమ్మద్ జాఫర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుపేద కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు సహాయం అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. రాబోయే ఐదేళ్ల పాటు ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మొహమ్మద్ నిసార్, మొహమ్మద్ ఆమేర్, మొహమ్మద్ అక్బర్, సయ్యద్ అరఫత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల డిమాండ్ లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి

- **ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి బాధాకరం**
- **నగర మేయర్ కొలగని శ్రీనివాస్**

కరీంనగర్ వెలుతురు ఏప్రిల్ 24:
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరీంనగర్ లో శుక్రవారం రోజున ఆర్టీసీ జేఏసి కార్మికుల కు మద్దతు , సంఘీభావం ప్రకటించి, . ఆర్టీసీ డిపో వద్ద కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు బస్టాండ్ నుండి కార్మికులతో కలిసి అమరవీరుల స్థూపం వరకు మేయర్ కొలగని శ్రీనివాస్ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మేయర్ విచారం వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసిని ప్రభుత్వం లో విలీనం చేస్తూ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి కార్మికుల బకాయి ఉన్న వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను పట్టించుకోక పోవడం వల్లే ఆత్మహత్యలు చేస్కోవల్సిన పరిస్థితి ఏర్పడిందని ద్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు చేస్తున్న న్యాయపోరాటానికి బీజేపి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రబుత్వ మొండి వైఖరి వల్లే నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందడం జరిగిందని... దీనికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించి డిమాండ్ల నెరవేర్చాలన్నారు. ఆర్టీసీ కార్మికుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త బస్సులను కోనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ అద్దెబస్సులను నడుపుతూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని.. వెంటనే నడిపిస్తున్న అద్దె బస్సులను తగ్గించాలన్నారు. 30 శాతం ఫిట్ మెంట్ తగ్గకుండా 2021 వేతన సవరణలను వెంటనే చేపట్టి ఆర్టీసీ జేఏసి కార్మికులు తీస్కున్న సమ్మెను విరమింప చేయాలన్నారు
ఆర్టీసీ జేఏసి ప్రభుత్వం ముందు ఉంచిన 32 న్యాయమైన డిమాండ్ల పై కార్మిక సంఘాలతో సానుకూలంగా చర్చలు జరిపి వాటిని నెరవేర్చే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆర్టీసి సంస్థలో నూతన రిక్రూట్ మెంట్ చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం చేసే వారికి మద్దతు తెలిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీస్కోవాలన్నారు. గుర్తింపు పొందిన కార్మిక సంఘాల యూనియన్లను వెంటనే ప్రారంబించాలన్నారు. యూనియన్ల ద్వారానే వారి సమస్యలు పరిష్కారం అవుతాయి కాబట్టి... యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి... వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ మొండి వైఖరిని వీడి సమ్మెలో ఉన్న 39 వేల మంది కార్మికులతో తక్షణమే చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం సానుకూలంగా చర్చలు జరపకుండా... సమస్యలను పరిష్కరించ కుండా కార్మికులను బెదింపులకు గురి చేయడం ముర్ఖత్వమని మండి పడ్డారు. ఇప్పటికైన చర్చలు జరిపి... వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని... సమ్మెను విరమింప జేసేలా చర్యలు తీస్కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు చంద్ర, దేవసాని సరస్వతి, మాసం గణేష్, తోట అనిల్ మరియు ఆర్టీసీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మీడియా అక్రిడిటేషన్ కమిటీతో కలెక్టర్ సమావేశం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 23: శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశం మందిరం లో నూతన మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం లోజిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ పాల్గొని మాట్లాడుతూ అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, 252 జి ఓ ననుసరించి నియమ నిబంధనలు తప్పకుండ పాటించాలని అన్నారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సరిగ్గా చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. మీడియా రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకొని అక్రిడిటేషన్ ప్రమాణాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ విక్టర్, డి పి ఆర్ ఓ,తిరుమల, కమిటీ సభ్యులుగా వి. రజనీకాంత్, మంత్రి ఆంజనేయులు, వుక్కల్ల్ర్ రాజేందర్‌నాథ్, వేణుగోపాల చారి, సయ్యద్ కౌసర్ అలీ, వి. శశిధర్, షేక్ మొయినుద్దీన్, బొక్కల వేణు, గంట చంద్ర శేఖర్, మహమ్మద్ ఆబిద్ , తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమ్మెపై భగ్గుమన్న భీమ్ ఆర్మీ

- **"ఇది ప్రభుత్వ హత్యే" అంటూ సిద్దు రావణ్ ఫైర్...**
- **శంకర్ గౌడ్ ఆత్మాహుతిపై ఆగ్రహం...**
- **హామీలు అమలు చేయలేని సీఎం రాజీనామా చేయాలి....**
- **డిమాండ్లు నెరవేర్చకపోతే అసెంబ్లీ ముట్టడి హెచ్చరిక..**

జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:
సంగారెడ్డి జిల్లా రైకోడ్ మండలంలోని మహబూతుపూర్, ఇటికెపల్లి గ్రామాలు మరియు న్యాల్కల్ మండలంలోని తాటిపల్లి గ్రామాల రైతులకు డి.డి.ఎస్-కేవీకే ఆధ్వర్యంలో మట్టి పరీక్షలు మరియు సమతుల్య ఎరువుల యాజమాన్యంపై అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని శాస్త్రీయ సాగు పద్ధతులపై ఆసక్తిగా అవగాహన పొందారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష నిపుణులు ఈ. స్వామి మాట్లాడుతూ, శాస్త్రీయ పోషక నిర్వహణలో మట్టి పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. మట్టి విశ్లేషణ ద్వారా భూమి సారవంతత స్థాయిని ఖచ్చితంగా అంచనా వేసి, పంటల అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఎరువుల వినియోగాన్ని అమలు చేయవచ్చని తెలిపారు. మట్టి పరీక్షలు చేయించడం ద్వారా అనవసర ఎరువుల ఖర్చును తగ్గించుకోవడంతో పాటు దిగుబడులను పెంచుకోవచ్చని రైతులకు సూచించారు.
అలాగే, మట్టి నమూనాల సేకరణలో పాటించాల్సిన ప్రమాణ పద్ధతులను ప్రదర్శిస్తూ రైతులకు ప్రాక్టికల్‌గా చూపించారు. పొలాల సరైన ఎంపిక, 6 నుంచి 9 అంగుళాల లోతులో నమూనా సేకరణ, మట్టి శుద్ధి, సరైన లేబులింగ్, భూసార పరీక్ష కేంద్రాలకు నమూనాలను పంపించే విధానం వంటి అంశాలను వివరంగా వివరించారు.
అగ్రానమీ శాస్త్రవేత్త వి. రమేష్ మాట్లాడుతూ, సమగ్ర పోషక నిర్వహణ (INM) ముఖ్య సూత్రాలను వివరించారు. వర్మి కంపోస్ట్, మేక ఎరువు వంటి సేంద్రీయ ఎరువుల వినియోగం, జీవ ఎరువులు, గ్రీన్ మాన్యూర్ వినియోగం, పంట అవశేషాలను భూమిలో కలపడం, పంటల మార్పిడి (Crop Rotation), అంతర పంటల విధానాలను అనుసరించడం ద్వారా భూమి సారవంతతను దీర్ఘకాలికంగా పెంచుకోవచ్చని సూచించారు. అధిక మోతాదులో నత్రజని, కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచులు రిభికా నాగేష్, ఎల్గోయ్ లక్ష్మాన్, తంబలి రాజు పాల్గొని రైతులను శాస్త్రీయ సాగు పద్ధతులు అనుసరించాలని సూచించారు. డి.డి.ఎస్ సూపర్వైజర్లు బాలయ్య, వినయ్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ సందేహాలను నిపుణులతో చర్చించుకుని, మట్టి పరీక్షలు చేయించుకునేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.

కల్వకుంట్ల కవిత పార్టీ ప్రకటన సభకు అట్టహాసంగా ఏర్పాట్లు

- **"పార్టీ ప్రకటన సభకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం**
- **గన్ పార్క్ లో అమరవీరులకు నివాళులర్పించి మునీరాబాద్ బయల్దేరనున్న కవిత**
- **ఉదయం 10 గంటలకు పార్టీ పేరు ప్రకటన, జెండా ఆవిష్కరణ**
- **33 జిల్లాల నుంచి తరలిరానున్న 50 వేల మంది కార్యకర్తలు**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 24:

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ ప్రకటనకు సర్వం సిద్ధమైంది
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ (ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రాంగణం) తెలంగాణ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించడానికి సర్వాంగ సుందరంగా ముస్తాబు అయ్యింది
రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో సంస్కృతిక విప్లవానికి ఊతకర్రగా నిలుస్తూ తెలంగాణ జాగృతిని స్థాపించిన కల్వకుంట్ల కవిత 20 ఏళ్ల తన ప్రజా జీవితంలో ఎన్నో మైలు రాళ్లను చేరుకున్నారు.. మరెన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు
తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం స్వీయ రాజకీయ శక్తికి నేడు కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నారు
మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ సెంటర్ తో పాటు దానిని ఆనుకునే ఉన్న 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ సభా ప్రాంగణం నుంచి కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నారు
•శనివారం ఉదయం 7.30 గంటలకు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్ లోని తన నివాసం నుంచి ర్యాలీగా అమరవీరుల స్తూపానికి బయల్దేరుతారు
•ఉదయం 8.15 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు
•ఉదయం 8.25 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నుంచి బయల్దేరుతారు
•ఉదయం 9.30 గంటలకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ హాల్ మెయిన్ గేట్ వద్దకు చేరుకుంటారు
•ఉదయం 10 గంటలకు పార్టీ జెండాను కల్వకుంట్ల కవిత ఆవిష్కరిస్తారు
•ఉదయం 10.05 గంటల ప్రసంగం ప్రారంభిస్తారు.. గంట 15 నిమిషాల నుంచి గంటన్నర పాటు కవిత గారు ప్రసంగిస్తారు
సభ ప్రాంగణం పేరు : ప్రొఫెసర్ జయశంకర్ సార్ సభా ప్రాంగణం
ప్రధాన ద్వారం : ప్రజాకవి కాళోజీ నారాయణ రావు ద్వారము
ఇతర ద్వారాల పేర్లు :
రాణి రుద్రమ దేవి ద్వారము
మారోజు వీరన్న ద్వారము
చాకలి ఐలమ్మ ద్వారాము
భోజన శాలల పేర్లు :
సురవరం ప్రతాపరెడ్డి భోజన శాల
సమ్మక్క సారలమ్ భోజన శాల
షోయబుల్లా ఖాన్ (మీడియా) భోజన శాల
క్యాడర్, అతిథులకు 34 వంటకాలతో తెలంగాణ రుచులతో భోజనాలు
నూతన పార్టీ ప్రకటన అనంతరం పార్టీ కార్యకర్తలు, అతిథులకు తెలంగాణ రుచులతో భోజనాలు వడ్డించనున్నారు. మధ్యాహ్న భోజనం కోసం 34 రకాల వంటకాలను సిద్ధం చేశారు
నాన్ వెజ్ లో
తలకాయ కూర, బోటీ ఫ్రై, తెలంగాణ మటన్ కర్రీ, నాటు కోడి పులుసు, బొమ్మిడాయల పులుసు, హైదరాబాదీ చికెన్ దమ్ బిర్యానీ, మిర్చి కా సాలాన్, ఎగ్ ఇగురు వడ్డించనున్నారు. వెజిటేరియల్ లో బగరా బైంగన్ మసాలా కర్రీ, కందగడ్డ ఫ్రై, పాలకూర, మామిడి పప్పు, ఆలూ టామాటా, చామగడ్డ పులుసు, కట్ చారు సిద్ధం చేయనున్నారు. తెలంగాణ ప్రత్యేక వంటకాలుగా పేరుగాంచిన మక్క గారెలు, జొన్న రొట్టె, సర్వపిండి, బూరెలు, అరిసెలను కూడా మెనులో చేర్చారు. వీటితో పాటు బగరా రైస్, వైట్ రైస్, సాంబర్, రోటి పచ్చడి, దోస, ఆవకాయ, మిర్చి బజ్జి, పచ్చి పులుసు, పపడ్, పెరుగు, రైతా కూడా ఉండనున్నాయి. మజ్జిగ, రాగి అంబలి కూడా పార్టీ అవిర్భావ సభలో అందుబాటులో ఉంటాయి. ఇక డిజర్ట్ లో బటర్ స్కాచ్ ఐస్ క్రీమ్, షాహి తుక్ డా, జిలేబీ పెట్టనున్నారు

రుద్రంగిలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిజిపి బి శివధర్ రెడ్డి

వేములవాడ ఆలయంలో పూజలు చేసిన డిజిపి

వెలుతురు రుద్రంగి/వేములవాడ, ఏప్రిల్ 24: రాష్ట్రంలో సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ ను పటిష్టంగా అమలు చేస్తామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి .శివధర్ రెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో ఎకరం పది గుంటల స్థలంలో నిర్మించనున్న నూతన పోలీస్ స్టేషన్ భవనానికి శుక్రవారంనాడు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేలతో కలిసి డిజిపి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మావోయిజం అంతమైందని, ప్రజలే కేంద్రంగా సేవలు అందించేలా పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ....ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా 'అరైవ్.. అలైవ్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. శాసనసభ్యులు , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరిక మేరకు వేములవాడ లో ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్లు, భీమారంలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ .రేవంత్ రెడ్డి నాయకత్వంలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామని, రూ.150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు గట్టి చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే జిల్లాలో డిఅడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ప్రారంభించామని గుర్తుచేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రుద్రంగి పోలీస్ స్టేషన్ అవసరం అన్నారు. ఇటీవల మహాశివరాత్రి జాతరను జిల్లా యంత్రాంగం ప్రశాంతంగా నిర్వహించిందని తెలిపారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ రుద్రంగిలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, 'నో హెల్మెట్ నో ఎంట్రీ' నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ రాధాబాయ్, డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ ఆలయంలో పూజలు నిర్వహించిన డిజిపి బి. శివధర్ రెడ్డి

వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి వారిని డిజిపి బి శివధర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న డిజిపికి అర్చకులు వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికారు. ఆలయ ఈఓ భాస్కర శర్మ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని డిజిపి కి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే వేములవాడ ఆర్డీవో రాధాబాయి,వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు,పోలీస్ అధికారులు, సిబ్బంది,ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి

- **హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**
- **- డిపో వద్ద నిప్పంటించుకున్న ఉదంతంతో అట్టుడికిన నర్సంపేట**
- **- బహిరంగ సభలు, ఆందోళనలతో హోరెత్తించిన ఆర్టీసీ కార్మికులు**
- **- క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, సీపీ, ఉన్నతాధికారులు**
- **- మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే దొంతిరెడ్డి రూ. 5 లక్షల ఆర్థిక సాయం**
- **- ముత్తోజీపేటలో పోలీసుల ఆంక్షలు.. రాజకీయ నేతల మధ్య వాగ్వాదం**
- **- పది లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించిన ప్రభుత్వం**

హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 24: వరంగల్ జిల్లా నర్సంపేట డిపోలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ చికిత్స పొందుతూ మరణించారు. గురువారం నర్సంపేట బస్టాండ్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న ఆయన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని డీఆర్డీవో అపోలో ఆసుపత్రికి తరలించారు. సుమారు 85 నుంచి 95 శాతం మేర కాలిన గాయాలతో ఉన్న శంకర్‌గౌడ్‌కు వైద్యులు వెంటిలేటర్‌పై అత్యవసర చికిత్స అందించారు. రక్తపోటు పడిపోవడం, గొంతులో వాపు పెరగడంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారి ప్రాణాలు విడిచారు. ఈ వార్త తెలియగానే నర్సంపేట డిపో పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తోటి ఉద్యోగులు, కార్మికులు భారీ ఎత్తున నిరసనలకు దిగారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం వల్లే శంకర్‌గౌడ్ బలిదానం చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో బస్టాండ్ ప్రాంగణం హోరెత్తిపోయింది. ఈ ఘటనపై విపక్షాలు తీవ్రంగా స్పందిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

శంకర్‌గౌడ్ మృతి పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుడు ఆసుపత్రిలో ఉన్న సమయంలోనే పరామర్శించి ధైర్యం చెప్పిన మంత్రి, ఇప్పుడు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్మికులు ఎవరూ క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ జేఏసీతో చర్చలు కొనసాగుతున్నాయని, సానుకూల నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. నర్సంపేట ఆర్డీవో ఉమారాణి ప్రభుత్వం తరపున మృతుడి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీంతో పాటు శంకర్‌గౌడ్ కుమారుడికి ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతిరెడ్డి మాధవరెడ్డి తన వంతుగా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అధికారుల హామీలతో కార్మికులు కొంత శాంతించినా, సమస్యల పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించకుండా ప్రైవేటు డ్రైవర్లతో బస్సులను నడిపించడాన్ని నిరసిస్తూ శంకర్‌గౌడ్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు కార్మికులు చెబుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టారు. రోజువారీ వేతనం కింద డ్రైవర్లకు రూ. 1,500, కండక్టర్లకు రూ. 800 ఇచ్చేలా నోటిఫికేషన్లు జారీ చేశారు. మరోవైపు జేఏసీ నేతలు ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించడం, 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు చేయడం వంటి అంశాలపై పట్టు బట్టారు. అన్ని అంశాలపై స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని కార్మికులు తేల్చి చెప్పారు. ముత్తోజీపేటలో మృతదేహం తరలింపు సమయంలో పోలీసులు, రాజకీయ నేతల మధ్య జరిగిన వాగ్వాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

ముందు ఇంటిని చక్కబెట్టుకో జగన్

- **- మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఘాటు వ్యాఖ్యలు**
- **- అమ్మ అంటే గౌరవం లేని వారిని ప్రజలు నమ్మరు**
- **- చెల్లి లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి**
- **- ఉత్తరాంధ్ర అభివృద్ధిని ఓర్వలేక మొసలి కన్నీరు**
- **- విశాఖను కబ్జాలు, దౌర్జన్యాలతో దోచుకున్నారని ధ్వజం**
- **- స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణతో పాటు దిగ్గజ సంస్థల రాక**
- **- పార్వతీపురం వర్సిటీ ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వెల్లడి**
- **- ఏయూ వందేళ్ల వేడుకలను పండుగలా చేస్తున్నామన్న మంత్రి**
- **- రుషికొండ ప్యాలెస్ అద్దె భారంపై మంత్రి ఆందోళన.**

అమరావతి , వెలుతురు ఏప్రిల్ 24:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమ్మ, అమరావతి, ఆంధ్రప్రదేశ్ అంటే ఇష్టం లేని వ్యక్తులను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవాల్సిన అవసరం లేదని రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. అటువంటి వారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానికి లేదని ఆమె తేల్చి చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడే ముందు తన సొంత ఇంటిని చక్కబెట్టుకోవాలని ఆమె హితవు పలికారు. తన సొంత చెల్లి బయటపెడుతున్న కుటుంబ విషయాలకు, ఆస్తుల గొడవలకు ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతం ప్రస్తుతం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, అది చూసి ఓర్వలేక వైఎస్సార్సీపీ నేతలు కడుపుమంటతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం ఉత్తరాంధ్రను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, ఇప్పుడు అభివృద్ధిపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆమె దుయ్యబట్టారు.ఉత్తరాంధ్ర అభివృద్ధిని గతంలోనూ తామే చేశామని, భవిష్యత్తులోనూ తామే చేస్తామని మంత్రి సంధ్యారాణి ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల కాలంలో విశాఖపట్నాన్ని కేవలం భూకబ్జాలకు కేంద్రంగా మార్చారని, ఎవరూ బతకలేకుండా ప్రజల ఆస్తులను దౌర్జన్యంగా లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ వాసుల మంచితనాన్ని అడ్డు పెట్టుకుని నగరాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. పర్యాటకానికి ఎంతో పేరున్న రుషికొండను తవ్వేసి బోడికొండగా మార్చటంతో పాటు, చారిత్రక స్టీల్ ప్లాంట్‌ను మూసివేయించిన పాపం జగన్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. విశాఖలోని వ్యాపారాలను, పారిశ్రామిక వాతావరణాన్ని నాశనం చేసిన వారు ఇప్పుడు ఉత్తరాంధ్ర మంచి చెడుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని సంధ్యారాణి విమర్శించారు. ఇక్కడి ప్రజలను ఇబ్బంది పెట్టిన వారు ఇప్పుడు నీతులు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విప్లవాత్మక మార్పులు వచ్చాయని మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. మూతపడిన స్టీల్ ప్లాంట్‌ను తిరిగి తెరిపించటంతో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు మంత్రి లోకేశ్ కృషి వల్ల ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ సంస్థ రాష్ట్రానికి వచ్చిందని తెలిపారు. అర్సెలార్ మిట్టల్ వంటి భారీ పరిశ్రమలతో పాటు పార్వతీపురంలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు వంటి ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలు ఇప్పుడు ఉత్తరాంధ్ర వైపు క్యూ కడుతున్నాయని వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) 100 ఏళ్ల వేడుకలను కూడా కూటమి ప్రభుత్వం పండుగలా జరుపుకుంటోందని, గతంలో వైఎస్సార్సీపీ పాలనలో వీసీలు కూడా పార్టీ మీటింగులు పెట్టాలని భయపడేవారని గుర్తు చేశారు. రుషికొండపై అడ్డగోలుగా కట్టిన ప్యాలెస్ అద్దె భారం రాష్ట్ర ప్రజలపై ఎలా పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేసిన అమె, జగన్ రాజకీయాలు మానుకుని తన కుటుంబ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలి

- **- మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి ఆదేశం**
- **- నిజాంపేట్ పీహెచ్‌సీ తనిఖీ చేసిన కలెక్టర్**
- **- ఆస్పత్రి అభివృద్ధికి నిధుల హామీ**
- **- కొత్త అంగన్వాడీ ఏర్పాటుకు సానుకూలత**

మేడ్చల్ వెలుతురు ఏప్రిల్ 24:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం నిజాంపేట్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని మౌలిక వసతులు, రోజువారీ ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ల్యాబ్, స్టోర్ రూమ్, పార్టిషన్ల ఏర్పాటుకు అవసరమైన నిధుల అంచనాలతో ప్రతిపాదనలు పంపాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇస్తూనే, మందుల పంపిణీలో గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) మందులు ఉండకుండా జాగ్రత్త పడాలని, ఎమర్జెన్సీ కార్నర్‌ను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని ఫార్మసిస్ట్, సిబ్బందిని హెచ్చరించారు.

ఆసుపత్రి రికార్డులను పరిశీలించిన అనంతరం గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్యం, రక్తహీనత కేసులు, వ్యాక్సినేషన్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. స్థానికంగా జనాభా ఎక్కువగా ఉన్నందున అదనపు ఆశావర్కర్లను నియమించాలని వచ్చిన వినతులపై సానుకూలంగా స్పందించారు. ఇదే సమయంలో స్థానిక ప్రజలు చిన్న పిల్లల కోసం అంగన్వాడీ కేంద్రం కావాలని కోరగా, వెంటనే స్పందించిన కలెక్టర్ కొత్త కేంద్రాన్ని

ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన వివరాలు సేకరించి సమగ్ర నివేదిక పంపాలని నిజాంపేట్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ లావణ్యారెడ్డి, మెడికల్ ఆఫీసర్ మాధురి, ఇతర రెవెన్యూ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి: బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

- **జీడిమెట్ల డిపో వద్ద ధర్నాకు బీఆర్ఎస్ సంఘీభావం**
- **శంకర్ గౌడ్‌కు నివాళులు... కార్మిక డిమాండ్లు న్యాయమని వ్యాఖ్య**
- **ఆర్టీసీ విలీనంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

కుత్బుల్లాపూర్ వెలుతురు ఏప్రిల్ 24:

జీడిమెట్ల బస్ డిపో ముందు ఆర్టిసి కార్మికులు తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలియజేసిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రభుత్వ మొండి వైఖరితో ఆత్మహత్య చేసుకున్న ఆర్టిసి డ్రైవర్ శంకర్ గౌడ్ కు నివాళులు అర్పించి మౌనం పాటించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆర్టిసి డిమాండ్ లు న్యాయమైన డిమాండ్లు అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పెద్దలు కేసిఆర్ ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి గెజిట్ ను రీలీజ్ చేశారని, కానీ ఇప్పటి కాంగ్రెస్ రేవంత్ సర్కార్ ఆర్టీసీ విలీన ప్రక్రియను అమలు చేయకుండా కావాలనే నిర్లక్ష్యం చేస్తూ కార్మిక, కర్షకులతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు.

గతంలో రేవంత్ రెడ్డి ఆర్టీసి అంశంలో డిజిల్ పై జిఎస్టీ ఎత్తివేస్తేనే సంవత్సరానికి 700 కోట్ల లాభం చేకూరుతుందని చెప్పి దాని అమలును అడ్డుకుని ఆర్టిస్టు కార్మికులతో, కుటుంబాలతో ఆడుకుంటూ ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆర్టిసి కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, మహిళలు, యువత ఏ ఒక్కరు రాష్ట్ర ప్రభుత్వం పట్ల సంతోషంగా లేరన్నారు. ఇవ్వాల్సిన బకాయిలు అడిగితే మీరు నన్ను కోసుకున్నా నా దగ్గర ఒక్క రుపాయి లేదని అబద్దాలు మాటలతో కాలం వెల్లదీస్తూ, హైదరాబాద్ లో లేని నగరం సృష్టించేందుకు వేలకోట్లు, మూసి ప్రక్షాళన పేరిట 1.50లక్షల కోట్లు వెచ్చిస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్ సర్కార్ లో రేవంత్ రెడ్డి తన సీటు కాపాడుకునేందుకు ఇప్పటికే 70సార్లు డిల్లీకి మూతాలు మోస్తూ తన సియం సీటును కాపాడుకుంటూ తను మోజుపడ్డ మిస్ యూనివర్స్ అందాల పోటీలు, తన మోజు తీర్చుకునేందుకు మెస్సీతో కలిసి ఆడే ఫుట్ బాల్ ఆటలకు వందల కోట్లు వెచ్చిస్తున్నారే తప్ప కార్మికులు, కర్షకులు, రైతుల పట్ల ఏమాత్రం ప్రేమ లేదని విమర్శించారు. ఏదేమైనా భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో సియం హోదాలో ఘోరంగా విఫలమైన సియంగా అఫఖ్యాతిని మూట గట్టుకున్నాడు సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ఏది ఏమైనా కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన హమీలు నేరవేర్చే వరకు తెలంగాణ రాష్ట్రప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేసి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందేందుకు కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసి రాష్ట్ర కార్యదర్శి యూసుఫ్, సిఐటీయూ రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మాజీ కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ, జగన్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

కౌమర బాలికల సాధికారతకు 'స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్'

బాలికల మొబిలిటీ, ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణ, భద్రతకు పెద్ద పీట - సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్

హైదరాబాద్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 24:

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కౌమర బాలికల సాధికారత, విద్యా కొనసాగింపు, ఆరోగ్య పరిరక్షణ, భద్రత, నాయకత్వ లక్షణాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం 'స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్'ను సిద్ధం చేసింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సెర్ప్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ కార్యచరణ రూపొందించారు.

వేసవి కాలంలో పాఠశాలలు మూతపడడంతో బాలికలు విద్య, నైపుణ్యాల అభివృద్ధి నుంచి దూరమవడం, బాల్య వివాహాలు, కూలీలకు పోవడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రోగ్రామ్ రూపొందించారు. గ్రామ స్థాయిలో చైతన్యం కల్పించి బాలికల వ్యక్తిత్వ వికాసానికి అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యంగా స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్ ను డిజైన్ చేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో 'స్నేహా సంఘాలు' ఏర్పాటు చేసి, 15-18 ఏళ్ల మధ్య ఉన్న కౌమర బాలికలను సమీకరిస్తారు. ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 9 వేలకు పైగా స్నేహా సంఘాలు ఏర్పాటు కాగా..90 వేల కు పైగా బాలికలు సభ్యులుగా చేరారు. ఈ వేసవిలో సభ్యుల సంఖ్యను రెట్టింపు చేయడాన్నే లక్షంగా పెట్టుకున్నారు. ఈ నేపధ్యంతో సెర్ప్ సీఈఓ దివ్యాదేవరాజన్ శనివారం నాడు జిల్లా డీఆర్డీఓ, జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్ పై అవగాహన కల్పించారు. కౌమర బాలికల స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసానికి మొబిలిటీ ఎంతో కీలకమని పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి డైరెక్టర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ పేర్కొన్నారు. ప్రతి

గ్రామీణ బాలిక సైకిల్ తొక్కడం నేర్చుకోవాలని, ఇది భవిష్యత్తులో బై వీలర్ నేర్చుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో సైకిల్ శిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ కోచ్‌లను నియమించి వారికి గౌరవ వేతనం చెల్లించనున్నారు. అలాగే ఈ సమ్మర్ ప్రోగ్రామ్‌లో ఆరోగ్య పరీక్షలు, హెల్త్ ప్రొఫైల్ కార్డులు, విద్యా కొనసాగింపు ప్రణాళికలు, ఓపెన్ స్కూల్ అవకాశాలు, బ్యాంక్ ఖాతాల ప్రారంభం, కుల, ఆదాయం, నివాస, ఆధార్ వంటి అవసరమైన ధృవపత్రాల పొందడం వంటి అంశాలను అమలు చేస్తారు. బాలికల ఉన్నత విద్య కొనసాగించేందుకు అవసరమైన పత్రాలను వేసవిలోనే సిద్ధం చేయాలని అధికారులను దివ్య దేవరాజన్ ఆదేశించారు.బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ 'సేఫ్టీ ప్లాన్'ను రూపొందించనున్నారు. ఈవ్‌టీజింగ్, వేధింపుల వంటి సమస్యలను అరికట్టేందుకు పోలీస్ శాఖతో సమన్వయం కల్పించి చర్యలు తీసుకుంటారు. గ్రామాల్లో వీధి దీపాల కొరత వంటి సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతారు. స్థానిక సమస్యల పరిష్కారంలో స్నేహా సంఘాల ద్వారా అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని ప్రోత్సహిస్తారు. బాల్యవివాహాలు, టీనేజ్ గర్భధారణల నివారణ కోసం బాలికలు, వారి తల్లిదండ్రులతో ప్రమాణాలు చేయించడమే కాకుండా, గ్రామ స్థాయిలో ప్రమాదాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే విధంగా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు కలిసి బృందాలుగా పనిచేసి కార్యక్రమాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్తారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు, బడ్జెట్ కేటాయింపులు సిద్ధం చేసి, యాప్ ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ప్రతి బాలికకు అవసరమైన సేవలు అందేలా పర్యవేక్షణ చేస్తారు. వారానికి ఒకసారి క్రీడలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, సమ్మర్ క్యాంప్‌లను కొనసాగించి చివర్లో రాష్ట్ర స్థాయి బాలల పార్లమెంట్ నిర్వహించనున్నారు. స్నేహా సంఘాల బ్యాంక్ ఖాతాల ప్రారంభంలో ఉన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీకి ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా కౌమర బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత,ఆర్థిక స్వావలంబన,నైపుణ్య శిక్షణ,భద్రత విషయాల్లో గణనీయమైన మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్ మంచి ఫలితాలు సాధించనుంది.

"ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 5వ రోజు అంశం: నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా వెలుతురు ఏప్రిల్ 24:

"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ లోని సంక్షేమ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం షాద్‌నగర్ మండలం, ఫరూఖ్ నగర్ ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో 5వ రోజు జిల్లా స్థాయి నైపుణ్యాభివృద్ధి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ శాసనసభ్యులు శ్రీ వీర్లపల్లి శంకరయ్య, మున్సిపల్ చైర్మన్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్.సి. కార్పొరేషన్ ఈ.డి. పద్మావతి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారి సందేశాన్ని చదివి వినిపించారు.

అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు ఉపాధి కల్పించే శిక్షణా అవకాశాలపై అవగాహన కల్పించడానికి, నిరుద్యోగ యువత, ఐటిఐ, ఎటిసి డిప్లొమా, జూనియర్ కళాశాల, డిగ్రీ, పిజి మరియు వృత్తి విద్యా కళాశాలల విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి శిక్షణ ఇవ్వడానికి ఏటీసీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని. పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు ఈ నైపుణ్య కోర్సులు, శిక్షణా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నతస్థాయికి చేరుకోవాలని తెలిపారు. షాద్ నగర్ నియోజక వర్గంలో 99 రోజుల కార్యక్రమం పూర్తి అయ్యే లోపు ఈ నియోజక వర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఉపాధి అవకాశాలపై సవివరమైన సమాచారం అందించబడింది. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో నమోదు కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేసి, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోమని ప్రోత్సహించారు.

స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మన దేశ జనాభా అత్యధిక జనాభా చదువులకు అవకాశం కల్పిస్తూ గ్రామస్థాయిలో, మండల స్థాయిలో జిల్లా స్థాయిలో విద్యా సంస్థలు ఏర్పాటు చేసి విద్యావంతులను తయారు చేయడం జరుగుతుందని అన్నారు. ఉన్నతస్థాయి చదువులు చదివిన కూడా సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి నాటి నుండి నేటి వరకు అనేక మార్పులు తీసుకొని వచ్చి నైపుణ్యాన్ని మెరుగుపర్చడం జరుగుచున్నది. ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలపై యువతకు, మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్నా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నియోజక వర్గంలో ATC సెంటర్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, పాలిటెక్నిక్ కాలేజీలను అందుబాటులోకి తీసుకురావడం జరిగినదని తెలిపారు.

విద్య మరియు ఉపాధికి మధ్య వారధిగా నైపుణ్యాభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. మెరుగైన జీవనోపాధి అవకాశాల కోసం నైపుణ్య కోర్సులలో నమోదు చేసుకుని, శిక్షణ పొందేలా అర్హులైన అభ్యర్థులను సమీకరించడంపై కూడా ఈ కార్యక్రమం దృష్టి సారించింది. నైపుణ్యాభివృద్ధి కోర్సులలో నమోదు/చేరడం కోసం ప్రభుత్వం ఈ క్రింది ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లు/పోర్టల్‌లను అందించింది: 1. ఆఫ్‌లైన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం (డిఎస్‌డిసి) 2. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్. □ తెలంగాణ నైపుణ్యాభివృద్ధి మిషన్ (టిఎస్‌డిఎం) వెబ్‌సైట్ జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌డిసి) కేంద్ర ప్రభుత్వ నైపుణ్య కోర్సులను అందిస్తుంది. □ స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్. □ కామన్ సర్వీస్ సెంటర్లు (CSC) విద్యార్థులు సమీపంలోని మీసేవ/CSC సెంటర్ మొదలైన వాటికి వెళ్ళవచ్చు., ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (PMEGP) https://www.kvionline.gov.in/pmegpeportal.com నిరుద్యోగ యువత, విద్యార్థులు, అధికారులు మరియు భాగస్వాముల చురుకైన భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

5వ రోజు కార్యక్రమం నిరుద్యోగ యువతలో సమర్థవంతంగా అవగాహన కల్పించడంతో పాటు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసింది.

ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బస్వమ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, సంక్షేమ శాఖలకు చెందిన జిల్లా అధికారులు డిడి, బిసి సంక్షేమం కేషు రామ్, డిడి ఎస్సి సంక్షేమం, డిఎమ్‌డబ్ల్యూఓ నవీన్ కుమార్ రెడ్డి, డిటిడిఓ రామేశ్వరి దేవి, ఇడి ఎస్సి కార్పొరేషన్ పద్మావతి, జిఎమ్ డిఐసి శ్రీ లక్ష్మి, పిడి ఎంఇపిఎమ్ఎ, పిడి, డిఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్లు, డిఐఇఓ, డిఇఓ సుసిందర్ రావు, ఐటిఐ, ఎటిసి, పాలిటెక్నిక్ కళాశాలలు మరియు ఇతర వృత్తి విద్యా కళాశాలల ప్రిన్సిపాల్‌లతో సహా వివిధ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతనిస్తూ మెరుగైన వైద్యాన్ని అందించేది ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీ

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 24:

అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న ముగ్గురు లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను శుక్రవారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లబ్ధిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా 127 రంగారెడ్డి నగర్ డివిజన్ లబ్ధిదారుడు టీ.ఎన్. బుచ్చమ్మ భర్త కృష్ణయ్య కు రూ. 1,50,000/ (ఒక లక్షా యాభై వేల రూపాయలు)మంజూరు కాగా మరొక లబ్ధిదారుడు 129 సూరారం డివిజన్ న్యూ షాపూర్ నగర్ కు చెందిన మేకల హర్షవర్ధన్ తండ్రి క్రిష్ణ 2,00,000/లక్షలు (రెండు లక్షల రూపాయలు) మంజూరు కాగా ఇంకొక లబ్ధిదారుడు 132 జీడిమెట్ల డివిజన్ అయోధ్య నగర్ కు చెందిన బోయ హనుమంతు తండ్రి బి. నర్సప్ప రూ. 1,25,000/ (ఒక లక్షా ఇరవై ఐదు వేల రూపాయలు) మంజూరు కాగా మంజూరైన ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు విజయ్ శేఖర్ గౌడ్, మంత్రి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎండీ.సిద్దిక్, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, బషీరుద్దీన్, లక్ష్మణ్, బాలు నేత, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఎల్లా గౌడ్, ఆటో బలరాం, అరుణ రెడ్డి, హరి ప్రసాద్, హనుమంతు, ఎర్వ బంటి, రమ్మీ, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ మద్దతు – ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలి

• - తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి వెలుతురు ఏప్రిల్ 24:

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మెకు సీఐటీయూ నల్గొండ జిల్లా కమిటీ మద్దతు ప్రకటించింది. సమ్మె రెండవ రోజు నార్కట్‌పల్లి డిపో ముందు జరుగుతున్న ధర్నాలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, ఖాళీ ఉద్యోగాల భర్తీ, కార్మికుల బకాయిల చెల్లింపు, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడం తదితర 32 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ నాలుగు వారాల గడువు కోరడం సమ్మెను నీరుగార్చే ప్రయత్నమని ఆయన విమర్శించారు. తక్షణమే జేఏసీ నాయకులతో చర్చలు జరిపి,



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కింద రావలసిన సుమారు రూ.400 కోట్లతో పాటు ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. అద్దె బస్సుల పేరుతో సంస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం స్వయంగా కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలని కోరారు.

ఏళ్ల తరబడి కనీస వేతనాలు, సౌకర్యాలు లేకుండా పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని, ఖాళీగా ఉన్న డ్రైవర్, కండక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించకపోవడం కార్మికుల హక్కులను హరించడమేనని, ఇది కార్మిక వర్గం సాధించుకున్న చారిత్రక హక్కులపై దాడి అని విమర్శించారు.

సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 39 వేల మంది కార్మికుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలను సానుకూలంగా పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి సలీం, జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి బయన్న, సహాయ కార్యదర్శి లక్కపాక రాజు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల పరిపూర్ణ చారి, పోలె సత్యనారాయణ, చెరుకు పెద్దులు, కొప్పు శ్రవణ్, ఆమనగంటి ఐలయ్య, షేక్ నన్నెసాబ్ తదితరులతో పాటు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

మరణించిన కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్

గుండాల, ఏప్రిల్ 24 (వెలుతురు):

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ముత్యం సోమయ్య గౌడ్ కుమారుడు, పోలీస్ కమాండర్ ముత్యం మహేష్ ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఈ ఘటన పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తమ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుంని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పింగిలి విజయ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి, జిల్లా కోశాధికారి గుజ్జ సోమనరసయ్య, జిల్లా కార్యదర్శి తడిసిన మల్లారెడ్డి, జిల్లా బీజేవైఎం జనరల్ సెక్రటరీ దయ్యాల కుమారస్వామి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ సోదర ఉదయ్ కిరణ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చేయడం నాగయ్య, అడ్డగూడూరు రూరల్ అధ్యక్షుడు మధుసూదన్, మండల ఉపాధ్యక్షులు బుక్క చంద్రశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సింగారం సోమరాజు, సాయి తేజ, నరసింహ, గొల్లపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులవి ఆత్మహత్యలు కావు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

- **డాక్టర్ బొంగోని సురేష్ గౌడ్ బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి**

హైదరాబాద్ , ఏప్రిల్ 24 (వెలుతురు):

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల ఆవేదన ఈ స్థాయికి చేరుకోవడం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వపు నిర్లక్ష్యం, నిర్బంధం, అహంకార పాలనకు నిదర్శనం. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని చికిత్స పొందుతూ మరణించడం అత్యంత విషాదకరం..ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యే. గత రెండు సంవత్సరాలుగా కార్మికులు తమ సమస్యలు చెబుతూ వస్తుంటే పట్టించుకోకుండా, వారిని బెదిరింపులకు గురిచేసి, సమ్మెను అణగదొక్కే ప్రయత్నాలు చేసి ఈ దుస్థితికి నెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం. మరోవైపు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతుంటే సమస్యలు పరిష్కరించాల్సింది పోయి, తక్షణ నియామకాల పేరుతో కొత్త డ్రైవర్లు, కండక్టర్లకు నోటిఫికేషన్లు విడుదల చేసి కార్మికుల మనోభావాలను రెచ్చగొట్టింది. ఒకవైపు ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటే యాజమాన్యం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. సమ్మె విరమింపజేయాల్సింది పోయి మరింత ఉద్రిక్తత పెంచేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ వైఫల్యం, పూర్తి నిర్లక్ష్యం.

ఇప్పటికే ముగ్గురు ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడగా, శంకర్ గౌడ్ గారి మరణం రాష్ట్రాన్ని కలచివేసింది. ఇంకెంతమందిని బలి తీసుకోవాలనుకుంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం? కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, సమ్మెను అణచివేయాలనే కుట్ర మొదటి నుంచి కొనసాగుతోంది. కమిటీలు, గడువుల పేరుతో కాలయాపన చేస్తూ కార్మికులను మానసికంగా వేధించడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి..ఇప్పుడు మాట తప్పి పూర్తిగా వెనక్కి తగ్గడం ఎందుకు?

ఆనాడు తెలంగాణకు అన్యాయం జరుగుతోందని నాడు మాట్లాడి సోనియా గాంధీని బలిదేవత అని విమర్శించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు స్వయంగా తెలంగాణ కార్మికులను బలి తీసుకుంటున్న బలి

దేవుడిగా మారిపోయాడు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం మొత్తం అస్తవ్యస్తమైంది. విద్యార్థులకు రూ.8 వేల కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా వారిని రోడ్డెక్కే పరిస్థితికి నెట్టింది.

ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన సెక్రటేరియట్ ఉద్యోగులే నిరసనకు దిగే పరిస్థితి ఏర్పడింది. ఇది పరిపాలనలో పూర్తిస్థాయి వైఫల్యం. ఆర్టీసీ సమ్మె రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతుంటే, మూడో రోజు కూడా రాష్ట్రవ్యాప్తంగా డిపోల ఎదుట కార్మికులు నిరసనలు తెలుపుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసహనం స్పష్టంగా చూపిస్తోంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి, 32 డిమాండ్లు నెరవేర్చాలి అని కార్మికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అటు బీఆర్ఎస్ కూడా మాట్లాడే నైతిక హక్కు లేని పార్టీ. గతంలో వారి పాలనలో నే సుమారు 40 మందికి పైగా ఆర్టీసీ కార్మికులు బలిదానమయ్యారు. 2019లో 52 రోజులు సమ్మె జరిగినా చర్చలకు పిలవని నిర్దయ పాలన అది. జీతాలు లేక కార్మికులు ఇబ్బందులు పడినా పట్టించుకోలేదు. సమ్మెలో పాల్గొన్న వారిని విధుల్లోకి అనుమతించలేదు. కార్మిక సంఘాలను రద్దు చేసిన చరిత్ర కేసీఆర్ ది. లాఠీచార్జీలు, అరెస్టులు, జైలుకు పంపడం, అంత్యక్రియల సమయంలో శవాలను కూడా లాక్కెళ్లడం—ఇది బీఆర్ఎస్ పాలనలో జరిగిన దారుణం. గతంలో కేసీఆర్ పాలనలో జరిగిన తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ, ఆర్టీసీ కార్మికుల తరపున బిజెపి ఆధ్వర్యంలో ఉక్కు పడికిలి బిగించి పోరుబాట పడితే.. అనేక మంది బిజెపి నాయకులను, కార్యకర్తలను కేసీఆర్ సర్కారు అరెస్టు చేసి జైలుకు పంపింది. అనేకమందిపై లాఠీచార్జ్ లతో, నిర్బంధాలతో పీడించింది. PF బకాయిలు చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేసింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని నమ్మించి మోసం చేసింది. అలాంటి పార్టీ ఇప్పుడు మద్దతు అంటూ నటించడం సిగ్గుచేటు. కాబట్టి కాంగ్రెస్, బీఆర్ఎస్..ఇరు పార్టీలూ ఆర్టీసీ కార్మికులకు ద్రోహం చేసినవే. ఈ క్లిష్ట సమయంలో భారతీయ జనతా పార్టీ మాత్రమే కార్మికుల పక్షాన నిలబడి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో సమ్మెలో పాల్గొంటూ సంఘీభావం తెలుపుతోంది. కార్మికుల హక్కుల కోసం ఎన్. రాంచందర్ రావు గారి నాయకత్వంలో బీజేపీ శ్రేణులు నిరంతరం పోరాడుతున్నాయి, పోరాడుతూనే ఉంటాయి. అయితే కార్మికులు ఎవరూ కూడా అధైర్యపడి ఆత్మహత్యల వంటి నిర్ణయాలు తీసుకోకూడదు..ప్రాణం తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదు, మీ కుటుంబాలను బలి చేయొద్దు. మీ కోసం బీజేపీ ఉంది, మీ పోరాటం మా పోరాటమే. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి, కార్మికుల న్యాయమైన ప్రధాన డిమాండ్లు వెంటనే అమలు చేయాలి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి, ఉచిత బస్సు పథకం కింద నెలకు రూ.400 కోట్ల బకాయిలు విడుదల చేయాలి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, బ్రేడ్‌విన్నర్ పోస్టులను పర్మినెంట్ చేయాలి, అద్దె బస్సు డ్రైవర్లను సంస్థలో విలీనం చేయాలి, ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలి, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలి ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేత రాజకీయాలు మానుకుని కార్మికులతో చర్చలు జరిపి అన్ని డిమాండ్లు నెరవేర్చాలి. లేదంటే ఆర్టీసీ కార్మికుల పక్షాన భారతీయ జనతా పార్టీ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుంది.. ఇది హెచ్చరిక మాత్రమే కాదు, సంకల్పం.

ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు గత ప్రభుత్వ పాపమే

- **కార్మికుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమే!**
- **డాక్టర్ రేఖ బోయినపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్.**

హైదరాబాద్ , ఏప్రిల్ 24 (వెలుతురు):

నిన్న హైదరాబాద్‌లో ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ గారు ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరం. , వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. అయితే, ఈ విషాదాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తున్న విపక్షాలకు, ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలకు కొన్ని వాస్తవాలను గణాంకాలతో సహా వివరించాల్సిన బాధ్యత మాపై ఉంది.

గత ప్రభుత్వ (BRS) వైఫల్యాలు - గణాంకాలు:

నేడు మొసలి కన్నీరు కారుస్తున్న బీఆర్ఎస్ నేతలు, పదేళ్ల కాలంలో ఆర్టీసీని ఏ విధంగా నాశనం చేశారో ప్రజలు మర్చిపోలేదు.

బకాయిల కొండ:

2023 చివరి నాటికి కార్మికులకు రావల

సిన PF, CCS బకాయిలను **₹2,000 కోట్లకు** పైగా పెండింగ్‌లో పెట్టింది గత ప్రభుత్వమే.

అప్పుల భారం:

సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని నమ్మించి, మోసం చేసి దాదాపు **₹6,000 కోట్ల** అప్పుల ఊబిలోకి నెట్టారు.

కార్మికులపై అణిచివేత:

2019 సమ్మెలో 48,000 మంది కార్మికులను డిస్మిస్ చేస్తామని బెదిరించి, వారిని మానసిక క్షోభకు గురి చేసింది గత పాలన కాదా?

కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి గణాంకాలతో

సాక్ష్యం:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఆర్టీసీకి సరికొత్త జీవం పోసింది.

మహాలక్ష్మి పథకం:

202425 లో ప్రభుత్వం దాదాపు ₹3,866.30 కోట్లను నేరుగా ఆర్టీసీకి చెల్లించి, మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది.

బకాయిల చెల్లింపు:

గత ప్రభుత్వం పదిలేసిన **₹1,100 కోట్ల** పాత బకాయిలను (CCS & PF) విడతల వారీగా క్లియర్ చేశాం.

నూతన నియామకాలు:

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 1,132 కారుణ్య నియామకాలను పూర్తి చేసి బాధిత కుటుంబాలను ఆదుకున్నాం.

ప్రమాద బీమా:

ఆర్టీసీ ఉద్యోగులందరికీ ₹1 కోటి రూపాయల** గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కల్పించిన ఘనత మా ప్రభుత్వానిదే.

మా విజ్ఞప్తి:

నిన్నటి ఘటన వెనుక పదేళ్ల పాత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక ఒత్తిడి తప్ప, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యం ఏమీ లేదు. కార్మికుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. విపక్షాల రెచ్చగొట్టే మాటలు నమ్మి ఎవరూ ప్రాణాలు తీసుకోవద్దు. ఆర్టీసీని కాపాడుకోవడంలో మరియు కార్మికుల సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ వెనక్కి తగ్గదు.

చర్చలకు ప్రజాప్రభుత్వం సిద్ధం

- **క్షణికావేశంలో అఘాయిత్యాలకు పాల్పడవద్దు**
- **శంకర్ గౌడ్ అన్న మృతి దిగ్భ్రాంతికరం**
- **బీఆర్ఎస్, బీజేపీలు శవరాజకీయాలు చేయడం సిగ్గుచేటు**
- **ధైర్యంగా ఉండండి. సమస్యలను పరిష్కరించుకుందాం.**
- **ఆర్టీసీ కార్మికులకు ఇందిరాశోభన్ విజ్ఞప్తి**

హైదరాబాద్ , ఏప్రిల్ 24 (వెలుతురు):

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని, సానుకూల దృక్పథంతో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఇందిరా శోభన్ పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సహా మంత్రివర్గమంతా ఆర్టీసీ కార్మికుల పక్షాన ఉన్నారని గుర్తు చేశారు. ఆర్టీసీ ఉద్యోగి శంకర్ గౌడ్ మృతి చెందడంపై ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి అండగా ఉంటానన్న విషయాన్ని ఇందిరాశోభన్ గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులంతా ప్రజా ప్రభుత్వంలోని కుటుంబ సభ్యులేనని, క్షణికావేశంలో అఘాయిత్యాలకు పాల్పడి ప్రాణాలు తీసుకోవద్దని విన్నవించారు. మీ మీద ఆధారపడి ఓ కుటుంబం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, బలవన్మరణాలు సమస్యలకు పరిష్కారం కావని ఆమె ఉద్వేగభరితంగా విజ్ఞప్తి చేశారు.

రేవంత్ రెడ్డి సర్కార్ కార్మికుల పక్షపాతి

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఇందిరా శోభన్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల మాదిరిగా మేము తలుపులు మూసుకుని కూర్చోలేదని, రేవంతన్న సర్కార్ చర్చలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. ఆర్టీసీని కాపాడుకోవడంతో పాటు, దానిని నమ్ముకున్న కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, మీ ప్రతి సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, ధైరంగా ఉండాలని ఇందిరాశోభన్ భరోసా ఇచ్చారు.

బీఆర్ఎస్, బీజేపీవి శవ రాజకీయాలు

ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతల తీరును ఇందిరా శోభన్ తీవ్రంగా ఎండగట్టారు. ప్రస్తుతం ఇరుపార్టీల నాయకులు చేస్తున్న రాజకీయాలు చూస్తుంటే అసహ్యం వేస్తోందన్నారు. శవాల మీద పేలాలు ఏరుకునే రకం వారిదని.. ఒక కార్మికుడి మృతిని రాజకీయం చేయడానికి వారు పడుతున్న తాపత్రయం చూస్తే అసహ్యం వేస్తుందన్నారు. కేసీఆర్ హయాంలో సుమారు 50 మంది ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం పోరాడి ప్రాణాలు కోల్పోతే, ఆనాడు ఏ ఒక్క బీఆర్ఎస్ నాయకుడు కూడా నోరు మెదపలేదని, కనీసం వారి కుటుంబాలను పరామర్శించి, సంఘీభావం తెలిపిన పాపాన పోలేదని మండిపడ్డారు. నాడు కార్మికులను నడిరోడ్డుపై నిలబెట్టి, వారి ఉద్యోగాలకు భద్రత లేకుండా చేసి, గాలికి వదిలేసిన వారు.. నేడు నీతిమాలిన రాజకీయాలు చేస్తూ లబ్ధి పొందాలని చూడటం హాస్యాస్పదమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల ఆర్తనాదాలు వినిపించని వారికి, ఇప్పుడు అధికారం పోగానే కార్మికులపై ఎనలేని ప్రేమ నటిస్తున్నారని ఇందిరాశోభన్ ధ్వజమెత్తారు.

కార్మికులకు అండగా ప్రజా ప్రభుత్వం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ నుంచి మొదలుకొని, కార్మికుల సంక్షేమం వరకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని ఇందిరాశోభన్ పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని. కార్మికుల కష్టనష్టాలు తెలిసిన ప్రభుత్వం మాదని, మీ సమస్యలను చట్టబద్ధంగా, మానవీయ కోణంలో పరిష్కరించుకుందామన్నారు. ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అధైర్యపడకుండా, భవిష్యత్తుపై నమ్మకంతో ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం మీకు రక్షణ కవచంలా ఉంటుందని ఇందిరా శోభన్ పునరుద్ఘాటించారు.

.

బీజేపీ నిజ స్వరూపం బయటపడుతోంది

- **సామాన్య ప్రజలారా మేల్కొనండి.**
- **రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రశన్నకుమార్ శర్మ**

హైదరాబాద్ , ఏప్రిల్ 24 (వెలుతురు):

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రశన్న కుమార్ శర్మ మాట్లాడుతూ, దేశంలో జరుగుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, యువత, అలాగే అనగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ మరియు అన్ని కులాలకు చెందిన ప్రజలు లోతుగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ ప్రారంభ దశలో విలువలు, విధేయత, దేశభక్తి ఉన్న పార్టీగా చాలా మంది నమ్మకం కలిగి ఉన్నారని, కానీ కాలక్రమేణా ఆ విశ్వాసం తగ్గిపోతుందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ ప్రత్యర్థులపై కేసులు, దర్యాప్తు సంస్థల వినియోగం ద్వారా ఒత్తిడి తెచ్చి వారిని లొంగదీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

ఇటీవల రాజ్యసభ సభ్యుల విలీనాలు మరియు రాజకీయ మార్పులు చూస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోందని అన్నారు. ఒకప్పుడు ప్రజల గొంతుకగా భావించిన నాయకులు కూడా ఇప్పుడు అధికార పార్టీ వైపు చేరడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన పరిణామాలు మరువకముందే మరిన్ని రాజకీయ పరిణామాలు చోటుచేసుకోవడం గమనించాల్సిన విషయమని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా భారత విదేశాంగ విధానం సమతుల్యత కోల్పోతుందని, ఇతర దేశాలతో సంబంధాలు దేశ ప్రయోజనాలకు అనుకూలంగా ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

భవిష్యత్తులో చిన్న రాజకీయ పార్టీలు లేదా సాధారణ నాయకులు ప్రజల కోసం పోరాడడం కష్టమవుతుందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. భారత రాజ్యాంగంపై ఒత్తిడి పెరుగుతోందని, రాజకీయాల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అయితే ఈ పరిస్థితి శాశ్వతం కాదని, ప్రజలు చైతన్యంతో ముందుకు వస్తే మార్పు సాధ్యమని తెలిపారు. ప్రతిపక్షం బలంగా ఉండడం ప్రజాస్వామ్యానికి అవసరమని, గతంలో అన్ని పార్టీల నాయకులు కూడా ఇదే భావనతో ఉన్నారని గుర్తుచేశారు.

చివరిగా, ప్రజలు భావోద్వేగాలకు లోనుకాకుండా, ప్రతి అంశాన్ని విశ్లేషించి తమ నిర్ణయాలు తీసుకోవాలని ప్రశన్నకుమార్ శర్మ పిలుపునిచ్చారు...

ఏపీ సర్కార్ వైద్య విప్లవం

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఐ వైద్య సేవల సత్ఫలితాలు
- రాష్ట్రవ్యాప్తంగా 18 ఆసుపత్రుల్లో పైలట్ ప్రాజెక్టు విజయవంతం
- టీబీ, క్యాన్సర్ వంటి వ్యాధుల నిర్ధారణలో ఏఐ సాంకేతికత వినియోగం
- వైద్యుల పనిభారం తగ్గింపు.. ఏఐ స్క్రైబ్ ద్వారా 70 శాతం సమయం ఆదా
- ఏపీ మెడ్ టెక్ ఛాలెంజ్ ద్వారా 18 అంకుర సంస్థల ఎంపిక
- అత్యుత్తమ స్టార్టప్‌కు కోటి రూపాయల వర్క్ ఆర్డర్ ఇవ్వనున్న ప్రభుత్వం
- గ్రామీణ ప్రాంతాలకు టెలీమెడిసిన్ ద్వారా చేరువైన ఆధునిక వైద్యం
- సీఎం చంద్రబాబు విజన్‌తోనే ఏఐ క్లినిక్‌లు సాధ్యం: మంత్రి సత్యకుమార్
- అమరావతిలో త్వరలో జాతీయ స్థాయి డిజిటల్ హెల్త్ సదస్సు

అమరావతి వెలుతురు ఏప్రిల్ 24:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్న కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో రాష్ట్రంలోని 18 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఐ ఆధారిత వైద్య సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ నూతన విధానం ఆశించిన దానికంటే మెరుగైన ఫలితాలను ఇస్తున్నట్లు వైద్యారోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పష్టం చేసింది. ఏపీ మెడ్ టెక్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 297 అంకుర సంస్థలు (స్టార్టప్స్) పోటీ పడగా, క్యాథ్ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం 18 సంస్థలను ఎంపిక చేశారు. ఈ సంస్థలు ప్రస్తుతం డయాగ్నోస్టిక్ టూల్స్, స్మార్ట్ మానిటరింగ్, రిమోట్ కేర్ మరియు టెలీమెడిసిన్ వంటి విభాగాల్లో అత్యాధునిక సేవలను రోగులకు అందిస్తున్నాయి. దీనివల్ల గతంలో గంటల

తరబడి పట్టే వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇప్పుడు నిమిషాల్లోనే పూర్తవుతున్నాయి.

అంకుర సంస్థల భాగస్వామ్యంతో రోగులకు నాణ్యమైన చికిత్స అందించడమే కాకుండా, సదరు సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీ నజరానాలను ప్రకటించింది. నాలుగు కేటగిరీల్లో ప్రతిభ కనబరిచిన 12 స్టార్టప్‌లకు రూ. 5 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు నగదు పురస్కారాలు అందజేయనుంది. అన్నింటికంటే మిన్నగా అత్యుత్తమ సేవలందించే ఒక అంకుర సంస్థకు రూ. కోటి విలువైన వర్క్ ఆర్డర్‌ను కేటాయించనుంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించిన పరీక్షల్లో భాగంగా కేవలం 37 రోజుల వ్యవధిలోనే 12,677 మంది రోగులకు ఏఐ సాంకేతికతతో వైద్య సేవలు అందించడం విశేషం. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు వంటి ప్రధాన నగరాలతో పాటు పాడేరు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో కూడా ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా క్షయ (టీబీ), కంటి శుక్లాలు, సర్వైకల్ క్యాన్సర్ మరియు పసిపిల్లల్లో వచ్చే శ్వాసకోశ ఇబ్బందులను ఈ ఏఐ పరికరాలు అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించాయి. ఈ సాంకేతికత వల్ల వైద్యుల సమయం భారీగా ఆదా అవుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఏఐ స్క్రైబ్ అనే పరికరం ద్వారా రోగులతో వైద్యులు మాట్లాడినప్పుడు, వారి వివరాలను నమోదు చేయడంలో 70 శాతం సమయం ఆదా అయ్యింది. దేశంలోనే తొలిసారిగా 18 అంకుర సంస్థలను ఏకకాలంలో రంగంలోకి దించి వైద్య సేవలు అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గర్వంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత వల్లే ఈ డిజిటల్ విప్లవం సాధ్యమైందని ఆయన కొనియాడారు. ఈ ఆవిష్కరణల విజయగాథను ప్రపంచానికి చాటిచెప్పేందుకు అమరావతిలో త్వరలో ఒక భారీ సదస్సును నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి నేషనల్ హెల్త్ అథారిటీ, ఇండియా ఏఐ మిషన్, ఐఐటీ కాన్పూర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ప్రతినిధులను ఆహ్వానించనున్నారు. ఏపీ డిజిటల్ హెల్త్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు వ్యాధి హెచ్చరికలు జారీ చేస్తూ, డేటా ఆధారిత ప్రణాళికలతో ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యం.

జహీరాబాద్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ ఎన్నికల కలకలం

- **కాంగ్రెస్ గైర్హాజరు...బీఆర్ఎస్ ధర్నాతో ఉద్రిక్తత...**
- **మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ కౌన్సిలర్ల బైఠాయింపు....**
- **ఓటమి భయంతో కాంగ్రెస్ వెనకడుగు ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆరోపణ...**

జహీరాబాద్ , ఏప్రిల్ 24 (వెలుతురు):

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తత కు దారితీసింది. ఎన్నిక నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు మూకుమ్మడిగా గైర్హాజరు కావడంతో ఎన్నిక ప్రక్రియ రసాభాసగా మారింది.
ఎన్నిక సమయానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు తన అనుచర వర్గంతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాంగ్రెస్ సభ్యులు హాజరుకాకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎన్నిక నుంచి తప్పుకున్నారని మండిపడ్డారు.
అధికారులను అడ్డం పెట్టుకుని ఎన్నికను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై కూడా ఎమ్మెల్యే మాణిక్‌రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
ఈ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ధర్నా కారణంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.
ఇప్పటికీ కోఆప్షన్ సభ్యుల ఎన్నికపై స్పష్టత రాకపోవడంతో స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఎన్నిక ఎప్పుడు జరుగుతుందనే దానిపై అనిశ్చితి కొనసాగుతోంది.

షెడ్డు వేసి దేవస్థానం స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- **బిజెపి పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్**

యాదగిరిగుట్ట , ఏప్రిల్ 24 (వెలుతురు):

యాదగిరిగుట్ట పట్టణంలో సింహద్వారం ఎదురుగా దేవస్థానం స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు వేసి దేవస్థానం స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు . ఈ మేరకు ఆయన రేకుల షెడ్డు వేసిన స్థలాన్ని బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించి అక్కడ నిరసన కార్యక్రమం నిర్వహించారు దీంతో అక్కడికి దేవస్థానం డిఇఓ నవీన్ కుమార్ చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడికి వచ్చిన దేవస్థానం డిఇఓ నవీన్ కుమార్ కు ఈ విషయంపై వారు వినతిపత్రం అందజేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోని సింహద్వారం ముందు పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో దేవస్థానం స్థలంలో అక్రమంగా రేకుల షెడ్డు వేసిన స్థలం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ కొండపైన కొండ కింద దేవస్థానం ఆస్తులకు ఆదాయానికి గండి కొట్టేవారు పలువురు తయారయ్యారని విమర్శించారు . ఈ రేకుల షెడ్డు వేసి కబ్జా చేసేందుకు ఓ నాయకుడు ప్రయత్నించాడని ఆయన తీవ్రంగా ఆరోపించారు. అధికారులకు ఇవి కనిపిస్తలేవా ? ఇంత దర్జాగా చలివేంద్రం పేరు చెప్పి ఇంత పెద్ద రేకుల షెడ్డు ఎలా వేశారు ? మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేకుండా మున్సిపల్ కమిషనర్ కు దేవస్థాన ఈవో కు తెలియకుండా ఎలా వేస్తారు ? ఒక సామాన్యుడు ఇలాంటి పని చేస్తే అధికారులు ఊరుకుంటారా ? మరి ఈ వ్యవహారంలో ఎందుకు చూసి చూడకుండా ఉంటున్నారు అని ఆయన ప్రశ్నించారు. ... మున్సిపల్ కమిషనర్ ను తాము ఈ విషయమై వివరణ కోరగా షెడ్డు ఏర్పాటు విషయమై తనకేమీ తెలియదని మున్సిపల్ కమిషనర్ తమకు చెప్పారని కర్రె ప్రవీణ్ తెలిపారు . దేవస్థాన ఈఓ సైతం మాకు తెలియదు అని చెబుతున్నారు అని అన్నారు. మేము బిజెపి పార్టీ తరఫున సమాచారం ఇచ్చేవరకు దేవస్థాన అధికారులకు తెలియదా ? మరి మేము వచ్చినప్పుడు ఇప్పుడు ఏదో హడావిడిగా షెడ్డు నిర్మాణం తొలగించినారు. షెడ్డు నిర్మాణం తొలగించడం కాదు కచ్చితంగా షెడ్డు వేసి ఆక్రమణకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. దేవస్థానం అనుమతి లేకుండా షెడ్ ఎలా వేశారు, మున్సిపల్ కమిషనర్ కి తెల్వకుండా సానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎట్లా షెడ్ వేయించారు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలాంటి తీర్మానం లేకుండా సానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎలా వేయిస్తారు . ఈ వ్యవహారంపై అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం బిజెపి నాయకుల ఫిర్యాదు మేరకు దేవస్థానం అధికారులు అప్పటికప్పుడు రేకుల షెడ్డును తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ , పట్టణ మాజీ అధ్యక్షులు భువనగిరి శ్యామ్, మండల మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యం, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి నరేష్, సీనియర్ నాయకులు రంగసత్యం , నల్ల వెంకటరెడ్డి , బోడ సురేష్ , లెంకలపల్లి శ్రీను, పట్టణ కార్యదర్శులు ఆవుల సత్యం, ఆలేటి కర్ణ , దొమ్మాట ప్రభాకర్ , బుచ్చి బాబు , శ్రీశైలం , వంశీ, కర్రె లక్ష్మయ్య , విజయ్ రమేష్ , శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం కోసమే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో షెడ్డు ఏర్పాటు చేశాం

- **దేవస్థానం స్థలాన్ని ఆక్రమించలేదు.**
- **మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ పి సురేందర్ , మేనేజర్ శారదల వివరణ**

యాదగిరిగుట్ట , ఏప్రిల్ 24 (వెలుతురు):

యాదగిరిగుట్ట పట్టణంలోని సింహద్వారం ఎదురుగా ఉన్న స్థలంలో చలివేంద్రం కోసమే యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో షెడ్డు ఏర్పాటు చేశామని యాదగిరిగుట్ట మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ పి సురేందర్, మేనేజర్ శారదలు తెలిపారు. పట్టణంలోని సింహద్వారం ఎదురుగా షెడ్డు వేసిన విషయంపై వివాదం చేలరేగడంతో వారు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా ఉన్నందున యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో సుమారు 8 చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. ఈ మేరకు ఇప్పటికే రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ప్రారంభింప చేశామని అన్నారు. మూడో షెడ్డు ఏర్పాటు కోసం సింహద్వారం ముందు ఉన్న స్థలాన్ని ఎంపిక చేసామని అన్నారు . ఆ స్థలంలో తడకలతో చలివేంద్రం ఏర్పాటు చేయడానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతున్నందున అదే ఖర్చుతో విశాలంగా రేకుల షెడ్డు వేయించామని అన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ సూచనల మేరకే తామే ఏర్పాటు చేశామని అన్నారు. కాగా ఈ షెడ్డు ఏర్పాటు చేసేందుకు తాము ప్రయత్నాలు చేస్తుండగా దేవస్థానం వారు ఈ నెల 14న తమకు నోటీసు ఇచ్చారని తెలిపారు. తమ స్థలంలో షెడ్డు ఎలా ఏర్పాటు చేస్తారని తమ స్థలంలో షెడ్డు ఏర్పాటు చేయకూడదు అంటూ వారు నోటీసులో పేర్కొన్నారని శానిటరీ ఇన్స్పెక్టర్ సురేందర్ తెలిపారు. కాగా రోడ్డుకు ఇటువైపున ఉన్న ప్రాంతమంతా మున్సిపాలిటీకే చెందినదని బ్రహ్మోత్సవాల సందర్భంగా రోడ్డుకు ఇటువైపున ఉన్న ప్రాంతంలో మున్సిపాలిటీ వారే పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని గతంలోనే దేవస్థానం అధికారులు చెప్పారని అన్నారు. అందుకే రోడ్డు వెంట ఇటువైపున ఉన్న స్థలంలోనే తాము షెడ్డు ఏర్పాటు చేశామని అన్నారు. విశాలంగా షెడ్డు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కువ మొత్తంలో నీటి కుండలను ఏర్పాటు చేసి అత్యధిక మంది భక్తులకు మంచినీటిని అందించవచ్చని భావించామని అన్నారు. మున్సిపాలిటీ తరఫున తామే దగ్గర ఉండి ఈ షెడ్డును వేయించామని ఈ వ్యవహారంలో వస్తున్న ఆరోపణలు, విమర్శల్లో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. తాము దేవస్థానం స్థలాన్ని ఆక్రమించలేదని , కేవలం చలివేంద్రం కోసమే తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేశామని మున్సిపాలిటీ తరఫున ఏర్పాటు చేశామని ఇన్స్పెక్టర్ పి సురేందర్ మేనేజర్ శారదలు వివరించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ఫోటోలను వారు మీడియాకు ప్రదర్శించారు.

చేనేత సహకార సంఘాల సభ్యత్వ నమోదు ప్రారంభం

రామన్నపేట , ఏప్రిల్ 24 (వెలుతురు):

స్థానిక పట్టణ కేంద్రంలో గల చేనేత కాటన్ సహకార సంఘంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాగరాజు విచ్చేసి సహకార సంఘాల సభ్యత్వాల్లో నమోదుపై జరుగుతున్న కొన్ని అవకతవకల గురించి సంఘ పెద్దలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పద్మశాలి సహకార సంఘంలోని సభ్యత్వాలు గతంలో పలుకుబడి కలిగిన పద్మశాలి నాయకులు వారి వారి సొంత సభ్యులను మాత్రమే సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగం చేసేవారని. అందువలన సాధారణ మధ్యతరగతి కి చెందిన చేనేత వృత్తిపై ఆధారపడి బ్రతుకుతున్న వారికి ఎలాంటి సభ్యత్వాలను నమోదు చేయించకపోయారని దానివల్ల అనేక మంది చేనేత కార్మికులు ఇబ్బందులకు గురయ్యారని.తాను గత కొంతకాలంగా కొన్ని సంఘాలలో జరుగుతున్నటువంటి మోసాలను గమనించి.ఈ విషయంలో పూర్తి స్థాయిలో పద్మశాలి కులాలకు ఇకపై ఎలాంటి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో ఒక సంకల్పంతో ఒక్కడిగానే పోరాటం,చేస్తున్నానని. తనతో అందరూ సహకరించి తాను చేస్తున్న ఈ ఉద్యమానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియ అనంతరం సహకార సంఘాల యొక్క ఆస్తుల వివరాలు దానికి సంబంధించిన పూర్తి చిట్టా బయటకు తీయించి దానిలో ప్రతి పద్మశాలి సభ్యునికి వాటా ఉండేట్లుగా చేయడమే తన ముందున్న లక్ష్యమని తెలిపారు. కోట్ల రూపాయలు ఆస్తులు కలిగి ఉన్న సహకార సంఘాలు ఒక్క పూటైనా పట్టెడన్నం పద్మశాలి బిడ్డలకు పెట్టలేదని,చివరకు ఆపదలో ఉన్న ఏ ఒక్క చేనేత కుటుంబాన్ని ఏ సహకార సంఘం ఆదుకోలేదని వాపోయారు. ఇది మారాలని ఇదే విధంగా మన జాతి ఉన్నట్లయితే తొందరలోనే మన జాతిపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. సహకార సంఘాల్లో ప్రభుత్వం నుంచి వచ్చే రాబడి మిగులుబడి అనేది ఎవరికీ తెలియకుండా ఇన్ని రోజులు గడిసిపోయాయని ఆ రోజులు పోయాయని ఇప్పటి నుంచి ప్రతి పైసాకు లెక్క చెప్పే రోజులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కాటన్ సహకార సంఘం అధ్యక్షులు జెల్లా వెంకటేశం, పనం నరసింహ,పెండెం భావనాబుషి,పెండెం వేణు,దొంత నాగరాజు,గంజి అశోక్,పట్టణ కుల సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, కార్యదర్శి కైరంకొండ నాగభూషణం, తొర్ర పాండు,మహేశ్వర అశోక్, కైరంకొండ రాజేష్, ఉమాకాంతం, దొంత యాదగిరి, రాపోలు బలరాం, కృష్ణవేణి, విజయ, విజయలక్ష్మి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు... "శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ హత్యే"

జహీరాబాద్ , ఏప్రిల్ 24 (వెలుతురు):

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం పేర్కొన్నారు.నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ప్రభుత్వ వైఖరికి భయపడి ఆత్మాహుతి చేసుకోవడం తీవ్ర విషాదకరమని, ఇది పూర్తిగా ప్రభుత్వ హత్యేనని ఆయన ఆరోపించారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆర్టీసీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఆయన గుర్తు చేశారు. కార్మిక జేఏసీ 40 రోజుల ముందుగానే సమ్మె నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమ్మెకు వెళ్లిన కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, దీనిని రాజకీయ కుట్రగా మలచడం దుర్మార్గ చర్యగా విమర్శించారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ, కేటీఆర్, హరీష్ రావు ఎప్పటికప్పుడు పోరాడుతున్నారని నరోత్తం పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ఇప్పటికే చట్టం తీసుకువచ్చిన నేపథ్యంలో, అపాయింటెడ్ డేట్ ప్రకటించి అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.
ఇటీవల ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్న పేరుతో వాటిని ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల కార్మికుల్లో అనిశ్చితి నెలకొన్నదని తెలిపారు.సమ్మెకు దిగితే కొత్త నియామకాలు చేపడతామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు.
కార్మికులు ఎలాంటి అధిక డిమాండ్లు కోరడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయమని మాత్రమే కోరుతున్నారని నరోత్తం స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.
అలాగే శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం పూర్తిగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు యస్. గోపాల్ తదితరులు పాల్గొన్నారు

ఉపాధి హామీ కూలీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- **సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్**
- **ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ**

రామన్నపేట వెలుతురు ఏప్రిల్ 24:
ఉపాధి హామీ కూలీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఉపాధి హామీ పనులను గ్రామ కార్యదర్శి ఉమా శంకర్ తో కలిసి పరిశీలించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పనిచేస్తున్న కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లను, తాగు నీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలో పనిచేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై టోపీ లేక తలపాక ధరించాలని సూచించారు. అవసరమైనప్పుడు ఓ ఆర్ ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉదయశ్రీ, ఏఎన్ఎం కేతమ్మ, నడిగోటి గణేష్, జోగు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్

రామన్నపేట , ఏప్రిల్ 24 (వెలుతురు):

ఆర్టీసీ కార్మికులు ఆర్టీసీ రక్షణ కోసం, సమస్యల సాధనకై ఆర్టిసి కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపిన ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న ఆర్టిసి కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ తరుపున ఆయన పూర్తి మద్దతు తెలిపారు. అధికార దాహంతో, అబద్దాలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టిసి రక్షణ, సమస్యల పరిష్కారాల కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఆర్టిసి కార్మికులకు అండగా నిలవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తారు ఆర్టీసీ కార్మికులు ఎవరు ఆత్మ హత్యలకు పాల్పడవద్దని తమ హక్కులు పోరాడి సాధించుకోవాలన్నారు. మరణించిన ఆర్టీసీ కార్మికుడు కోలా శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

హైకోర్టు తీర్పు హర్షనీయం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం

రామన్నపేట , ఏప్రిల్ 24 (వెలుతురు):
మండల కేంద్రంలో మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్ మరియు హరీష్ రావులకు హైకోర్టులో ఊరట లభించడం హర్షనీయమని కోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం తెలిపారు మాజీ సీఎం కేసీఆర్ అపర భగీరథుడిలా కాలేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసి నిర్మించారని గుర్తు చేశారు. ప్రాజెక్టు ద్వారా రైతులకు గణనీయమైన పంటల దిగుబడి సాధించారని చెప్పారు కాలేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలమైందని తాగు సాగు పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో కాలేశ్వరం ప్రాజెక్టు కీలకంగా మారిందని తెలియజేసినారు కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలు మానుకొని కుంగిపోయిన మేడిగడ్డ మరమ్మత్తులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్ ఈడెం శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం ఎండి అమీర్ జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, బద్దుల రమేష్, ఎస్.కె చాంద్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న నాయకులు బొడ్డు అల్లయ్య, పిట్టె కృష్ణారెడ్డి, జెట్టి సైదులు, బొలుగుల కృష్ణ, నల్ల సైదులు, బొడ్డుపల్లి రాజు, కోనూరు లింగస్వామి, ఎండి మోసబ్, వర్కల మల్లేశం, పావిరాల నరసింహ, కర్రె శీను, పండుగ వెంకన్న తదితరులు పాల్గొనడం జరిగింది.